


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 219 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : హైదరాబాద్ శుక్రవారం 19 జూన్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 219 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : HYDERABAD FRI 19 JUNE 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Hyderabad, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur

# మూసీ కాలుష్యం కంటే..!

## కల్వకుంట్లోళ్ళ కడుపులోనే విషం ఎక్కువ..!



హైదరాబాద్ పెన్ పవర్:వనమహోత్సవం ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతూ కేసీఆర్ ఫ్యామిలీపై ఘాటైన వ్యాఖ్యలు చేశారు సీఎం రేవంత్. గురువారం ( జూన్ 18 ) గుర్రంగూడలో జరిగిన ఈ కార్యక్రమంలో పలు అభివృద్ధి పనులను వర్చువల్ గా ప్రారంభించారు సీఎం రేవంత్. మూసీ పునరుజ్జీవం చేస్తామంటే అడ్డుపడుతున్నారని.. మూసీలో ఉండే కాలుష్యం కంటే కల్వకుంట్లోళ్ల కడుపులో విషం ఎక్కువని అన్నారు. మూసీ పునరుజ్జీవం వద్దంటున్న సుధీర్ రెడ్డి గతంలో మూసీ కార్పొరేషన్ చైర్మెన్ పదవి ఎలా తీసుకున్నారని ప్రశ్నించారు. భూకబ్జాలతో ప్రజలకు సమస్య రావొద్దని హైడ్రా తెచ్చామని... హైడ్రాను భూతంలా చూపిస్తున్నారని మండిపడ్డారు.హైడ్రా పేదల జోలికి వెళ్ళదని.. కబ్జాదారుల భరతం పడుతుందని అన్నారు. వనస్థలిపురంలో దేవుడి భూములు కబ్జా పెట్టారని.. ప్రభుత్వ భూములు కబ్జా చేస్తే వీపులు సున్నం పెడతానని అన్నారు.

ఢిల్లీ కాలుష్య కోరల్లో చిక్కుకొని ప్రజలు ఇబ్బంది పడుతున్నారని.. మన హైదరాబాద్ కు ఆ పరిస్థితి రావొద్దని మొక్కల పెంపకం చేపట్టామని అన్నారు. మూసీ పునరుజ్జీవం చేస్తామంటే అడ్డుపడుతున్నారని.. మూసీ ఒడ్డున ప్రజలను తరలించి అభివృద్ధి చేస్తామంటే మోకాలడ్డుతున్నారని మండిపడ్డారు సీఎం రేవంత్.



## నీట్ పరీక్ష రాసే విద్యార్థులకు ఆర్టీసీ ఉచిత బస్సు

### మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్ పెన్ పవర్:నీట్ పరీక్ష రాసే విద్యార్థులకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం అందించాలని నిర్ణయించింది ప్రభుత్వం. ఈ మేరకు కీలక ప్రకటన చేశారు మంత్రి పొన్నం ప్రభాకర్. జూన్ 21న జరగనున్న నీట్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు ఉచిత ప్రయాణం అందిస్తున్నట్లు ప్రకటించారు

- మిగతా 2లో



## షబ్బీర్ అలీకి నోటీసులు ఇచ్చాం

హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణ కాంగ్రెస్‌లో అంతర్గత విబేధాలు రచ్చకెక్కడంతో అధిష్ఠానం సీరియస్ అయింది. ఎంతటి వారైనా సరే తమ వ్యక్తిగత సమస్యలను తెచ్చి పార్టీపై రుద్దవద్దని టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్, ఎంపీ మల్లు రవి హెచ్చరికలు జారీ చేశారు. గాంధీ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ

- మిగతా 2లో




## జూన్ 30న రైతు భరోసా

# నిధులు విడుదల

- జూన్ 30న రేవంత్ చేతుల మీదుగా రైతు భరోసా నిధులు విడుదల చేస్తామన్న ఉత్తమ్
- 7 రకాల సన్న వడ్లకు బోనస్ ఇవ్వనున్నట్టు వెల్లడి
- నీట్ పరీక్ష రాసే విద్యార్థులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తామన్న మంత్రి

హైదరాబాద్ పెన్ పవర్: రాయదుర్గం భూముల వేలంపై హైకోర్టు స్టే విధించింది. మూడు వారాలపాటు స్టే విధిస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. మూడు వారాల్లోపు కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులకు హైకోర్టు ఆదేశించింది. హైదరాబాద్ నాలెడ్జ్ సిటీలోని ఐదెకరాల భూమి వ్యవహారం మళ్లీ హైకోర్టుకు చేరిన సంగతి తెలిసిందే. రంగారెడ్డి జిల్లా రాయదుర్గం పాన్మక్త పరిధిలోని సర్వే నంబర్ 83/1లో గల ఈ భూమిని తెలంగాణ


- మిగతా 2లో

## రాయదుర్గం భూముల వేలంపై స్టే విధించిన హైకోర్టు

- రికార్డు ధర పలికిన హైదరాబాద్ భూములపై న్యాయ వివాదం.. ఎస్బీఐ పిటిషన్‌తో వేలానికి బ్రేక్
- రాయదుర్గం భూముల వేలం ప్రక్రియపై తెలంగాణ హైకోర్టు స్టే
- భూమి తమదేనంటూ కోర్టును ఆశ్రయించిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
- మే 28న ఎకరానికి రూ. 237 కోట్ల రికార్డు ధర పలికిన భూమి
- టీజీఐఐసీ, గౌరా వెంచర్స్‌కు కౌంటర్ దాఖలు చేయాలని నోటీసులు
- మూడు వారాల పాటు తదుపరి చర్యలు నిలిపివేయాలని ఆదేశం

హైదరాబాద్ పెన్ పవర్: రాయదుర్గం భూముల వేలంపై హైకోర్టు స్టే విధించింది. మూడు వారాలపాటు స్టే విధిస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. మూడు వారాల్లోపు కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులకు హైకోర్టు ఆదేశించింది. హైదరాబాద్ నాలెడ్జ్ సిటీలోని ఐదెకరాల భూమి వ్యవహారం మళ్లీ హైకోర్టుకు చేరిన సంగతి తెలిసిందే.ఽరంగారెడ్డి జిల్లా రాయదుర్గం పాన్మక్త పరిధిలోని సర్వే నంబర్ 83/1లో గల ఈ భూమిని తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (టీజీఐఐసీ) ఈ-వేలం ద్వారా విక్రయించడాన్ని సవాలు చేస్తూ ఎస్బీఐ 2 రిట్ పిటిషన్లు దాఖలు చేసింది.మే 6న ఇచ్చిన వేలం నోటిఫికేషన్‌తో పాటు మే 28న జరిగిన వేలం ప్రక్రియ, విక్రయాన్ని రద్దు చేయాలని బ్యాంకు కోరింది.

- మిగతా 2లో





## అనాథ పిల్లలకూ 'తల్లికి వందనం' మంత్రి నారా లోకేశ్ కీలక ఆదేశాలు

- పీఎంశ్రీ నిధుల వినియోగంలో దేశంలోనే ఏపీకి అగ్రస్థానం
- కేజీబీవీ హాస్టళ్లలో విద్యార్థినులందరికీ బంక్ బెడ్లు ఏర్పాటు చేయాలని ఆదేశం
- అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌లలో తెలుగు అకాడమీ పుస్తకాల విక్రయానికి నిర్ణయం
- చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచన

హైదరాబాద్ పెన్ పవర్::రాష్ట్ర విద్యా వ్యవస్థలో సమూల మార్పులకు శ్రీకారం చుడుతూ ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల ఆధునీకరణ కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎంశ్రీ పథకం నిధుల వినియోగంలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే ప్రథమ స్థానంలో నిలవడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఉండవల్లిలోని తన నివాసంలో

- మిగతా 2లో

## విప్ జారీ చేసినా ఫలితం లేదు.. ఉద్ధవ్‌కు షాక్ ఇచ్చిన ఎంపీలు!

- 9 మంది ఎంపీల్లో ముగ్గురే సమావేశానికి హాజరు
- ఢిల్లీలో నిర్వహించిన కీలక భేటీకి ఆరుగురు ఎంపీల గైర్హాజరు
- గైర్హాజరైన వారిపై తీవ్ర వ్యాఖ్యలు చేసిన సంజయ్ రౌత్
- సమావేశానికి వచ్చిన వారే తమవాళ్లని వ్యాఖ్య
- మిగతావాళ్లు ద్రోహులంటూ విమర్శలు
- వారు ఏక్‌నాథ్ షిండే శివసేనలో చేరనున్నారని జోరుగా ప్రచారం

- మిగతా 2లో





## రైతు బీమా ఎగ్గొట్టే కుట్ర..

### 7,600 మృతుల కుటుంబాలకు బీమా డబ్బులు రాలేదు: జీవన్ రెడ్డి

- బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను కనుమరుగు చేయాలని చూస్తున్నారన్న జీవన్ రెడ్డి
- కాంగ్రెస్ నాయకులనే ప్రజలు కనుమరుగు చేస్తారని వ్యాఖ్య
- ఉన్న పథకాలను చెడగొట్టొద్దని హితవు

- మిగతా 2లో



## పెట్రో ధరల తగ్గింపుపై ఆశలు.. ఇప్పుడే కుదరదంటున్న కేంద్రం!


- తగ్గిన పశ్చిమాసియా ఉద్రిక్తతలు
- దీంతో దిగొచ్చిన ముడి చమురు ధరలు
- రిటైల్ ధరలూ తగ్గుతాయని ప్రజల ఆశాభావం
- వెంటనే సాధ్యం కాదన్న సురేశ్ గోపీ
- ముడి చమురు సరఫరాలో ఇంకా ఇబ్బందులు
- అవి సద్దుమణిగాకే ఇంధన ధరల్లో సవరణకు అవకాశం

పెన్ పవర్ డెస్క్:అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు తగ్గినంత మాత్రాన దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు వెంటనే తగ్గవని కేంద్ర పెట్రోలియం, సహజవాయు శాఖ సహాయ మంత్రి సురేశ్ గోపీ స్పష్టం చేశారు. ఇంధన ధరల నిర్ణయంలో ముడిచమురు

- మిగతా 2లో

## టెలిగ్రామ్ ఒక కొత్త డార్క్ వెబ్.. సైబర్ క్రైమ్స్‌కు అడ్డా

### హైకోర్టుకు తెలిపిన కేంద్రం




పెన్ పవర్ డెస్క్:మెసేజింగ్ ప్లాట్‌ఫామ్ టెలిగ్రామ్ ఒక 'కొత్త డార్క్ వెబ్'గా రూపాంతరం చెందిందని, సైబర్ నేరగాళ్లు, ఉగ్రవాదులు, పరీక్షల అక్రమాలకు పాల్పడే ముఠాలకు ఇది అడ్డాగా మారిందని కేంద్ర ప్రభుత్వం ఢిల్లీ హైకోర్టుకు

- మిగతా 2లో

## పాకిస్థాన్‌లో అంతా ఐఎస్ఐ పెత్తనమే.. చట్టసభ నిర్ణయాలను ప్రభావితం చేశారు

### పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్

- ఐఎస్ఐ గుప్పిట్లోనే పాక్ చట్ట సభలు నడిచాయన్న ఖవాజా ఆసిఫ్
- ఇమ్రాన్ ఖాన్ పాలనలోనే ఈ పరిస్థితి తలెత్తిందని వ్యాఖ్య
- ఏకంగా స్పీకర్ నివాసంలో అధికారిక సమావేశాల్లో పాల్గొనేవారని వెల్లడి

పెన్ పవర్ డెస్క్:పాకిస్థాన్‌లో ప్రజాస్వామ్య పాలన అనేది కేవలం ఒక ప్రహసనమని.. అక్కడ తెరవెనుక అంతా సైన్యం, నిఘా సంస్థల మాటే నడుస్తుందని అంతర్జాతీయ సమాజం ఎప్పటి నుంచో చెబుతున్న పచ్చి నిజం. ఇప్పుడు అదే నిజాన్ని స్వయంగా ఆ దేశ రక్షణ మంత్రే పార్లమెంట్ వేదికగా అంగీకరించడం ప్రపంచవ్యాప్తంగా సంచలనం రేపుతోంది. పాక్ నిఘా సంస్థ 'ఐఎస్ఐ' గుప్పిట్లోనే ఆ దేశ చట్ట సభలు నడిచాయంటూ

- మిగతా 2లో



ఎడిటర్ వ్యూ

# యూపీలో ఎన్డీయే సరికొత్త వ్యూహాలు

ఉత్తరప్రదేశ్ రాజకీయాల్లో సమాజ్ వాదీ పార్టీ ని లక్ష్యంగా చేసుకుని అధికార ఎన్డీయే కూటమి సరికొత్త వ్యూహాలకు తెరలేపింది. మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో పార్టీల ఎంపీలు చీలిపోయి ఎన్డీఏకు మద్దతు ప్రకటించడంతో యూపీలోనూ అదే తరహా రాజకీయాలు జరుగుతాయన్న చర్చ ప్రారంభమయింది. యోగి ఆదిత్యనాథ్ క్యాబినెట్‌లో మంత్రి, సుహెల్‌దేవ్ భారతీయ సమాజ్ పార్టీ అధినేత ఓం ప్రకాష్ రాజ్‌భర్ చేసిన సంచలన వ్యాఖ్యలు యూపీ రాజకీయాల్లో పెను తుఫానును సృష్టించాయి. సమాజ్ వాదీ పార్టీకి చెందిన దాదాపు 21 మంది లోక్‌సభ ఎంపీలు బీజేపీ వైపు వచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని, త్వరలోనే ఎస్పీలో భారీ చీలిక రాబోతోందని ఆయన ప్రకటించారు. యూపీ మంత్రి ఓం ప్రకాష్ రాజ్‌భర్ తన సోషల్ మీడియా వేదికగా ఎస్పీ అగ్రనేత రామ్ గోపాల్ యాదవ్, కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు ఒక రహస్య లేఖ సమర్పించారని ఆరోపించారు. యూపీని గతంలో కుదిపేసిన మైనింగ్ కుంభకోణం, గోమతి రివర్ ఫ్రంట్ స్కామ్‌ల మాస్టర్‌మైండ్ ఎవరో అందరికీ తెలుసని.. ఇప్పుడు ఆ కేసుల ఉచ్చు గట్టిగా బిగుస్తుండటంతో ఎస్పీ నేతల్లో ఆందోళన మొదలైందని ఆయన పేర్కొన్నారు. దర్యాప్తు సంస్థల భయంతో , నియోజకవర్గాల నిధుల కోసమే స మొత్తం సమాజ్ వాదీ పార్టీ బీజేపీలో చేరేందుకు లోపాయకారీగా లైన్ క్లియర్ చేసుకుంటోందని, అందులో భాగంగానే 21 మందికి పైగా ఎంపీలు టచ్‌లోకి వచ్చారని రాజ్‌భర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. మంత్రి రాజ్‌భర్ చేసిన ఈ మైండ్ గేమ్‌పై సమాజ్ వాదీ పార్టీ అధినేత, లోక్‌సభ ఎంపీ అఖిలేష్ యాదవ్ అత్యంత ఘాటుగా స్పందించారు. ఇవన్నీ కేవలం ఓటమి భయంతో బీజేపీ ఆడుతున్న చౌకబారు నాటకాలని కొట్టిపారేశారు. లోక్‌సభ ఎన్నికల్లో యూపీ ప్రజలు బీజేపీకి గట్టి బుద్ధి చెప్పారని, ఆ పరాజయాన్ని జీర్ణించుకోలేక ఇటువంటి మైండ్ గేమ్స్ ఆడుతున్నారని మండిపడ్డారు. ప్రస్తుతం లోక్‌సభలో 37 స్థానాలతో మూడో అతిపెద్ద పార్టీగా అవతరించిన తమ పార్టీ ఎంతో పటిష్టంగా ఉందని, తమ పార్టీ ఎంపీలు ఎవరూ కూడా ప్రలోభాలకు లొంగే ప్రసక్తే లేదని అఖిలేష్ ధీమా వ్యక్తం చేశారు. పార్టీలో చీలిక వస్తుందంటూ జరుగుతున్న ప్రచారాన్ని అఖిలేష్ తిప్పికొడుతూ.. రాబోయే 2027 ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో తాము కాంగ్రెస్ పార్టీతో కలిసి ఉమ్మడిగానే పోటీ చేస్తామని స్పష్టం చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఏ విధంగానైతే మట్టికరిపించామో, రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లోనూ అదే ఫార్ములాతో యోగి ప్రభుత్వాన్ని గద్దె దించుతామని పునరుద్ఘాటించారు. ప్రతిపక్షాల మధ్య విభేదాలు సృష్టించి మైలేజ్ పొందాలని చూస్తున్న బీజేపీ పప్పులు ఉమ్మడి యూపీలో ఉడకవని, అసలైన ప్రజా సమస్యలైన నిరుద్యోగం, ఆరోగ్య రంగా పతనంపై మాట్లాడకుండా అధికార పక్షం ఇలాంటి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందని ఆరోపించారు. మహారాష్ట్రలో శివసేన కి చెందిన ఎంపీలు షిండే వర్గంలో విలీనం అయ్యారు. రాజ్‌భర్ చేసిన ఈ వ్యాఖ్యలు యూపీ రాజకీయ వర్గాల్లో తీవ్ర కలకలం రేపుతున్నాయి. లోక్‌సభలో మేజిక్ ఫిగర్ దాటినప్పటికీ, విపక్షాల బలాన్ని మరింత కుంగదీయాలనే వ్యూహంతో బీజేపీ ఆపరేషన్ లోటస్ ను దేశవ్యాప్తంగా విస్తరిస్తోందనే అనుమానాలు బలపడుతున్నాయి. అయితే, అఖిలేష్ యాదవ్ తన ఎంపీలు, కేడర్‌ను కాపాడుకుంటూ 2027 పోరుకు ఎలా సిద్ధం కాబోతున్నారనేది రాబోయే రోజుల్లో జాతీయ రాజకీయాల సరళిని శాసించనుంది

# రాయదుర్గం భూముల వేలంపై స్టే విధించిన హైకోర్టు

- మొదటి పేజి తరువాయి

పిటిషన్ వివరాల ప్రకారం.. ఉమ్మడి ఏపీ ప్రభుత్వం 2010లో రూ. 13.33 కోట్లకు ఈ భూమిని ఎస్బీఐకి కేటాయించింది. 2011లో ఒప్పందం కుదిరి భూమి స్వాధీనం చేసుకున్నారు. ఎస్బీహెచ్ బ్యాంక్, ?ఎస్బీఐలో విలీనం కావడంతో ఆ హక్కులు ఎస్బీఐకి వచ్చాయి. ఇక్కడ 'అడ్వాన్స్‌డ్ కెపబిలిటీ అండ్ ఇన్నోవేషన్ సెంటర్' పేరిట ముంబయి తర్వాత దేశంలోనే రెండో అతిపెద్ద కార్పొరేట్ కార్యాలయాన్ని నిర్మించాలని బ్యాంకు ప్రణాళిక వేసింది. వివిధ ప్రభుత్వ విభాగాల నుంచి అనుమతులు రావడంలో జాప్యం జరిగిందని, అయితే ప్రహరీ, మౌలిక వసతులు, ఏటీఎంల ఏర్పాటుకు ఇప్పటికే రూ. 21.50 కోట్లకు పైగా ఖర్చు చేశామని బ్యాంకు తెలిపింది. ప్రస్తుతం భూమి తమ ఆధీనంలోనే ఉందన్నారు. గడువు పొడిగింపునకు టీజీఐఐసీ గతంలో సిఫారసు చేసినప్పటికీ, ప్రభుత్వం 2021లో కేటాయింపును రద్దు చేసింది. దీనిపై బ్యాంకు కోర్టుకు వెళ్లగా, నిర్ణయాన్ని పునఃపరిశీలించాలని 2022లో హైకోర్టు ఆదేశించింది. అనంతరం 2024లో ప్రభుత్వం మళ్లీ కేటాయింపు రద్దు చేయగా ఎస్‌బీఐ కోర్టును ఆశ్రయించింది. ఆ సమయంలో రద్దు నిర్ణయాన్ని ఉపసంహరించుకుంటామని ప్రభుత్వం చెప్పడంతో, బ్యాంకు వినతిని పరిశీలించాలని కోర్టు కేసు ముగించింది. ఈ నేపథ్యంలో 2026 మే 4న ఎస్బీఐ అధికారులతో విచారణ జరిపిన టీజీఐఐసీ, దానిపై ఎలాంటి నిర్ణయం ప్రకటించకుండానే మే 6న వేలం నోటిఫికేషన్ ఇచ్చింది.

ఆ తర్వాత మే 23న గడువు పొడిగింపు అభ్యర్థనను తిరస్కరిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. కోర్టు ఆదేశాలు అమలులో ఉండగా వేలం వేయడం చట్టవిరుద్ధమని ఎస్బీఐ తరపు సీనియర్ న్యాయవాది బి.ఎస్. ప్రసాద్ వాదించారు. ఇటీవల వేలంలో ఎకరానికి రూ. 170 కోట్లకు పైగా ధర పలికిందని, గౌరా వెంచర్స్ అత్యధిక బిడ్డర్‌గా నిలిచిందని కోర్టుకు తెలిపారు. జస్టిస్ శ్రవణ్‌కుమార్ గురువారం ఈ పిటిషన్లపై విచారణ జరిపారు.

# జూన్ 30న రైతు భరోసా నిధులు విడుదల

- మొదటి పేజి తరువాయి

ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (టీజీఐఐసీ) ఈ-వేలం ద్వారా విక్రయించడాన్ని సవాలు చేస్తూ ఎస్బీఐ 2 రిట్ పిటిషన్లు దాఖలు చేసింది. మే 6న ఇచ్చిన వేలం నోటిఫికేషన్‌తో పాటు మే 28న జరిగిన వేలం ప్రక్రియ, విక్రయాన్ని రద్దు చేయాలని బ్యాంకు కోరింది. పిటిషన్ వివరాల ప్రకారం.. ఉమ్మడి ఏపీ ప్రభుత్వం 2010లో రూ. 13.33 కోట్లకు ఈ భూమిని ఎస్బీఐకి కేటాయించింది. 2011లో ఒప్పందం కుదిరి భూమి స్వాధీనం చేసుకున్నారు. ఎస్బీహెచ్ బ్యాంక్, ?ఎస్బీఐలో విలీనం కావడంతో ఆ హక్కులు ఎస్బీఐకి వచ్చాయి. ఇక్కడ 'అడ్వాన్స్‌డ్ కెపబిలిటీ అండ్ ఇన్నోవేషన్ సెంటర్' పేరిట ముంబయి తర్వాత దేశంలోనే రెండో అతిపెద్ద కార్పొరేట్ కార్యాలయాన్ని నిర్మించాలని బ్యాంకు ప్రణాళిక వేసింది. వివిధ ప్రభుత్వ విభాగాల నుంచి అనుమతులు రావడంలో జాప్యం జరిగిందని, అయితే ప్రహరీ, మౌలిక వసతులు, ఏటీఎంల ఏర్పాటుకు ఇప్పటికే రూ. 21.50 కోట్లకు పైగా ఖర్చు చేశామని బ్యాంకు తెలిపింది. ప్రస్తుతం భూమి తమ ఆధీనంలోనే ఉందన్నారు. గడువు పొడిగింపునకు టీజీఐఐసీ గతంలో సిఫారసు చేసినప్పటికీ, ప్రభుత్వం 2021లో కేటాయింపును రద్దు చేసింది. దీనిపై బ్యాంకు కోర్టుకు వెళ్లగా, నిర్ణయాన్ని పునఃపరిశీలించాలని 2022లో హైకోర్టు ఆదేశించింది. అనంతరం 2024లో ప్రభుత్వం మళ్లీ కేటాయింపు రద్దు చేయగా ఎస్‌బీఐ కోర్టును ఆశ్రయించింది. ఆ సమయంలో రద్దు నిర్ణయాన్ని ఉపసంహరించుకుంటామని ప్రభుత్వం చెప్పడంతో, బ్యాంకు వినతిని పరిశీలించాలని కోర్టు కేసు ముగించింది. ఈ నేపథ్యంలో 2026 మే 4న ఎస్బీఐ అధికారులతో విచారణ జరిపిన టీజీఐఐసీ, దానిపై ఎలాంటి నిర్ణయం ప్రకటించకుండానే మే 6న వేలం నోటిఫికేషన్ ఇచ్చింది. ఆ తర్వాత మే 23న గడువు పొడిగింపు అభ్యర్థనను తిరస్కరిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. కోర్టు ఆదేశాలు అమలులో ఉండగా వేలం వేయడం చట్టవిరుద్ధమని ఎస్బీఐ తరపు సీనియర్ న్యాయవాది బి.ఎస్. ప్రసాద్ వాదించారు. ఇటీవల వేలంలో ఎకరానికి రూ. 170 కోట్లకు పైగా ధర పలికిందని, గౌరా వెంచర్స్ అత్యధిక బిడ్డర్‌గా నిలిచిందని కోర్టుకు తెలిపారు. జస్టిస్ శ్రవణ్‌కుమార్ గురువారం ఈ పిటిషన్లపై విచారణ జరిపారు.

# నీట్ పరీక్ష రాసే విద్యార్థులకు ఆర్టీసీ ఉచిత బస్సు

- మొదటి పేజి తరువాయి

మంత్రి పొన్నం. పరీక్షా రాసే విద్యార్థులు హాల్ టికెట్ చూపిస్తే ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం అందించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ ఏడాది నీట్ పరీక్ష కోసం.. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (టీూా) కీలక మార్పులను ప్రకటించింది. ఎగ్జామ్ ను మరింత పారదర్శకంగా, సురక్షితంగా, విద్యార్థులకు అనుకూలంగా మార్చేందుకు ఎన్టీఏ కొత్త మార్గదర్శకాలను విడుదల చేసింది.

గతంలో ఉన్న నిబంధనలను సవరిస్తూ ఈసారి ఎగ్జామ్ టైంను 195 నిమిషాలకు పెంచారు. ఎగ్జామ్ మధ్యాహ్నం 2:00 గంటల నుంచి సాయంత్రం 5:15 గంటల వరకు జరగనుంది. ఎగ్జామ్ ప్రారంభానికి ముందు అటెండెన్స్ డాక్యుమెంట్స్ పై సైన్ లు చేయడం, ఇన్విజిలేషన్ లాంఛనాలు పూర్తి చేయడం వంటి పరిపాలనాపరమైన పనుల వల్ల.. విద్యార్థులు తమకు కేటాయించిన రాత సమయాన్ని నష్టపోకూడదనే ఉద్దేశంతో ఎన్టీఏ ఈ అదనపు సమయాన్ని కేటాయించింది.

దీనివల్ల అభ్యర్థులు ఎలాంటి ఒత్తిడి లేకుండా పరీక్ష రాయడంపైనే పూర్తిగా దృష్టి పెట్టవచ్చు. ఎగ్జామ్ రోజున విద్యార్థులకు పూర్తి స్పష్టత, సౌకర్యం కల్పించడమే లక్ష్యంగా తెచ్చిన ఈ కొత్త నిబంధనలను అభ్యర్థులందరూ గమనించాలని ఎన్టీఏ స్పష్టం చేసింది.

# పెట్రో ధరల తగ్గింపుపై ఆశలు.. ఇప్పుడే కుదరదంటున్న కేంద్రం!

- మొదటి పేజి తరువాయి

ధరలతో పాటు రవాణా, సరఫరా, మార్కెట్ పరిస్థితుల వంటి అంశాలు ప్రభావం చూపుతాయని తెలిపారు. తక్కువ ధరకు కొనుగోలు చేసిన ముడిచమురు భారత్‌కు చేరేందుకు సమయం పడుతుందని సురేశ్ గోపీ చెప్పారు. ముఖ్యంగా హర్మూజ్ జలసంధి మార్గంలో నౌకల రద్దీ ఎక్కువగా ఉండటంతో సరఫరా ప్రక్రియ సాధారణ స్థితికి రావాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అందువల్ల అంతర్జాతీయ ధరలు తగ్గిన వెంటనే దేశీయ ఇంధన ధరలను తగ్గించడం సాధ్యం కాదన్నారు. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల కారణంగా ఇటీవల గ్లోబల్ ఇంధన మార్కెట్లలో తీవ్ర ఒడుదొడుకులు చోటుచేసుకున్నాయని మంత్రి తెలిపారు. ముడిచమురు ధరల పెరుగుదల ప్రభావం పూర్తిగా వినియోగదారులపై పడకుండా కేంద్ర ప్రభుత్వం గణనీయమైన భారం భరించిందన్నారు. ఈ ప్రక్రియలో ప్రభుత్వానికి రూ. 12 వేల కోట్ల మేర నష్టం వాటిల్లిందని చెప్పారు. ఇంధన ధరలు పెరిగిన సమయంలో రాష్ట్ర ప్రభుత్వాలు తమ పన్నులను తగ్గించి ఆదాయాన్ని వదులుకోలేదని మంత్రి వ్యాఖ్యానించారు. కేంద్ర ప్రభుత్వం, చమురు మార్కెటింగ్ సంస్థలు కూడా ఆర్థికంగా నిలదొక్కుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గే దిశగా దౌత్యపరమైన ప్రయత్నాలు ముందుకు సాగడంతో అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు తగ్గుముఖం పట్టాయి. బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 78 డాలర్లకు చేరగా డబ్ల్యూటీఐ క్రూడ్ ధర 75 డాలర్ల స్థాయికి దిగివచ్చింది. అయితే ఈ తగ్గుదల ప్రభావం దేశీయ ఇంధన ధరలపై కనిపించాలంటే మరికొంత సమయం పట్టే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.

# పాకిస్థాన్‌లో అంతా ఐఎస్ఐ పెత్తనమే.. చట్టసభ నిర్ణయాలను ప్రభావితం చేశారు

- మొదటి పేజి తరువాయి

రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ నేరుగా జాతీయ అసెంబ్లీలోనే బాంబు పేల్చారు. పాక్ జాతీయ అసెంబ్లీ సమావేశాల్లో రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ మాట్లాడుతూ... మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ పాలనలోనే ఈ పరిస్థితి తలెత్తిందని ఆరోపించారు. నాడు ఐఎస్ఐ చీఫ్‌గా ఉన్న జనరల్ ఫైజ్ హమీద్‌కు ఇమ్రాన్ ప్రభుత్వం పూర్తి స్వేచ్ఛనిచ్చిందని... ఆయన ఏకంగా నాటి స్పీకర్ నివాసంలో జరిగిన అధికారిక సమావేశాల్లో పాల్గొని చట్టసభ కార్యకలాపాలను, కీలక నిర్ణయాలను శాసించారని వెల్లడించారు. ఐఎస్ఐ ఒత్తిళ్ల కారణంగానే చట్టసభలో కొన్ని కీలక మార్పులు చేయాల్సి వచ్చిందన్నారు. ముఖ్యంగా యాంటీ మనీలాండరింగ్ చట్ట సవరణ పూర్తిగా నిఘా సంస్థకు అనుకూలంగా, వారి ఆదేశాల మేరకే అమల్లోకి తెచ్చారని సంచలన నిజాలు బయటపెట్టారు.

అయితే ఇమ్రాన్ ఖాన్ కాలంలో ఐఎస్ఐ పెత్తనాన్ని తప్పుబట్టిన ఖవాజా ఆసిఫ్... తమ ప్రస్తుత ప్రభుత్వం మాత్రం సైన్యంతో కలిసి 'హైబ్రిడ్' విధానంలో నడుస్తోందని సమర్థించుకున్నారు. ప్రస్తుతం తమ దేశంలో పౌర-సైనిక హైబ్రిడ్ పాలనా విధానం అమలవుతోందని, దీనివల్ల మంచి ఫలితాలు వస్తున్నాయని పేర్కొనడం గమనార్హం. అంటే.. పేరుకు ప్రజా ప్రభుత్వం ఉన్నా, ఆర్మీ సపోర్ట్ లేనిదే తాము కూడా ఏమీ చేయలేమని ఆయన పరోక్షంగా ఒప్పుకున్నట్టయింది.

## అనాథ పిల్లలకూ 'తల్లికి వందనం' మంత్రి నారా లోకేశ్ కీలక ఆదేశాలు

- మొదటి పేజి తరువాయి

విద్యాశాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన సుదీర్ఘ సమీక్షలో ఈ ఘనత సాధించిన అధికారులను అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సంక్షేమం, అభ్యసన సామర్థ్యాల పెంపు, మౌలిక వసతుల కల్పనపై పలు ముఖ్యమైన నిర్ణయాలు తీసుకున్నారు.

**మౌలిక వసతులు, విద్యార్థి కిట్లపై ప్రత్యేక శ్రద్ధ**

రాష్ట్రవ్యాప్తంగా కడప మోడల్‌ను స్ఫూర్తిగా తీసుకుని ఈ ఏడాది 844 స్మార్ట్ కిచెన్ల నిర్మాణానికి తక్షణమే చర్యలు చేపట్టాలని మంత్రి లోకేశ్ అధికారులను ఆదేశించారు. ఇప్పటికే ప్రారంభమైన 'సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర' కిట్ల పంపిణీని మెగా పేరెంట్-టీచర్ మీటింగ్ (పీటీఎం) నాటికి పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అదేవిధంగా, రాష్ట్రంలోని 430 కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో (కేజీబీవీ) చదువుకుంటున్న 1,06,360 మంది విద్యార్థినులకు సౌకర్యవంతమైన వసతి కల్పించేందుకు 53,180 బంక్ బెడ్లను వెంటనే ఏర్పాటు చేయాలన్నారు. ఈ సదుపాయాన్ని ఏపీ రెసిడెన్షియల్ స్కూల్స్, కాలేజీలకు కూడా విస్తరించాలని సూచించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోని 2,03,430 మంది విద్యార్థులకు కూడా కిట్లు పంపిణీ చేస్తున్నట్లు అధికారులు మంత్రికి వివరించారు.

**అనాథ పిల్లలకు 'తల్లికి వందనం' భరోసా**

తల్లిదండ్రులు లేని అనాథ పిల్లలకు సైతం ప్రభుత్వ పథకాల ఫలాలు అందాలన్న లక్ష్యంతో మంత్రి లోకేశ్ కీలక నిర్ణయం తీసుకున్నారు. 'తల్లికి వందనం' పథకాన్ని అనాథ పిల్లలకు కూడా వర్తింపజేయాలని, ఇందుకోసం వారి గార్డియన్ల వివరాలను కచ్చితత్వంతో సేకరించాలని ఆదేశించారు.

# షబ్బీర్ అలీకి నోటీసులు ఇచ్చాం

- మొదటి పేజి తరువాయి

షబ్బీర్ అలీ, చంద్రశేఖర్ రెడ్డిల అంశంపై స్పందించారు.

ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీకి నోటీసులు జారీ చేశామని, ఆయన ఆదివారం కమిటీ ముందు హాజరవుతారని మల్లు రవి తెలిపారు. ఇరు పక్షాల వాదనలు విన్న తర్వాతే తుది నిర్ణయం ఉంటుందన్నారు. నేతలకు ఏమైనా సమస్యలు ఉంటే టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ లేదా రాష్ట్ర ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ దృష్టికి తీసుకెళ్లాలే తప్ప క్రమశిక్షణ ఉల్లంఘిస్తే ఊరుకోబోమని వార్నింగ్ ఇచ్చారు. మరోవైపు, కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ చంద్రశేఖర్ రెడ్డి ఇప్పటికే మల్లు రవిని కలిసి నోటీసులపై లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. కమిటీ ఏ నిర్ణయం తీసుకున్నా దానికి కట్టుబడి ఉంటానని ఆయన స్పష్టం చేశారు.

# విప్ జారీ చేసినా ఫలితం లేదు.. ఉద్ధవ్‌కు షాక్ ఇచ్చిన ఎంపీలు!

ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన (యూబీటీ)లో తిరుగుబాటు ఊహాగానాలు మరింత బలపడ్డాయి. పార్టీ విప్ జారీ చేసినప్పటికీ ఢిల్లీలో గురువారం నిర్వహించిన కీలక సమావేశానికి 9 మంది లోక్‌సభ ఎంపీల్లో కేవలం ముగ్గురు మాత్రమే హాజరయ్యారు. దీంతో పార్టీ మరోసారి చీలిక దిశగా వెళుతోందన్న చర్చ రాజకీయ వర్గాల్లో జోరందుకుంది.

పార్టీ ఎంపీల కోసం ఏర్పాటు చేసిన ఈ సమావేశానికి అరవింద్ సావంత్, అనిల్ దేశాయ్, రాజాభౌ వాజే మాత్రమే హాజరయ్యారు. మిగిలిన ఆరుగురు ఎంపీలు దూరంగా ఉండటం కలకలం రేపింది. ఈ పరిణామం ఏక్‌నాథ్ షిండే శివసేనలో చేరికపై వస్తున్న ప్రచారానికి మరింత బలం చేకూర్చింది. సమావేశానికి ముందు హాజరైన ఎంపీల పేర్లను ప్రత్యేకంగా నమోదు చేశారు. ఈ సందర్భంగా స్పందించిన సంజయ్ రౌత్ గైర్హాజరైన ఎంపీలపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సమావేశానికి వచ్చిన వారే తమవాళ్లని, రాని వాళ్లు ద్రోహులని మండిపడ్డారు. పార్టీని చీల్చేందుకు ప్రయత్నిస్తున్నవారిపై కూడా రౌత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. డబ్బు, కేంద్ర దర్యాప్తు సంస్థల బెదిరింపులతో తమను భయపెట్టలేరని వ్యాఖ్యానించారు. అవసరమైతే మళ్లీ జైలుకు వెళ్లేందుకూ సిద్ధమేనని చెప్పారు. ఆరుగురు ఎంపీల మద్దతుతో ప్రత్యేక గ్రూప్‌గా గుర్తింపు కోరుతూ తిరుగుబాటు ఎంపీలు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను సంప్రదించినట్లు బుధవారం వార్తలు వెలువడ్డాయి. పార్టీ ఫిరాయింపుల చట్టం ప్రకారం ప్రత్యేక గ్రూప్‌గా గుర్తింపు పొందాలంటే మూడొంతుల మద్దతు అవసరం. ప్రస్తుతం గైర్హాజరైన ఎంపీల సంఖ్య కూడా ఆ స్థాయిలో ఉండటం రాజకీయ ప్రాధాన్యం సంతరించుకుంది.

అయితే ఇప్పటివరకు ఆయా ఎంపీల నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. మరోవైపు ఈ వ్యవహారంపై ఏక్‌నాథ్ షిండే కూడా మౌనం పాటిస్తున్నారు. దీంతో మహారాష్ట్ర రాజకీయాల్లో తదుపరి పరిణామాలపై ఆసక్తి నెలకొంది.

## రైతు బీమా ఎగ్గొట్టే కుట్ర..

తెలంగాణలో రైతు సమస్యలను అధికార కాంగ్రెస్ పార్టీ పట్టించుకోవడం లేదని బీఆర్ఎస్ సీనియర్ నేత జీవన్ రెడ్డి విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో రైతు బీమా పథకాన్ని ఎగ్గొట్టడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తోందని మండిపడ్డారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను కనుమరుగు చేయాలని చూస్తే... ప్రజలు ఈ కాంగ్రెస్ నాయకులనే కనుమరుగు చేస్తారని అన్నారు. రాష్ట్రంలో వివిధ కారణాలతో దాదాపు 7,600 మంది రైతులు మరణిస్తే... వారికి అందాల్సిన రైతు బీమా డబ్బులు ఇప్పటివరకు రాలేదని జీవన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఎల్ఐసీకి ఇన్స్యూరెన్స్ ప్రీమియం సకాలంలో చెల్లించకపోవడం వల్లే ఈ క్లెయిమ్స్ ఆగిపోయాయనే వార్తలు వస్తున్నాయన్నారు. ఇది కేసీఆర్ తీసుకొచ్చిన పథకం కాబట్టే... దీనిని ఎలాగైనా మూలనపడేయాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వం కుట్ర చేస్తోందని మండిపడ్డారు. చేతనైతే కొత్త పథకాలు తేవాలి తప్ప, ఉన్న పథకాలను చెడగొట్టవద్దని హితవు పలికారు. మొత్తం 33 రకాల వడ్లు ఉంటే.. ప్రభుత్వం కేవలం 7 రకాల వడ్లను మాత్రమే బోనస్‌కు గుర్తిస్తోందన్నారు. అయితే ఈ 7 రకాల వడ్లు సాగు చేస్తే ఎకరానికి కేవలం 20 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వస్తుందని, అదే మిగతా 26 రకాల వడ్లు వేస్తే ఎకరానికి ఏకంగా 30 క్వింటాళ్ల పంట పండుతుందని చెప్పారు. ప్రభుత్వం చెప్పిన ఆ 7 రకాల వడ్లు పండించడం వల్ల రైతులు ఎకరానికి 10 క్వింటాళ్ల దిగుబడి నష్టపోతారని... అంటే ఒక్కో రైతు ఎకరానికి దాదాపు రూ. 24 వేల ఆదాయం కోల్పోయే ప్రమాదం ఉందని అన్నారు.

## టెలిగ్రామ్ ఒక కొత్త డార్క్ వెబ్.. సైబర్ క్రైమ్స్‌కు అడ్డా

- మొదటి పేజి తరువాయి

విన్నవించింది. నీట్-యూజీ 2026 రీ-టెస్ట్ నేపథ్యంలో టెలిగ్రామ్‌పై విధించిన తాత్కాలిక నిషేధాన్ని సమర్థిస్తూ ప్రభుత్వం ఈ మేరకు అఫిడవిట్ దాఖలు చేసింది. జూన్ 21న జరగనున్న నీట్ రీ-టెస్ట్‌ను పకడ్బందీగా నిర్వహించేందుకు ప్రభుత్వం ఈ చర్యలు చేపట్టింది. గత మే 3న జరిగిన నీట్ పరీక్ష పేపర్ లీక్ కావడం దేశవ్యాప్తంగా తీవ్ర దుమారం రేపింది. ఈ ఘటనపై సీబీఐ విచారణకు ఆదేశించడంతో పాటు, పరీక్షను రద్దు చేసి పునర్నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో, 'నీట్ మాఫియా' వంటి టెలిగ్రామ్ ఛానెళ్ల ద్వారా మళ్లీ అక్రమాలు జరగకుండా నిరోధించేందుకే జూన్ 22 వరకు ఈ తాత్కాలిక నిషేధం విధించినట్లు కేంద్రం స్పష్టం చేసింది. టెలిగ్రామ్‌లోని ప్రైవసీ ఫీచర్లను ఆసరాగా చేసుకుని నేరగాళ్లు తమ ఫోన్ నంబర్లు, ఐడీలను గోప్యంగా ఉంచుతూ సులభంగా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని ప్రభుత్వం తన అఫిడవిట్‌లో ఆరోపించింది. చైల్డ్ పోర్నోగ్రఫీ, మాదకద్రవ్యాల సరఫరా, ఉగ్రవాద ప్రచారం, సైబర్ దాడులు, ఆర్థిక మోసాలు వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు టెలిగ్రామ్ వేదికగా మారిందని పేర్కొంది.


మరోవైపు, ప్రభుత్వ నిర్ణయం భారతదేశంలోని సుమారు 150 మిలియన్ల వినియోగదారుల భావప్రకటనా స్వేచ్ఛను హరిస్తోందని ఆరోపిస్తూ టెలిగ్రామ్ సంస్థ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. కొందరు నేరగాళ్ల చర్యల వల్ల వినియోగదారులందరినీ శిక్షించడం సరికాదని వాదించింది. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన న్యాయస్థానం, టెలిగ్రామ్‌కు ఎటువంటి తక్షణ ఊరట కల్పించలేదు. నీట్ పరీక్ష పవిత్రతను కాపాడేందుకే ఈ తాత్కాలిక చర్యలు తీసుకున్నట్లు కేంద్ర ప్రభుత్వం పునరుద్ఘాటించింది.

పెన్ పవర్
తెలంగాణ రౌండప్


బాచుపల్లి తహశీల్దార్ వాణిరెడ్డికి ఆకుల సతీష్ ఫిర్యాదు చేస్తున్న చిత్రం..

# ప్రభుత్వ భూమిలో..! గిఫ్ట్ డీడ్‌లా..?

## నకిలీ పత్రాలతో అక్రమ రిజిస్ట్రేషన్లు జరిగాయని సతీష్ టీమ్ ఫిర్యాదు..



తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆకుల సతీష్ ప్రెస్ మీట్..

**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, జూన్ 18:** బాచుపల్లి గ్రామ పరిధిలోని సాయి నగర్‌లో సర్వే నంబర్ 186లో ఉన్న సుమారు 11 గుంటల (1320 చదరపు గజాలు) ప్రభుత్వ భూమిని అక్రమంగా ఆక్రమించి, నకిలీ పత్రాల ఆధారంగా రిజిస్ట్రేషన్లు చేస్తున్నారని ఆరోపిస్తూ, సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సామాజిక కార్యకర్త ఆకుల సతీష్ డిమాండ్ చేశారు.. ఈ మేరకు బాచుపల్లి ఎమ్మార్వో వాణిరెడ్డికి పూర్తి వివరాలతో ఫిర్యాదు సమర్పించినట్లు ఆయన తెలిపారు.. ప్రగతి నగర్ ఫౌండర్స్- కామ్రేడ్స్ పేరుతో కొందరు వ్యక్తులు ప్రభుత్వ భూమిని ఆక్రమించి గిఫ్ట్ డీడ్‌లు, ఇతర పత్రాలు సృష్టించినట్లు ఆరోపించారు.. ఆకుల సతీష్ మాట్లాడుతూ, రెవెన్యూ రికార్డుల ప్రకారం సర్వే నంబర్ 186 ప్రభుత్వ భూమిగా స్పష్టంగా నమోదై ఉన్నప్పటికీ, కొందరు వ్యక్తులు అప్పటి రికార్డులను పక్కనబెట్టి నకిలీ పత్రాలతో అక్రమ రిజిస్ట్రేషన్లు చేపట్టారని అన్నారు.. డాక్యుమెంట్ నెంబర్:10919/2005 ద్వారా ఆర్. శ్రీరాములు పేరిట, అనంతరం డాక్యుమెంట్ నెంబర్లు: 12141/2011, 2058/2011 ద్వారా సీపీఎం నేత బి.వి. రాఘవులుకు గిఫ్ట్ డీడ్ చేసినట్లు పేర్కొన్నారు.. ఈ లావాదేవీలకు చట్టబద్ధమైన టైటిల్ లేదా చైన్ డాక్యుమెంట్లు (మదర్ డాక్యుమెంట్) లేవని ఆయన ఆరోపించారు..

### మోసపూరిత రిజిస్ట్రేషన్‌లు..!

ప్రభుత్వ భూమిని ప్రైవేట్ సర్వే నంబర్ 182 గా చూపిస్తూ మోసపూరితంగా రిజిస్ట్రేషన్లు నిర్వహించినట్లు రికార్డులు సూచిస్తున్నాయని ఆకుల సతీష్ ఆరోపించారు.. ఇదే భూమిపై జీ౦5 భవన నిర్మాణం కోసం 2019లో హెచ్‌ఎండీఏకు దరఖాస్తు చేయగా, ప్రాథమిక అనుమతి లభించినప్పటికీ తుది అనుమతి మున్సిపల్ కార్పొరేషన్ ద్వారా జారీ కాలేదన్నారు. 2022 నుంచే ఈ అంశంపై పోరాటం చేస్తున్నప్పటికీ నోటీసులు మినహా, ఎటువంటి చర్యలు తీసుకోలేదని సతీష్ ఆరోపించారు..


ఆక్రమణలో ఉన్న సర్వే నెంబర్ 186 లోని 11 గుంటల ప్రభుత్వ భూమి..


GOVERNMENT OF TELANGANA
REVENUE DEPARTMENT

From
The Tahsildar
Bachupally Mandal

To
The Revenue Divisional Officer,
Malkajgiri Division
Medchal - Malkajgiri District

Respected Sir,

Lr.No. [illegible]/2026, dt: 26.05.2026.

Sub: Prajavani - [illegible]

Ref: 1) District Collector, Lr.No.[illegible]/2026, dt.08.04.2026.
2) Prajavani Petition No.[illegible]/2026/[illegible] A.Sathish, dt.06.04.2026.
3) Joint Report of the Mandal Girdawar and Mandal Surveyor, Bachupally Mandal dt.20.05.2026.

I invite kind attention to the subject and reference cited, wherein the complaint received by Sri Akula Sathish regarding Regarding Encroachments in Govt. Land of Sy No.186,Sai Nagar of Bachupally Village of Bachupally Mandal adjacent to Government School abd abutting Sy No.182(Pragathi Nagar, Vasavi Layout).

In this regard basing on the complaint a memo issued to Mandal Girdawar and Mandal Surveyor directed to action on illegal encroachments in Sy No .186 of Bachupally Village and Bachupally Mandal.

Further, it is submitted that as per the report submitted that the Mandal Girdawar and Mandal Surveyor has stated that the subject Land with the help of Village Map and other relevant Record it is found that the on going construction falls in Sy No.182/P & 186/p of VBachupally Village & Mandal as follows:

| Sl No. | Sy No. | Classification | Extent |
|---|---|---|---|
| 1 | 182/ P | Patta | 0-09 gts |
| 2 | 186/P | Govt Land | 0-11 gts |
| Total | | | 0-20 gts |

This is submitted for favour of kind information and action will be initiated and land encroached will be taken in to Government custody immediately.

Yours faithfully,
Tahsildar
Bachupally Mandal
26/5/26

Enclosure : As above.

Copy submitted to the District Collector Medchal-Malikagiri District for favor of kind information

ఆ 11 గుంటలు ప్రభుత్వ భూమిగా సర్వేతో తేల్చిన రెవెన్యూ అధికారులు..

- ప్రభుత్వ భూమి ఆక్రమణపై చర్యలకు ఆకుల సతీష్ డిమాండ్..
- సాయి నగర్‌లోని 11 గుంటల భూమిని కమ్యూనిటీ హాల్‌కు కేటాయించాలి..
- బాచుపల్లి సర్వే నెం.186లో 11 గుంటల ప్రభుత్వ భూమిపై కబ్జా ఆరోపణ..
- నకిలీ పత్రాలతో అక్రమ రిజిస్ట్రేషన్లు జరిగాయని సతీష్ టీమ్ ఫిర్యాదు..
- ప్రభుత్వ భూమిపై గిఫ్ట్ డీడ్‌లు చేసినట్లు ఆధారాలతో ఆరోపణలు..
- హెచ్‌ఎండిఏ అనుమతులు తక్షణమే రద్దు చేయాలని డిమాండ్..
- కబ్జా భూమిని కాపాడి కమ్యూనిటీ హాల్‌కు కేటాయించాలని విజ్ఞప్తి..
- బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సతీష్ డిమాండ్..




### సర్వేలోనూ 11 గుంటలు ప్రభుత్వ భూమిగానే..!

ఇటీవల ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో.. రెవెన్యూ అధికారులు నిర్వహించిన సర్వేలో, ఎమ్మార్వో కార్యాలయ రికార్డుల ప్రకారం వివాదాస్పదంగా ఉన్న, ఆ 11 గుంటలు ప్రభుత్వ భూమేనని తేలిందని ఆకుల సతీష్ తెలిపారు..ఈ నేపథ్యంలో సర్వే నంబర్ 186 లోని 11 గుంటల ప్రభుత్వ భూమిని వెంటనే స్వాధీనం చేసుకోవాలని, ఆ స్థలాన్ని సాయి నగర్ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు.. అదేవిధంగా కే.గోపాల్ రెడ్డి, ఆర్.శ్రీరాములు, బి.వి.రాఘవులుపై ప్రభుత్వ భూమి ఆక్రమణకు సంబంధించి కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు..

### అక్రమ లావాదేవీలు రద్దు చేయండి:ఆకుల సతీష్..

ప్రభుత్వ భూమిలో కబ్జాదారుల అక్రమ లావాదేవీలు తక్షణమే రద్దు చేయాలని, సంబంధిత రిజిస్ట్రేషన్‌లు, హెచ్‌ఎండిఏ అసంపూర్తి అనుమతులు రద్దుకు ఆకుల సతీష్ డిమాండ్ చేశారు.. డాక్యుమెంట్ నెంబర్లు: 10919/2005, 12141/2011, 2058/2011 లను రద్దు చేయాలని కోరారు.. హెచ్‌ఎండీఏ ప్రొసీడింగ్స్ నెంబర్: 029095/MED/R1/U6/HMDA/14102019ను కూడా రద్దు చేసి, మోసపూరితంగా పొందిన అన్ని అనుమతులను ఉపసంహరించాలన్నారు.. ప్రగతి నగర్‌లో పార్కుల ఆక్రమణలకు సహకరించిన వారు చివరకు ప్రభుత్వ భూములను కూడా కబ్జా చేశారని ఆరోపించిన ఆకుల సతీష్, ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కమ్యూనిస్టులు ప్రభుత్వ భూములను కాపాడాల్సింది పోయి వాటినే ఆక్రమించి గిఫ్ట్ డీడ్లు చేయడం విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు.. ఈ కార్యక్రమంలో ప్రసాద్, అరుణ్‌రావు, ఈశ్వర్‌రెడ్డి, ఎల్లస్వామి తదితరులు పాల్గొన్నారు.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# ధాన్యం కొనుగోలుపై చేతులెత్తేసిన సర్కారు

## మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శ



**హైదరాబాద్ పెన్ పవర్:** ధాన్యం కొనుగోలుపై కాంగ్రెస్ ప్రభుత్వం చేతులెత్తేసిందని, ఇది రైతాంగాన్ని దారుణంగా మోసం చేయడమే అని భారాస శాసనసభా పక్ష ఉపనేత టి.హరీశ్‌రావు విమర్శించారు. అనధికారిక మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలపై గురువారం ఆయన ఒక ప్రకటనలో స్పందించారు. “ఇకపై పాత విధానంలో కొనుగోలు చేయకుండా.. కేంద్రం నిర్దేశించిన కోటాకు లోబడి మాత్రమే ధాన్యం కొనుగోలు చేస్తామని చెప్పడమంటే.. ధాన్యం కొనుగోళ్ల నుంచి రాష్ట్ర ప్రభుత్వం వైదొలగడమే. మొన్నటి వ్యవసాయ సమీక్షలో పంట బోనస్‌కు కోతలు పెట్టిన ప్రభుత్వం.. నేడు డిజిటల్ క్యాబినెట్ పేరుతో ధాన్యం కొనుగోలుపై తన చేతగానితనాన్ని మీడియా సాక్షిగా అంగీకరించింది. రోజుకో వింత నిర్ణయంతో కాంగ్రెస్ ప్రభుత్వం.. రైతు బతుకును చిత్తు చేస్తోంది. వ్యవసాయాన్ని సంక్షోభంలోకి నెడుతోంది. రాష్ట్ర ప్రభుత్వానికి పంటలు కొనుగోలు చేయడం చేతకాదా అని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రశ్నించిన రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు ఎందుకు కేంద్రాన్ని సాకుగా చూపి రైతుల గొంతు కోస్తున్నారు? రైతులు పండించిన పంటను ప్రభుత్వం కొనకపోతే.. ఆ పంటను రైతులు ఏం చేయాలి?

-4లో


# యువవికాసం అమలుకు కార్యాచరణ సిద్ధం చేయండి



**హైదరాబాద్ పెన్ పవర్:** మైనార్టీల సామాజిక, ఆర్థిక, విద్యాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. తెలంగాణ ఉర్దూ అకాడమీ స్వర్ణోత్సవాల సందర్భంగా హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంతోపాటు జిల్లా కేంద్రాల్లో ఉర్దూ కవి సమ్మేళనాలు(ముషాయిరా) నిర్వహిస్తామన్నారు. రాష్ట్రంలో 20 మైనార్టీ గురుకులాల భవన నిర్మాణాలు పూర్తయి ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నాయని వెల్లడించారు. గురువారమిక్కడ సచివాలయంలో మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి అజారుద్దీన్‌తో కలిసి భట్టి సమీక్ష నిర్వహించారు. రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా పెద్ద ఎత్తున ఆర్థిక సహాయం అందించనున్నామని, దీని అమలుకు కార్యాచరణ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. “వక్ఫ్, ఇతర భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడేందుకు చర్యలు తీసుకోవాలి. శ్మశాన వాటికల చుట్టూ ప్రహరీల నిర్మాణానికి ప్రాధాన్యమివ్వాలి. ముస్లిం జనాభా ఎక్కువగా ఉన్న జిల్లా, డివిజన్ కేంద్రాల్లో శ్మశాన వాటికల కోసం జిల్లా కలెక్టర్లు స్థలాలను కేటాయించాలి” అని తెలిపారు.

-4లో

- బాలానగర్--నర్సాపూర్ 200 అడుగుల వెడల్పు రహదారిలో తీవ్ర ట్రాఫిక్ సమస్య..
- పర్యవేక్షణతోనే సరి పెడుతున్న అధికారులు..! పనుల్లో వేగవంతం జీరో..!
- 5 నిమిషాల ప్రయాణం 20 నిమిషాలకు పెరిగిందని వాహనదారుల ఆవేదన..
- జోనల్ కమిషనర్, ట్రాఫిక్ ఏసీపీ పరిశీలించినా పనుల్లో వేగం శూన్యం..!
- గతేడాది వరద కాలువ పనులతోనూ.. ఇదే తరహా, ఇదే ప్రాంత ప్రజలు ఇబ్బందులు..
- కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుని పనులు త్వరగా పూర్తి చేయాలని ప్రజల డిమాండ్..







# 'నత్తనడకన' పనులు..! ప్రజలకు ట్రాఫిక్ సమస్యలు..!

- మూడు నెలలుగా సాగుతున్న డ్రైనేజ్ పైప్‌లైన్ పనులు..
- సామాజిక వేత్త కోలా రవీందర్ ముదిరాజ్ సంబంధిత అధికారులకు విజ్ఞప్తి..

**ఉన్నతాధికారుల సందర్శనతోనూ పనుల్లో వేగం శూన్యం..**

**కుత్బుల్లాపూర్, పెన్ పవర్, జూన్ 18:** సూరారం చౌరస్తాలో పైప్‌లైన్ పనుల పేరిట ప్రజలకు నరకయాతన చవిచూస్తున్నారు..! మూడు నెలలుగా నత్తనడకన సాగుతున్న పైపులైన్ పనులపై స్థానికులు, వాహన దారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.. బాలానగర్--నరసాపూర్ ప్రధాన రహదారిపై సూరారం చౌరస్తా వద్ద చేపట్టిన డ్రైనేజ్ పైప్‌లైన్ నిర్మాణ పనులు గత మూడు నెలలుగా నత్తనడకన సాగుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, సామాజిక వేత్త, పర్యావరణ ప్రేమికుడు కోల రవీందర్ ముదిరాజ్ ఆవేదన వ్యక్తం చేశారు.. నిత్యం వేలాది మంది ఉద్యోగులు, విద్యార్థులు, వాహన దారులు ప్రయాణించే ఈ ప్రధాన రహదారిపై పనుల ఆలస్యం అవుతుండటంతో ట్రాఫిక్ సమస్య రోజురోజుకూ తీవ్రమవుతోందని ఆయన అన్నారు.. దాదాపు మూడు నెలల క్రితం ప్రారంభమైన ఈ పైప్‌లైన్ పనులు, ఇప్పటికీ పూర్తికాక పోవడంతో రహదారిపై భారీగా వాహనాలు నిలిచిపోతున్నాయి.. సాధారణంగా ఐదు నిమిషాల్లో చేరాల్సిన గమ్యానికి, ప్రస్తుతం 20 నిమిషాలకుపైగా సమయం పడుతోందని స్థానికులు వాపోతున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ రద్దీ మరింత పెరిగి ఉద్యోగులు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు..

ఈ సమస్యపై ఇప్పటికే సంబంధిత అధికారులు స్పందించినప్పటికీ, పనుల పరిస్థితిలో మార్పు కనిపించలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.. జోనల్ కమిషనర్, ట్రాఫిక్ ఏసీపీ, పోలీసు ఉన్నతాధికారులు సంబంధిత ప్రాంతాన్ని సందర్శించి పరిశీలించినప్పటికీ పనుల్లో వేగం పెరగలేదని విమర్శలు తలెత్తుతున్నాయి.. ట్రాఫిక్ నియంత్రణ కోసం పోలీసులు నిరంతరం శ్రమిస్తున్నప్పటికీ, అసలు సమస్యకు పరిష్కారం మాత్రం కనిపించడం లేదని స్థానికులు అంటున్నారు.. గతేడాది ఇదే రహదారిపై వరద కాలువ నిర్మాణ పనుల కారణంగా కూడా ప్రజలు, వాహనదారులు నెలల తరబడి ఇబ్బందులు ఎదుర్కొన్నారని గుర్తు చేస్తున్నారు. ఇప్పుడు మరోసారి పైప్‌లైన్ పనులు సుదీర్ఘంగా సాగుతుండటంతో ప్రజల్లో అసహనం పెరుగుతోందని పేర్కొన్నారు.. ఈ నేపథ్యంలో పనులు చేపట్టిన కాంట్రాక్టర్‌పై ప్రభుత్వ ఉన్నతాధికారులు కఠిన చర్యలు తీసుకుని, డ్రైనేజ్ పైప్‌లైన్ నిర్మాణాన్ని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయించేలా చర్యలు చేపట్టాలని కోల రవీందర్ ముదిరాజ్ డిమాండ్ చేశారు. ప్రజల విలువైన సమయం వృథా కాకుండా, ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు. అధికారులు ఇకనైనా స్పందించి పనులను వేగవంతం చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు..




నర్సాపూర్ హైవే, సూరారం చౌరస్తాలో ట్రాఫిక్ సమస్యలు..



సూరారం చౌరస్తాలో ట్రాఫిక్ సమస్య..



# ధాన్యం కొనుగోలుపై చేతులెత్తేసిన సర్కారు

-3 పేజి తరువాయి

కేంద్ర కోటాల పేరుతో కొనుగోలుకు పరిమితులు విధించడమంటే.. రైతులను మార్కెట్ దయాదాక్షిణ్యాలకు వదిలేయడమే. వరికి బోనస్ రావాలంటే.. ఏడు రకాల సన్నాలే సాగు చేయాలని చెప్పడమంటే కూడా సాగుపై ఆంక్షలు విధించడమే. రైతన్నను కేసీఆర్ రాజుగా చేస్తే.. రేవంత్‌రెడ్డి దివాలా తీయించేలా కుట్రలకు తెరలేపారు. రుణమాఫీ, రైతు భరోసా, రైతు బీమా, పంట బోనస్, కొనుగోళ్లు, నీటి సరఫరా, కరెంట్ సరఫరా.. ఇలా అన్నింటిలో కోతలు పెడుతూ రైతుకు తీరని ద్రోహం చేస్తున్నారు. పంట కొనుగోళ్ల బాధ్యత నుంచి ప్రభుత్వం తప్పించుకోవాలని చూస్తే.. తెలంగాణ రైతాంగం నుంచి తీవ్ర ప్రతిఘటన తప్పదు" అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

# యువవికాసం అమలుకు కార్యాచరణ సిద్ధం చేయండి

-3 పేజి తరువాయి

హైదరాబాద్‌లో మొహర్రం సందర్భంగా 9వ రోజున నిర్వహించే ప్రత్యేక కార్యక్రమానికి రావాలని డిప్యూటీ సీఎంను మంత్రి అజారుద్దీన్ ఆహ్వానించారు. ఈ సమీక్షలో ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, ఉన్నతాధికారులు గౌరవ్ ఉప్పల్, సిక్తా పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ గుర్తింపు సంఘాల ఎన్నికల ప్రక్రియ షెడ్యూల్ విడుదల చేయండి

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రజా పాలన ప్రభుత్వం ఏర్పడి 30 నెలలు పూర్తయిన సందర్భంగా తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ టీజీఎస్ఆర్టీసీ పురోగతి, భవిష్యత్ కార్యాచరణపై సచివాలయంలో రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ. 2023-26 మధ్యకాలంలో ప్రజా పాలన ప్రభుత్వం రూ. 1,078 కోట్ల వ్యయంతో 2,815 నూతన బస్సులను కొనుగోలు చేసిందని తెలిపారు. అలాగే ఏటూరు నాగారం, పెద్దపల్లి ప్రాంతాల్లో రెండు కొత్త డిపోలను మంజూరు చేసినట్లు వెల్లడించారు. తార్నాక ఆర్టీసీ ఆసుపత్రిని ప్రాథమిక వైద్య సేవల స్థాయి నుంచి సూపర్ స్పెషాలిటీ సేవలు అందించే ఆసుపత్రిగా అభివృద్ధి చేసినట్లు తెలిపారు. బ్రెడ్ విన్నర్ స్కీమ్, మెడికల్ ఇన్వాలిడేషన్ కింద మొత్తం 1,137 కారుణ్య నియామకాలు చేపట్టినట్లు చెప్పారు. వీరిలో 888 మంది కండక్టర్లు, 10 మంది డ్రైవర్లు, 43 మంది శ్రామిక్‌లు, 196 మంది కానిస్టేబుళ్లు ఉన్నారని వివరించారు. ఆర్టీసీ ఆర్థిక పరిస్థితి మెరుగుదలకు ప్రభుత్వం తీసుకున్న చర్యల వల్ల సీఎస్ఎస్ బకాయిలు రూ. 1,096.90 కోట్ల నుంచి రూ. 862 కోట్లకు తగ్గాయని, పీఎఫ్ బకాయిలు రూ. 2,018.15 కోట్ల నుంచి రూ. 1,714.39 కోట్లకు తగ్గాయని తెలిపారు. అలాగే ఎస్ఆర్బీఎస్, ఎస్బీటీ బకాయిలను కూడా రూ. 493.02 కోట్ల మేర తగ్గించినట్లు పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న అర్హులైన కారుణ్య నియామకాలను వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సర్వీసు నుంచి తొలగించబడిన 490 మంది ఉద్యోగుల్లో ఇప్పటికే 244 మందిని విధుల్లోకి తీసుకున్నామని, మిగిలిన కేసులను త్వరితగతిన పరిశీలించాలని సూచించారు. మహాలక్ష్మీ పథకం మహిళల ఆర్థిక సాధికారతపై చూపుతున్న ప్రభావాన్ని అధ్యయనం చేసి ఫీడ్‌బ్యాక్ నమోదు చేయాలని ఆదేశించారు. మహిళా సంఘాలను 553 బస్సులకు యజమానులుగా చేసి ఆర్టీసీకి అద్దె ప్రాతిపదికన అందిస్తున్న నేపథ్యంలో వారి అభిప్రాయాలను కూడా సేకరించాలని సూచించారు. రాష్ట్రంలో ప్రస్తుతం 1,050 ఎలక్ట్రిక్ బస్సులు నడుస్తున్నాయని, అవి ఏ రూట్లలో నడుస్తున్నాయి, లాభదాయక రూట్లు ఏవి, నష్టాలు వస్తున్న మార్గాలు ఏవి అనే అంశాలపై సమగ్ర నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు.

ఈ సమీక్షా సమావేశంలో ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి,ఈడిలు,ఇతర విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పొ. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## రోడ్డు ప్రమాదంలో తల్లిదండ్రులు, కొడుకు మృతి

**హైదరాబాద్ పెన్ పవర్:**
మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మురహరపల్లి రాజీవ్ రహదారిపై అర్ధ రాత్రి జరిగిన ప్రమాద ఘటన స్థలాన్ని మేడ్చల్ ఏసిపి శంకర్ రెడ్డి పరిశీలించారు. ఈ ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు వ్యక్తులు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో కరీంనగర్ కు చెందిన రైల్వే ఉద్యోగి చంద్ర శేఖర్ మరియు అతని భార్య రేఖ మరియు రేఖ చెల్లెలి కుమారుడు నిహాల్ 2 సంవత్సరాలు ఈ ప్రమాదంలో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. అర్థరాత్రి రెండు గంటల సమయంలో కారు అదుపు తప్పి అటుగా వస్తున్న లారీని బలంగా ఢీ కొనడంతో కారులో ప్రయాణిస్తున్న నలుగురిలో ముగ్గురు అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు. ఈ ప్రమాదానికి నిద్ర మత్తె కారణమని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతులను పోస్ట్ మార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించామని ఏసీపీ మీడియాకు తెలిపారు..

## ఆర్టీసీ పురోగతిపై మంత్రి పొన్నం సమీక్ష



**హైదరాబాద్ పెన్ పవర్:** : ప్రజా పాలన ప్రభుత్వం ఏర్పడి 30 నెలలు పూర్తయిన సందర్భంగా టీజీఎస్ఆర్టీసీ పురోగతి, భవిష్యత్ కార్యాచరణపై మంత్రి పొన్నం ప్రభాకర్ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు.

ఆర్టీసీ సమ్మె సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఆర్పీఎస్-2021కు సంబంధించిన 11 శాతం ఫిట్మెంట్ను జూలై 1 నుంచి అమలు చేయాలని నిర్ణయించాం. అలాగే ఆర్టీసీ గుర్తింపు సంఘాల ఎన్నికల షెడ్యూల్ను త్వరలో విడుదల చేసి ఎన్నికల ప్రక్రియను ప్రారంభించాలని ఆదేశించారు. నాగర్కర్నూల్, పెద్దపల్లి డిపో పనులను వేగవంతం చేయడంతో పాటు మంజూరైన బస్ స్టేషన్ల శంకుస్థాపనలకు కార్యాచరణ రూపొందించాలని సూచించాను. ఆత్మహత్య చేసుకున్న ఉద్యోగి శంకర్ కుటుంబానికి రూ. 1 కోటి చెక్కు, కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం, ఇందిరమ్మ ఇల్లు అందించే ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

త్వరలో దక్షిణ భారత రాష్ట్రాల రవాణా శాఖ మంత్రులు, ప్రిన్సిపల్ సెక్రటరీలు, కమిషనర్లు, ఆర్టీసీ ఎండీలతో సమావేశం నిర్వహించి ప్రజా రవాణా వ్యవస్థ అభివృద్ధిపై చర్చించనున్నాముని మంత్రి వెల్లడించారు.

## ఎస్సీ బాలికల హాస్టల్ లో నీటి పైపుకు లీకేజీ

**హైదరాబాద్ పెన్ పవర్:** కళ్యాణదుర్గం కేంద్రంలోని దొడగట్ట రోడ్ లోని ఎస్సీ బాలికల హాస్టల్. ఈ హాస్టల్ ప్రాంగణంలో సత్యసాయి నీటి సరఫరా పైప్ లైన్ కు లీకేజీ పడింది. పదిరోజులుగా నీటి ప్రవాహం కొనసాగుతుంది. సెలవుల అనంతరం హాస్టల్ కి విద్యార్థినులు వచ్చేశారు. ఈ నీటి ప్రవాహం లోనే విద్యార్థులు నడవాల్సివస్తుంది. నీటి నిల్వ కారణంగా దోమలు ఎక్కువవుతున్నాయి. ఆన్పైప్ లైన్లు మరమ్మతులు చేసినా ప్రెజర్ కారణంగా పూర్తి స్థాయిలో ఆగిపోలేదని హాస్టల్ వార్డెన్ అంటున్నారు. సత్యసాయి నీటి సరఫరా ఇంజనీర్లు చొరవ తీసుకొని యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టి విద్యార్థులు అనారోగ్యం బారిన పడకుండా చూడాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. ఇక్కడి పరిసర ప్రాంతం లోని నివాస గృహాల వారు హాస్టల్ బయట ప్రధాన ద్వారం ముందరే చెత్త కుప్ప వేస్తున్నారు. దీని మూలంగా విద్యార్థులు అనారోగ్యం బారినపడే అవకాశం ఉంది. మున్సిపాలిటీ అధికారులు చొరవ తీసుకుని చెత్త కుండీ మరో చోటకు మార్చాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

## రైతు బీమా పథకాన్ని ఎగ్గొట్టడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రభుత్వం బోనస్ ఇస్తామంటున్న 7 రకాల వడ్ల వల్ల రైతులు ఎకరానికి 10 క్వింటాళ్లు నష్టపోతారు. అంటే ఒక్కో రైతుకు రూ. 24 వేల దిగుబడి తగ్గే అవకాశం ఉందని బీఆర్ఎస్ నేత జీవన్ రెడ్డి అన్నారు. గురువారం అయన మీడియాతో మాట్లాడారు. 33 రకాల వడ్లలో ప్రభుత్వం గుర్తిస్తున్న 7 రకాల వడ్లు ఎకరాకి 20 క్వింటాళ్లు పండితే మిగతా 26 రకాలు మాత్రం ఎకరాకు 30 క్వింటాళ్లు పండుతాయి. ఈ 7 రకాల వడ్లు పండించడం వల్ల రైతులు 10 క్వింటాళ్లు ఎక్కువ నష్టపోతారని అన్నారు.రైతు బీమా పథకాన్ని ఎగ్గొట్టడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తుంది. ఈ ప్రభుత్వం ఇన్సూరెన్స్ ప్రీమియం కట్టకపోవడంతో 7600 మంది చనిపోయిన రైతులకు రైతు బీమా డబ్బులు రాలేదు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన పథకాలను కనుమరుగు చేయాలని చూస్తే ప్రజలు ఈ కాంగ్రెస్ నాయకులను కనుమరుగు చేస్తారు జాగ్రత్త అని హెచ్చించారు.

## లోక్ అదాలత్ మంచి అవకాశం: పోలీస్ కమిషనర్

**సిద్దిపేట: పెన్ పవర్:** జూన్ 20 న జాతీయ లోక్ అదాలత్ జరగనున్నది చిన్న చిన్న కంపౌండబల్ కేసులలో కోర్ట్ చుట్టూ తిరుగుతున్న ప్రజలకి ఇదొక మంచి అవకాశం. రాజీ పడదగిన కంపౌండబుల్ కేసులు,సివిల్ తగాదా కేసులు,ఆస్తి విభజన కేసులు, కుటుంబపరమైన నిర్వాహణ కేసులు, రోడ్డు ప్రమాదాల కేసులు, డ్రంక్ అండ్ డ్రైవ్ మరియు టౌన్ న్యూసెన్స్ కేసులు,చెక్ బౌన్స్ కేసులో మరియు ఇతర రాజీ పడ దగిన కేసులలోని నిందితులు,ఫిర్యాదీదారులు సంబంధిత పోలీస్ స్టేషన్ ని లేదా న్యాయస్థానాన్ని నేరుగా సంప్రదించి రాజి పడవచ్చు..చిన్న చిన్న కేసులతో కక్షలు పెంచుకుని కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయాన్ని,డబ్బులను వృధా చేసుకోవద్దు. జుడిషియల్ డిపార్ట్మెంట్ ఇచ్చిన అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలి. పోలీస్ అధికారులు ప్రతి పోలీస్ స్టేషన్ లో రాజీ పడ దగిన కేసులను గుర్తించి ఇరువర్గాల వారిని పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించి రాజీ పడేటట్లు అవగాహన కల్పిస్తున్నారు.

# మాజీ ప్రధాని పీవీ నరసింహారావు గారి జీవితాన్ని విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలి



**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్‌లోని బేగంపేటలో ఉన్న స్వామి రామానంద తీర్థ మెమోరియల్ స్కూల్‌ను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సందర్శించి విద్యార్థులకు నోట్‌బుక్స్, స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. తలసాని ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని ప్రారంభించారు. మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని విద్యార్థులకు పిలుపునిచ్చిన కేటీఆర్, "16 భాషల్లో ప్రావీణ్యం సంపాదించిన పీవీ నరసింహారావు దేశానికి, ప్రపంచానికి ఆదర్శంగా నిలిచారు. ఆయన చూపిన మార్గంలో నడుస్తూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని జీవితంలో గొప్ప స్థాయికి చేరుకోవాలి" అని ఆకాంక్షించారు.

తెలంగాణ రాష్ట్రంలో 2023లో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ గారి నాయకత్వంలో ప్రారంభించిన 'సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకం'ను ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు.

గత ప్రభుత్వంలో విద్యారంగంలో అనేక కార్యక్రమాలు చేసిన విషయాన్ని కేటీఆర్ గుర్తు చేశారు. భవిష్యత్తులోనూ విద్యార్థుల సంక్షేమానికి దోహదపడే ఇలాంటి కార్యక్రమాలను మరింత విస్తృతంగా అమలు చేస్తామని తెలిపారు.

"పిల్లలతో గడిపే ప్రతి క్షణం ఆనందాన్ని ఇస్తుంది. సమాజ భవిష్యత్తును తీర్చిదిద్దే విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పోషకాహారం కూడా అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది" అని కేటీఆర్ పేర్కొన్నారు.

స్వామి రామానంద తీర్థ మెమోరియల్ స్కూల్‌కు అవసరమైన అదనపు తరగతి గదులు, ఆధునిక లైబ్రరీ నిర్మాణానికి పూర్తి సహకారం అందిస్తామని కేటీఆర్ హామీ ఇచ్చారు.

విద్యార్థులకు అండగా నిలుస్తూ విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను ప్రత్యేకంగా అభినందించారు.

పాఠశాల అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్న ఎమ్మెల్సీ సురభి వాణీదేవి సేవలను ప్రశంసించారు.

# రాష్ట్ర హోంమంత్రి అనితపై మాజీ మంత్రి అమర్నాథ్ చేసిన వాక్యాలను తీవ్రంగా ఖండిస్తున్నాం

**హైదరాబాద్ పెన్ పవర్:**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత పై మాజీమంత్రి అమర్నాథ్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు టిడిపి కర్నూలు పార్లమెంటు అధికార ప్రతినిధి వి.రామలక్ష్మి తెలియజేశారు. రాజకీయ విమర్శల పేరుతో మహిళల వ్యక్తిత్వాన్ని ఆత్మ గౌరవాన్ని కించపరచడం చాలా దారుణమని టిడిపి కర్నూలు పార్లమెంటు అధికార ప్రతినిధి వి.రామలక్ష్మి పేర్కొన్నారు. గురువారం రోజున ఆమె మాట్లాడుతూ హోంమంత్రి అనితపై మాజీ మంత్రి అమర్నాథ్ కేజీ మైకప్ పూస్తుందని ఆడవారి వ్యక్తిగత విషయాలను విమర్శించడం అది ఎంత మాత్రం తగదని,మంత్రి అమర్నాథ్ నోరు అదుపులో పెట్టుకొని ఆడవారి పట్ల మంచి సంస్కారంతో నడుచుకోవాలని, లేదంటే ఆడవారి చేతులకు పని చెప్పే దుస్థితికి దిగజారొద్దని మాజీ మంత్రి అమర్నాథ్ ను హెచ్చరిస్తున్నామని ఆమె తెలియజేశారు. కుక్క తోక వంకర అన్నట్టుగా వైసిపి నాయకులు మహిళ పట్ల మర్యాదపూర్వకంగా మసులుకోవాలని, ఇలాంటి దిగుజారుడు విమర్శలను కొనసాగిస్తే మహిళలు మీ వైసీపీ నాయకుల్ని, ఎమ్మెల్యేలను,మాజీ మంత్రులను తరిమికొట్టే పరిస్థితి తథ్యమని ఆమె తెలియజేశారు. రాష్ట్రంలో జరుగుచున్న అభివృద్ధి పనుల వైపు ఆలోచించడం మానుకొని,మహిళల వ్యక్తిగత విషయాలపై శ్రద్ధ తగ్గించుకోవాలని టిడిపి కర్నూలు పార్లమెంట్ అధికార ప్రతినిధి వి.రామలక్ష్మి వైసీపీ శ్రేణులను హెచ్చరించారు.

# ఆయిల్ పామ్ ప్లాంటేషన్ ప్రోగ్రెస్- 2026-27 సమీక్షా సమావేశం

**పాల్గొన్న జిల్లా కలెక్టర్ కె. హైమావతి**

**సిద్దిపేట: పెన్ పవర్:** ఆయిల్ పామ్ ప్లాంటేషన్ ప్రోగ్రెస్--2026-27 సమీక్షా సమావేశంలో మండల స్థాయి అధికారులు, టీజీ ఆయిల్‌ఫెడ్ ప్రతినిధులకుజిల్లా కలెక్టర్ కె. హైమావతి దిశా నిర్దేశనం చేస్తూ పలు సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆయిల్ పామ్ సాగు విస్తరణకు ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను తప్పనిసరిగా సాధించాలని అధికారులను ఆదేశించారు. మెటీరియల్ కాంపోనెంట్‌కు సంబంధించిన ప్రక్రియలను త్వరగా పూర్తి చేసి, క్షేత్రస్థాయిలో పనులను వెంటనే ప్రారంభించాలని సూచించారు. ప్రతి వారం పనుల పురోగతిని సమీక్షిస్తూ, నెలాఖరులోగా మెగా ప్లాంటేషన్ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు.

క్షేత్రస్థాయి అధికారులు రైతులతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ భూముల క్లీనింగ్, పిట్ మార్కింగ్, పిట్టింగ్ పనులను వేగవంతంగా పూర్తిచేయించాలని అన్నారు. ఆయిల్ పామ్‌తో పాటు పండ్లు, పూలు, కూరగాయల మొక్కలను నాటడానికి కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని సూచించారు. ఆర్గానిక్ మరియు సీజనల్ పండ్లు, ఆకు కూరల సాగు ద్వారా అదనపు ఆదాయం పొందే అవకాశాలపై అవగాహన కల్పించాలని అన్నారు. ప్రజలు సహజసిద్ధమైన ఆహారాన్ని తీసుకోవాలని సూచించడం మాత్రమే కాకుండా, వాటికి అవసరమైన పండ్లు, కూరగాయలు, ఆకు కూరల ఉత్పత్తిని పెంచే మొక్కల పెంపకానికి కూడా చర్యలు చేపట్టాలని అన్నారు.

ఆయిల్ పామ్‌తో పాటు ఇతర పంటలను సాగు చేస్తున్న ప్రతి రైతును ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు చేయాలని తెలిపారు. స్థానిక అవసరాలకు అనుగుణంగా పండ్లు, కూరగాయలు, పూల మొక్కల ఉత్పత్తిని పెంచే దిశగా రైతులను ప్రోత్సహించాలని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ, వ్యవసాయ పథకాల ప్రయోజనాలను రైతులు కోల్పోకుండా సీఎస్‌ఈల సహకారంతో ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఫార్మర్ రిజిస్ట్రీ లేకపోవడం వల్ల రైతులు

ఏవైనా ప్రభుత్వ ప్రయోజనాలను కోల్పోయినా, లేదా పంట సాగు చేయని రైతులకు లబ్ధి అందించినా సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎల్‌నినో ప్రభావం కారణంగా భవిష్యత్తులో తలెత్తే ప్రతికూల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, నీటి వినియోగం తక్కువగా ఉండే ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు జిల్లాలో ప్రతి వ్యవసాయ క్షేత్రంలో ఫామ్ పాండ్ల ఏర్పాటు కోసం చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి, టీజీ ఆయిల్‌ఫెడ్ ప్రతినిధులు, మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు

# నేతలు మించిపోతున్న అవినీతి అనకొండలు

**హైదరాబాద్, జూన్ 18, పెన్ పవర్:**
తెలంగాణలో అవినీతి నిరోధక శాఖ వరుసగా జరుపుతున్న మెగా దాడులు, అందులో దొరుకుతున్న అక్రమ ఆస్తుల వివరాలు చూసి సామాన్య పౌరుల మైండ్ బ్లాంక్ అవుతోంది. ల్యాండ్స్ అండ్ సర్వే డిప్యూటీ డైరెక్టర్ సుంకరి నరహరి నివాసాలపై జరిగిన దాడుల్లో మంచాల కింద లభించిన కోట్లాది రూపాయల నోట్ల కట్టలు, కిలోల కొద్దీ బంగారం, లగ్జరీ ఫ్లాట్ల డాక్యుమెంట్లు ఒక ఎత్తయితే.. అంతకు వారం ముందే రోడ్లు, భవనాల శాఖ ఇంజనీర్-ఇన్-చీఫ్ మోహన్ నాయక్ నివాసాల్లో రూ. 200 కోట్ల మార్కెట్ విలువైన అక్రమ ఆస్తులు బయటపడటం మరో ఎత్తు. మే నెలలోనే మెడ్చల్ డిప్యూటీ కలెక్టర్ వంశీ మోహన్ ఇళ్లపై జరిగిన దాడుల్లోనూ వంద కోట్ల విలువైన ల్యాండ్ల పత్రాలు దొరికాయి. ఇవన్నీ చూస్తుంటే తెలంగాణలో అవినీతి అనేది ఏదో ఒకరిద్దరు అధికారులకో, ఒక శాఖకో పరిమితం కాలేదని.. వ్యవస్థల్లో ఏ స్థాయిలో వేళ్లునురుకుపోయిందో స్పష్టమవుతోంది.రాష్ట్రంలోని రెవెన్యూ, రిజిస్ట్రేషన్, టౌన్ ప్లానింగ్, మైనింగ్, ఎక్సైజ్, గృహ నిర్మాణ శాఖల్లో కింది స్థాయి క్లర్క్ నుండి పైస్థాయి డైరెక్టర్ల వరకు ఒక వ్యవస్థీకృత నెట్‌వర్క్ లాగా అవినీతి సాగుతోందని మీడియా నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. జీతం కొన్ని వేలలో ఉండే అధికారుల ఇళ్లలో వందల కోట్ల మార్కెట్ విలువైన బినామీ ఆస్తులు, ఓపెన్ ప్లాట్లు, ఫార్మ్‌హౌస్‌లు బయటపడటం దేనికి సంకేతం? ప్రభుత్వాలు మారుతున్నా, పాలకులు హెచ్చరిస్తున్నా క్షేత్రస్థాయిలో లంచాల పర్వం ఆగకపోగా.. అవినీతి తిమింగలాల ఆస్తుల వేగం మాత్రం జెట్ స్పీడ్ తో దూసుకుపోతోంది. ఏసీబీ కేవలం పక్కా సమాచారం ఉన్న కొద్దిమందిపైనే దాడులు చేస్తుంటేనే ఈ స్థాయి సంపద కుప్పలుగా తేలుతోంది.రాష్ట్రంలో ఒకరిద్దరు అధికారులను కాకుండా.. కీలక శాఖల్లో ఉన్న క్లాస్-1, క్లాస్-2 గ్రేడ్ అధికారులందరిపై ఆపరేషన్ క్లీన్-అప్ తరహాలో ఏకకాలంలో రాష్ట్రవ్యాప్త తనిఖీలు నిర్వహిస్తే ఎలా ఉంటుంది? అనుమానితులైన ప్రతి ఉన్నతాధికారి సంపాదనను, వారి బినామీల నెట్‌వర్క్‌ను జల్లెడ పట్టి ఆస్తులన్నీ లెక్కతేల్చి, వాటిని గనుక ప్రభుత్వం జప్తు చేస్తే.. అక్షరాలా తెలంగాణ రాష్ట్ర వార్షిక బడ్జెట్ కు సమానమైన నిధులు ఒకే ఏడాదిలో సమకూరడం ఖాయమని లెక్కలు వేస్తున్నారు. అంతలా ప్రజాధనం అక్రమార్కుల లాకర్లలో మూలుగుతోంది.ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వం నిధుల కొరతతో, ప్రాజెక్టుల రుణాల బదిలీల కోసం ఢిల్లీ చుట్టూ తిరుగుతుంటే.. మరోవైపు రాష్ట్రంలోనే కొంతమంది అధికారులు సమాంతర ఆర్థిక వ్యవస్థను నడుపుతున్నారు. ఈ డిజిటల్ యుగంలో బినామీల పేరిట స్థిరాస్తులు కొనడం, హవాలా మార్గాల్లో పెట్టుబడులు పెట్టడం పెరిగిపోయింది. ప్రభుత్వం కేవలం సంప్రదాయ ఏసీబీ దాడులకే పరిమితం కాకుండా.. ఆధునిక టెక్నాలజీ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ , ఐటీ శాఖల సమన్వయంతో వ్యవస్థాగత శస్త్రచికిత్స చేయాల్సిన సమయం ఆసన్నమైంది. ఈ అవినీతి తిమింగలాల గొంతు నొక్కి, అక్రమ ఆస్తులను ప్రజా సంక్షేమానికి మళ్లిస్తేనే.. తెలంగాణ సమాజానికి అసలైన ఆర్థిక స్వాతంత్రం లభిస్తుందని అనుకోవచ్చు.

రెండు సంవత్సరాలు.. 441 కేసులు..

కేవలం రెండు సంవత్సరాలు.. 441 కేసులు.. ఇదేదో పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ లో నమోదు చేసిన కేసులు కాదు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై నమోదు చేసిన కేసులు కాదు. తెలంగాణలో ఏసీబీ ఆఫీసర్లు కరప్షన్ కు పాల్పడుతున్న అధికారుల మీద నమోదు చేసిన కేసులు. పైగా వీరిలో చాలామంది లంచం తీసుకుంటూ దొరికిపోయారు. అవినీతి నిరోధక శాఖ అధికారులు లంచం తీసుకుంటే ట్రాప్ చేస్తున్నారు. అక్రమంగా ఆస్తులను కూడ పెడితే రైడ్ చేస్తున్నారు. 2024 నుంచి ఇప్పటివరకు ఏకంగా 441 కేసులు నమోదయ్యాయంటే పరిస్థితి దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.ఇంత స్థాయిలో కేసులు నమోదు చేస్తున్నప్పటికీ అవినీతి అధికారులు తమ ధోరణి మార్చుకోవడం లేదు. ఇటీవల కాలంలో డిప్యూటీ కలెక్టర్ హోదాలో ఉన్న రాము నాయక్ అనే అధికారిని ప్రభుత్వం డిస్మిస్ చేసింది. అతడు ఏకంగా ప్రభుత్వ భూములను ఇతర వ్యక్తులకు అక్రమంగా పట్టా చేయించాడు. దీనికోసం భారీగా లంచం తీసుకున్నాడు. ఇటీవల మోహన్ నాయక్ అనే అధికారి 100 కోట్లకు పైగా ఆస్తులను కూడబెట్టిన నేపథ్యంలో.. అతని మీద కూడా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. అవినీతి అధికారుల మీద ఏసీబీ అధికారులు చర్యలు తీసుకుంటున్నప్పటికీ వారి ప్రవర్తన మారడం లేదు. ఇటీవల కాలంలో ఉమ్మడి వరంగల్ జిల్లా నర్సింహులపేట మండలంలో ఒక ఎంపీడీవో, ఎంపీవో లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పకడ్బందీగా పట్టుకున్నారు. పైగా ఆ మహిళా అధికారి తన కుమారుడిని కూడా వసూళ్లకు ప్రత్యేకంగా నియమించుకోవడం విశేషం. ఏసీబీ అధికారుల తనిఖీలు ఆ ఎంపీడీవో, ఎంపీవో పట్టుబడిన నేపథ్యంలో.. అక్కడి ప్రజలు పటాసులు కాల్చి సంబరాలు చేసుకున్నారు.అవినీతి అధికారులు రోజురోజుకు ప్రజల మీద పడి దోచుకుంటున్నారు. ఏదైనా పని ఉందని వెళ్తే.. మొహమాటం లేకుండా ఏమిస్తామని అడుగుతున్నారు. తాజాగా ల్యాండ్స్ అండ్ సర్వే డిప్యూటీ డైరెక్టర్ సుంకరి నరహరి ఇంట్లో అవినీతి నిరోధక శాఖ అధికారులు తనిఖీలు చేపట్టారు. అతడికి ఆదాయానికి మించిన ఆస్తులు ఉన్నాయని అధికారులు గుర్తించారు. పాతబస్తీలోని ఛత్రినాక ప్రాంతంలో అతడి నివాసం.. కార్యాలయం.. బంధువుల గృహాలలో తనిఖీలు చేపట్టారు. నరహరి ఇంట్లో ఏకంగా 1.10 కోట్ల నగదును గుర్తించారు. ఇవే కాక బంగారు ఆభరణాలు.. ఇతర రికార్డులను కూడా స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్ నగరంలోని అత్యంత ఖరీదైన ప్రాంతాలలో అతడికి ఓపెన్ ప్లాట్లు ఉన్నాయి. రంగారెడ్డి జిల్లాలో వ్యవసాయ భూమి ఉంది. బహిరంగ మార్కెట్లో వీటి విలువ వందల కోట్లు ఉంటుందని తెలుస్తోంది. ఇటీవల కాలంలో పెద్దపెద్ద ఆఫీసర్లను ఏసీబీ అధికారులు ట్రాప్ చేసి పట్టుకుంటున్నప్పటికీ. అవినీతి అధికారులు తమ ధోరణి మార్చుకోవడం లేదు.

# ఫారెస్ట్ శాఖ వర్సెస్ రెవెన్యూ శాఖ

**నిజామాబాద్, జూన్ 18 పెన్ పవర్:** బోథ్ నియోజకవర్గ పరిధిలో అటవీ శాఖ, రెవెన్యూ శాఖల మధ్యన ఉన్న అటవీ భూముల లెక్క ఇప్పటికీ తేలక పోవడంతో కొంతమంది మొరం మాఫియా కీడుగాలకు అందినంత దోచుకునే అవకాశం లభించింది. దీంతో నేరడిగొండ బోత్ ఇచ్చోడ బజార్హత్నూర్ మండలాల్లో విచ్చలవిడిగా మొరం వ్యాపారం కొనసాగుతున్నది. రాత్రిపూట మొరం మాఫియా మూట కాపలాదారులను పెట్టి విచ్చలవిడిగా మొరం తవ్వుకు పోతున్నారు.నేరడిగొండ మండలంలోని 44వ నెంబర్ జాతీయ రహదారిని అనుకుని ఉన్న కుమారి చుట్టుపక్కల ఉన్న ఎర్ర మొరం గుట్టలు మొరం మాఫియా బంగారు బాతులా మారాయి. 44వ నెంబర్ జాతీయ రహదారి పక్కన ఉన్న ఎర్ర మొరం క్వారీని ఆనుకొని అటవీశాఖ భూమి ఉండడం ఆ భూమిలో ఏ కొంచెం తవ్విన అటవీ శాఖ వారు పట్టుకొని జరిమాణాలు విధిస్తుండటంతో అక్రమ మొరం వ్యాపారులు రెవెన్యూ భూములపై దృష్టి సారించి విచ్చలవిడిగా తరలించకపోతున్నారు.లోకల్ నేరడిగొండ మండలంలోని వడూర్ ,రాజుల తాండ, బుద్ధికొండ, బోథ్ మండలంలోని పిప్పలదరి ,కొత్త కరత్వాడ ,బోత్, ధనుర్ , రఘునాథపూర్, సోనాల మండలంలోని సాకేర, కోట కె సోనాల టివి టి గ్రామాల పరిసరాలలో ఉన్న గుట్టలలో నుండి ప్రతిరోజు వందల సంఖ్యలో తిప్పల ద్వారా మొరం తరలించకు పోతున్నారు . బోథ్ సోనాల మండలాల్లో అక్రమ మొరం తవ్వకాలు ప్రభుత్వ కార్యాలయాల ముందు నుండి పట్టపగలే మొరం ట్రాక్టర్లో తరలిస్తున్నారు. అడిగేవాడు లేకపోవడంతో మొరం మాఫియా పట్టపగలు గుట్టలను తవేసి మొరం అమ్మకాలు కొనసాగిస్తున్నారు. కొంతకాలం పాటు ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల కంటూ అధికారుల వద్ద నుండి అనుమతులు పొంది బయట వ్యక్తులకు విచ్చలవిడిగా విక్రయించు కున్నారు.. సహజ వనరులు అయినా మొరం గుట్టలను పట్టపగలు రాత్రిపూట తవ్వకాలు కొనసాగిస్తూ విచ్చల విడిగా ఇసుక మొరం అక్రమ రవాణా కొనసాగిస్తున్నారు. ప్రభుత్వ ప్రైవేటు భవనాలకు సమీపంలోని వాగుల నుండి నల్ల ఇసుకను పునాదులకు అవసరమైన పునాది రాళ్లను తరలిస్తున్నారు. పో చ్చర సమీపంలో నిర్మిస్తున్న ఓ ప్రైవేటు భవనానికి గ్రామం సమీపంలోని వాగులో నుండి నల్ల ఇసుక పునాది రాళ్లను తరలించిపోయారు. అక్రమ దందా కొనసాగుతున్న అటవీ శాఖ రెవెన్యూ శాఖల అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయివాస్తవానికి మైనింగ్ అధికారుల నిబంధనల ప్రకారం మూడు ఫీట్ల కన్నా ఎక్కువ లోతుగా తగిలితే అవసరమైన అనుమతులు పొందాల్సి ఉంటుంది కానీ ఎలాంటి అనుమతులు లేకుండానే కొత్త కర త్వాడ మిషన్ భగీరథ ట్యాంక్ కుడివైపున ఉన్న రెవెన్యూ గుట్టను 15 నుండి 20 ఫీట్ల వరకు తవ్వి మొరం తరలించారు. ఇంత బహిరంగంగా జరుగుతున్న ఈ వ్యాపారంపై అధికారులు చూడనట్లు వ్యవహరిస్తుండటంతో విమర్శలు వస్తున్నాయి.రెవెన్యూ రికార్డుల్లో ఉన్న బట్టలు తమవి కావలి అటవీశాఖ వారు పేర్కొంటుండగా రెవెన్యూ శాఖ వారు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. రెవెన్యూ శాఖ గుట్టలుగా పేర్కొంటున్న వాటి పైన ఉన్న చెట్లు అటవీ శాఖ వారివి అయితే గుట్టలేము రెవెన్యూ శాఖ వారిగుట్టపై చెట్లను కొడితే అటవీ శాఖ వారు కేసులు చేస్తుంటే మొరం తీసుకువెళ్తే తమకు సంబంధం లేదంటూ అటవీ శాఖ వారు చేతులెత్తేస్తున్నారు రెండు శాఖల సమన్వయ లోపం వల్ల కోట్లాది రూపాయల మొరం తరలిపోయింది .

# బొమ్మకల్ పంచాయతీ వినూత్న తీర్మానం

## ప్రభుత్వ స్కూల్లో పిల్లలను చేర్పిస్తే ఇంటి పన్ను, నల్లా బిల్లు పూర్తిగా మాఫీ

**కరీంనగర్, జూన్ 18, పెన్ పవర్:**
ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచి, వాటిని బలోపేతం చేసేందుకు కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం బొమ్మకల్ గ్రామ పంచాయతీ ఒక వినూత్న నిర్ణయం తీసుకుంది. గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక లేదా ఉన్నత పాఠశాలలో తమ పిల్లలను చేర్పించే తల్లిదండ్రులకు ఇంటి పన్ను, నల్లా బిల్లుల నుంచి పూర్తి మినహాయింపు ఇస్తున్నట్లు ప్రకటించింది. సర్పంచ్ వేముల శ్రీకాంత్ నేతృత్వంలోని పాలకవర్గం ఈ మేరకు ఏకగ్రీవ తీర్మానం చేసింది. ఈ ఆఫర్ ప్రస్తుత పాలకవర్గ పదవీకాలం ముగిసే వరకు వర్తిస్తుందని స్పష్టం చేసింది.ప్రభుత్వ పాఠశాలల మనుగడను కాపాడుకునేందుకు, ప్రైవేటు పాఠశాలల మోజులో పడి సర్కారు బడులను నిర్లక్ష్యం చేస్తున్న తల్లిదండ్రుల్లో మార్పు తెచ్చేందుకు ఒక గ్రామ పంచాయతీ దేశంలోనే ఎక్కడా లేని విధంగా విప్లవాత్మక నిర్ణయం తీసుకుంది. కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం బొమ్మకల్ గ్రామ పంచాయతీ పాలకవర్గం ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడమే ఏకైక లక్ష్యంగా ఒక అద్భుతమైన ఆఫర్ ప్రకటించింది. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో తమ పిల్లలను చేర్పించే తల్లిదండ్రులకు, ఆయా ఇళ్లకు సంబంధించిన వార్షిక ఇంటి పన్ను, నల్లా బిల్లులను పూర్తిగా మాఫీ చేస్తామని ప్రకటన చేసింది.ప్రస్తుతం బొమ్మకల్ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 62 మంది విద్యార్థులుండగా.. ఉన్నత పాఠశాలలో ఆ సంఖ్య కేవలం 23కి పడిపోయింది. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే ఉపాధ్యాయుల కొరతతో పాటు, భవిష్యత్తులో స్కూల్ పూర్తిగా మూతపడే ప్రమాదం ఉందని గ్రామస్తులు, అధికారులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలోనే ఎలాగైనా హైస్కూల్‌లో విద్యార్థుల సంఖ్యను భారీగా పెంచాలనే ఉద్దేశంతో గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచి వేముల శ్రీకాంత్ అధ్యక్షతన ఆరుగురు వార్డు సభ్యులు అత్యవసర ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించిన అనంతరం.. ప్రభుత్వ బడికి పిల్లలను పంపే కుటుంబాలకు ఆర్థిక ఉపశమనం కలిగిస్తూ పన్నులు మాఫీ చేయాలని ఏకగ్రీవంగా తీర్మానించారు.ఈ ప్రత్యేక రాయితీ ప్రస్తుత పంచాయతీ పాలకవర్గం పదవీ కాలం పూర్తయ్యే వరకు వర్తిస్తుందని సర్పంచ్ వేముల శ్రీకాంత్ స్పష్టం చేశారు. గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల లేదా ఉన్నత పాఠశాల.. ఈ రెండింటిలో ఏ బడిలో పిల్లలను చేర్చినప్పటికీ ఆయా కుటుంబాల ఇంటి పన్ను, నల్లా బిల్లుల రద్దు వర్తిస్తుందని ఆయన పేర్కొన్నారు. కేవలం పన్నుల మినహాయింపు మాత్రమే కాకుండా.. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల కుటుంబాలకు భవిష్యత్తులో గ్రామ పరిధిలో అమలు చేసే వివిధ సంక్షేమ పథకాలలో సైతం మొదటి ప్రాధాన్యత కల్పించే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు పాలకవర్గం వెల్లడించింది.గ్రామ పంచాయతీ తీసుకున్న ఈ చారిత్రాత్మక నిర్ణయానికి క్షేత్రస్థాయిలో, సోషల్ మీడియా వేదికగా అద్భుతమైన స్పందన లభిస్తోంది. ప్రస్తుతం కొనసాగుతున్న బడిబాట కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులు, పంచాయతీ సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి ఈ పన్నుల మాఫీ పథకం గురించి వివరిస్తున్నారు. ఈ వినూత్న ఆఫర్ ప్రకటించిన అతి తక్కువ సమయంలోనే ఇప్పటికే 12 మందికి పైగా విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలలో కొత్తగా అడ్మిషన్లు పొందడం విశేషం. మరికొందరు తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను చేర్పించేందుకు ఉత్సాహం చూపుతున్నారు. విద్యా వ్యవస్థను రక్షించుకోవడానికి గ్రామీణ స్థాయిలో తీసుకున్న ఈ వినూత్న నిర్ణయం ప్రస్తుతం కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారడమే కాక.. రాష్ట్రంలోని ఇతర గ్రామాలకు రోల్ మోడల్‌గా నిలుస్తోందని విద్యావేత్తలు ప్రశంసిస్తున్నారు.

# అంతేరా రెస్టారెంట్, లా పినోజ్ పిజ్జా రెస్టారెంట్లపై ఫుడ్ సేఫ్టీ అధికారుల దాడి



**హైదరాబాద్ పెన్ పవర్:** మియాపూర్లోని మదీనాగూడలో ఉన్న అంతేరా రెస్టారెంట్లో ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీ చే'EKI. ఫంగస్ ఏర్పడిన కాలీఫ్లవర్ ఇతర కూరగాయలు, వంటకు వాడరాని నూనె, లేబుల్స్ లేకుండా కూరగాయల నిల్వలు గుర్తించి ఇంప్రూవ్మెంట్ నోటీసులు జారీ చేసారు.

హైటెక్ సిటీ జూబ్లీ ఎంక్లేవ్లోని లా పినోజ్ పిజ్జా రెస్టారెంట్పై దాడులు చేసి ఫ్రిజ్లో పురుగులు, కిచెన్లో బొద్దింకలు, వెజ్ మరియు నాన్ వెజ్ పదార్థాలు ఒకే చోట నిల్వ ఉంచడం, ఆహార పదార్థాలు నిల్వ ఉంచే చోట బల్లి విసర్జనలు ఉన్నట్లు గుర్తిం,ఆరు. నోటీసులు జారీ చేసారు.

## ఆక్వా రైతు కృష్ణంరాజు దారుణ హత్య

**హైదరాబాద్ పెన్ పవర్:** : కొత్త మురమళ్లలో రొయ్యల చెరువు వద్ద ఆక్వా రైతు దాట్ల కృష్ణంరాజు (64)ను దుండగులు కొట్టి చంపి, రాళ్లు కట్టి రొయ్యల చెరువులో పడవేసారు. రాత్రి అయినా కృష్ణంరాజు ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు గాలించి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. చివరకు చెరువులో రాళ్లుతో కట్టిపడేసిన కృష్ణంరాజు మృతదేహం గుర్తించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. హత్యకు గురైన వ్యక్తి స్థానిక ఎమ్మెల్యే సమీప బంధువని సమాచారం.

## గోడ కూలి కారులో ఉన్న ఇద్దరు మృతి

**హైదరాబాద్ పెన్ పవర్:** వర్షం కురుస్తున్న సమయంలో నిర్మాణంలో ఉన్న ఓ ఇంటిపై నుంచి ప్రహరీ గోడ కారుపై అకస్మాత్తుగా కూలిపోయింది. ఘటనలో కారులో ఉన్న సివిల్ ఇంజినీర్ జగన్నాథ్ రెడ్డి, డ్రైవర్ సంతోష్ మృతి చెందారు. మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర మండల కేంద్రంలో ఘటన జరిగింది.

# ఖమ్మంలో లైంగిక దాడికి గురై నిమ్స్‌లో చికిత్స పొందుతున్న బాలికకు శస్త్రచికిత్స

**హైదరాబాద్ పెన్ పవర్:**
ఖమ్మం జిల్లాలో లైంగిక దాడికి గురై ప్రస్తుతం నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలికకు వైద్యులు శస్త్రచికిత్స నిర్వహించారు. బాలిక ఆరోగ్య పరిస్థితిని తెలుసుకునేందుకు మంత్రి సీతక్క, తెలంగాణ లీగల్ సర్వీసెస్ అథారిటీ మెంబర్ సెక్రటరీ జస్టిస్ పంచాక్షరి నిమ్స్ ఆసుపత్రిని సందర్శించారు.

ఈ సందర్భంగా బాలికకు అందుతున్న వైద్య చికిత్స, శస్త్రచికిత్స అనంతర పరిస్థితిపై వైద్యులు వారికి వివరించారు. బాలిక ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన అత్యుత్తమ వైద్య సేవలను అందిస్తున్నట్లు వైద్య బృందం తెలిపింది.

అనంతరం బాలిక తల్లిదండ్రులను కలిసిన మంత్రి సీతక్క వారికి ధైర్యం చెప్పారు. అధైర్యపడవద్దని, రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో మీ కుటుంబానికి అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. బాలిక పూర్తిగా కోలుకునే వరకు అవసరమైన వైద్యం అందించడంతో పాటు అన్ని విధాలుగా సహాయం చేస్తామని తెలిపారు.

===ఈ సందర్భంగా ప్రభుత్వం తరఫున బాధిత బాలిక కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక సహాయ చెక్కును మంత్రి సీతక్క, జస్టిస్ పంచాక్షరి కలిసి అందజేశారు. బాలిక చికిత్స, పునరావాసం, కుటుంబ అవసరాల విషయంలో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని పేర్కొన్నారు. బాలిక ఆరోగ్యం మెరుగుపడి సాధారణ జీవితంలోకి తిరిగి వచ్చే వరకు ప్రభుత్వం అండగా ఉంటుందని, కుటుంబానికి అవసరమైన ఆర్థిక, న్యాయపరమైన సహాయాన్ని కూడా అందిస్తామని మంత్రి సీతక్క హామీ ఇచ్చారు

# రికార్డు స్థాయి వరి దిగుబడి తెలంగాణలో సన్న బియ్యానికి రెక్కలు

**హైదరాబాద్, జూన్ 18, పెన్ పవర్:**
దేశంలోనే అత్యధిక ధాన్యం ఉత్పత్తి సాధించిన రాష్ట్రంగా తెలంగాణ నిలిచినప్పటికీ.. మార్కెట్‌లో సన్న బియ్యం ధరలు మాత్రం ఒక్కసారిగా ఆకాశాన్ని తాకాయి. మిల్లర్లు, హోల్‌సేల్ వ్యాపారులు సన్న బియ్యం నిల్వలను అక్రమంగా దాచిపెట్టి కృత్రిమ కొరత సృష్టించడమే దీనికి ప్రధాన కారణం. గత 10 రోజుల్లోనే కిలోకు రూ. 5 నుంచి రూ. 7 వరకు ధరలు పెరిగాయి. ముఖ్యంగా డిమాండ్ ఉన్న రెండేళ్ల నాటి పాత బియ్యాన్ని తక్కువ పరిమాణంలో మార్కెట్లోకి వదులుతూ వ్యాపారులు సామాన్య, మధ్యతరగతి వినియోగదారులను నిలువునా దోచుకుంటున్నారు.దేశంలోనే అత్యధికంగా ధాన్యం పండిస్తున్న రాష్ట్రాల్లో తెలంగాణ అగ్రస్థానంలో నిలిచింది. కానీ ఈ రికార్డు స్థాయి దిగుబడులు స్థానిక వినియోగదారులకు మాత్రం ఎలాంటి ఉపశమనాన్ని ఇవ్వడం లేదు. ఓ పక్క రాష్ట్రంలో పండించిన సన్న వడ్ల నిల్వలు పుష్కలంగా ఉన్నప్పటికీ.. ఓపెన్ మార్కెట్లో మాత్రం సన్న బియ్యం ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. కొంతమంది రైస్ మిల్లర్లు, పెద్ద ఎత్తున వ్యాపారం చేసే హోల్‌సేలర్లు కుమ్మక్కై మార్కెట్లో సన్న బియ్యానికి కృత్రిమ కొరత సృష్టించడమే దీనికి ప్రధాన కారణం. ఈ అక్రమ నిల్వలు, సిండికేట్ దందా కారణంగా సామాన్య, మధ్యతరగతి ప్రజల బడ్జెట్ తలకిందులవుతోంది.ట్రేడర్లు, రిటైల్ వ్యాపారుల చెప్పిన వివరాల ప్రకారం.. గత 10 రోజుల్లోనే వివిధ రకాల సన్న బియ్యం ధరలు కిలోకు రూ. 5 నుంచి రూ. 7 వరకు పెరిగాయి. మధ్యతరగతి ఇళ్లల్లో ఎక్కువగా ఉపయోగించే సాంబ మసూరి రకం ధర నిన్నమొన్నటి వరకు కిలో రూ. 62 ఉండగా.. అది ఇప్పుడు ఏకంగా రూ. 68 కి చేరింది. మార్కెట్లో అత్యధిక డిమాండ్ ఉన్న రెండేళ్ల నాటి పాత బియ్యం నిల్వలను మిల్లర్లు గోడౌన్లలోనే తొక్కిపెట్టారని, వాటిని హోల్‌సేల్ డీలర్లు, రిటైల్ ఏజెంట్ల ద్వారా అత్యధిక ధరలకు విక్రయిస్తూ

భారీగా లాభాలు గడిస్తున్నారని తెలుస్తోంది. డిమాండ్ ఎక్కువగా ఉన్న రకాలను మాత్రమే టార్గెట్ చేసి ఈ కృత్రిమ కొరతను సృష్టిస్తున్నారు.తెలంగాణ రాష్ట్రంలో ఏటా దాదాపు 60 లక్షల మెట్రిక్ టన్నుల సన్న రకం ధాన్యాన్ని ప్రభుత్వం, వివిధ సంస్థలు సేకరిస్తున్నాయి. దీనికి అదనంగా మరో 10 లక్షల మెట్రిక్ టన్నుల నాణ్యమైన సన్న వడ్లను మిల్లర్లు నేరుగా రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నారు. మొత్తంగా చూస్తే.. రాష్ట్రంలో ప్రతి ఏటా సుమారు 70 లక్షల మెట్రిక్ టన్నుల సన్న బియ్యం ఉత్పత్తి అవుతోంది. ఇంత భారీ స్థాయిలో ఉత్పత్తి జరుగుతున్నప్పటికీ మార్కెట్లో కొరత ఏర్పడటం వెనుక పెద్ద స్కామ్ ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పౌరసరఫరాల శాఖ అధికారులు చెప్పిన వివరాల ప్రకారం.. పేద, దిగువ మధ్యతరగతి వర్గాల నుంచి సంపన్నుల వరకు అందరూ రోజువారీ ఆహార అవసరాల కోసం సన్న బియ్యాన్నే ఇష్టపడుతుండటంతో వీటికి డిమాండ్ విపరీతంగా పెరిగింది.

ముఖ్యంగా కర్నూలు, నిజామాబాద్, బాపట్ల, కరీంనగర్ జిల్లాల సోనామసూరి రకాలకు మార్కెట్లో విపరీతమైన క్రేజ్ ఉంది.సన్న బియ్యం పోషక విలువలతో కూడిన ముఖ్యమైన ఆహారం కావడంతో రాష్ట్ర ప్రభుత్వం వైట్ రేషన్ కార్డు కలిగిన పేద కుటుంబాలకు రేషన్ దుకాణాల ద్వారా సబ్సిడీ ధరలకే సరఫరా చేస్తుంది. దీంతో బహిరంగ మార్కెట్లో సన్న బియ్యానికి డిమాండ్ మరింత పెరిగింది. ఈ మార్కెట్ డిమాండ్‌ను కొందరు మిల్లర్లు, హోల్‌సేల్ వ్యాపారులు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. నిల్వలను బ్లాక్ చేసి, మార్కెట్లోకి తగినంత స్టాక్ రాకుండా అడ్డుకుంటున్నారు. బియ్యం ధరల నియంత్రణకు ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని.. ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలతో రైస్ మిల్లులపై దాడులు నిర్వహించాలని వినియోగదారులు డిమాండ్ చేస్తున్నారు.

# కార్పొరేట్‌కు దీటుగా సర్కారీ స్కూల్ నర్సరీ టు ఇంటర్ ఫ్రీ..

**హైదరాబాద్, జూన్ 18 పెన్ పవర్:** తెలంగాణ విద్యా రంగంలో సరికొత్త చరిత్ర ఆవిష్కృతం కాబోతోంది. రాష్ట్రంలో ప్రభుత్వ విద్యా వ్యవస్థ రూపురేఖలను మార్చి, పేద, మధ్యతరగతి విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి నాణ్యమైన విద్యను ఉచితంగా అందించాలనే లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం సరికొత్త విప్లవానికి శ్రీకారం చుట్టింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డ్రీమ్ ప్రాజెక్ట్‌గా రంగారెడ్డి జిల్లా ఆరుట్లలో రూపుదిద్దుకున్న తెలంగాణ పబ్లిక్ స్కూల్ నేడు ప్రారంభం కానుంది. ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో నమ్మకాన్ని పెంచేలా తొలి విడతలో పైలట్ ప్రాజెక్ట్‌గా నాలుగు పాఠశాలలను ప్రభుత్వం ఎంపిక చేసింది.రాష్ట్రంలో ప్రభుత్వ విద్యను బలోపేతం చేసేందుకు ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన తెలంగాణ పబ్లిక్ స్కూల్ పైలట్ ప్రాజెక్టును సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. నర్సరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు అంతర్జాతీయ ప్రమాణాలతో ఉచిత ఇంగ్లీష్ మీడియం విద్యను అందించే ఈ స్కూల్‌లో డిజిటల్ క్లాస్‌రూమ్‌లు, ఉచిత బస్సు సౌకర్యం, కార్పొరేట్ స్థాయి క్రీడా మైదానాలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం 1,814 మంది విద్యార్థులతో ప్రైవేటు పాఠశాలలను తలదన్నేలా రూపుదిద్దుకున్న ఈ విద్యా మోడల్‌ను దశలవారీగా రాష్ట్రవ్యాప్తంగా 100 పాఠశాలలకు విస్తరించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.రంగారెడ్డి జిల్లాలోని ఆరుట్ల, మంచాల పాఠశాలలతో పాటు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని వంగూరు, పోల్కంపల్లి పాఠశాలలను మొదటి విడతలో అభివృద్ధి చేశారు. ఈ పైలట్ ప్రాజెక్ట్ విజయవంతం కావడంతో ఇదే కాన్సెప్ట్‌ను రాష్ట్రవ్యాప్తంగా దశలవారీగా 100 పాఠశాలలకు విస్తరించేందుకు ప్రభుత్వం ఇప్పటికే కార్యాచరణను సిద్ధం చేసింది. ప్రస్తుతం ఆరుట్ల టీపీఎస్‌లో రికార్డు స్థాయిలో 1814 మంది విద్యార్థులు చదువుతుండగా.. ప్రైవేట్ స్కూళ్ల నుంచి తమ పిల్లలను ఇక్కడికి మార్చేందుకు తల్లిదండ్రులు భారీగా తరలివస్తుండటంతో అప్పుడే నో అడ్మిషన్ బోర్డు పెట్టాల్సిన పరిస్థితి రావడం ఈ ప్రాజెక్ట్ విజయానికి నిదర్శనంగా నిలిచింది.

**ఆరుట్ల తెలంగాణ పబ్లిక్ స్కూల్ ప్రత్యేకతలివే..**

కార్పొరేట్ విద్యా సంస్థలకు పూర్తి భిన్నంగా.. ఒకే ప్రాంగణంలో నర్సరీ నుంచి ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం వరకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఉచిత ఇంగ్లీష్ మీడియం విద్య అందుబాటులోకి వచ్చింది. విద్యార్థుల శారీరక, మానసిక దృఢత్వం కోసం ప్రతిరోజూ ఉదయం పౌష్టికాహారంతో కూడిన అల్పాహారం, మధ్యాహ్నం నాణ్యమైన భోజనంతో పాటు సాయంత్రం వేళల్లో హెల్తీ స్నాక్స్ కూడా ప్రభుత్వం ఉచితంగా అందించనుంది. ఆరుట్ల చుట్టుపక్కల గ్రామాల నుండి విద్యార్థులు సురక్షితంగా, సకాలంలో పాఠశాలకు చేరుకోవడానికి వీలుగా ప్రభుత్వం ప్రత్యేకంగా ఐదు స్కూల్ బస్సులను రవాణా సౌకర్యం కోసం ఏర్పాటు చేసింది.అంతర్జాతీయ పాఠశాలలను తలదన్నేలా ఇక్కడ వినూత్నమైన డిజిటల్ క్లాస్‌రూమ్‌లు, సుసంపన్నమైన లైబ్రరీ, అత్యాధునిక సాంకేతిక సదుపాయాలతో కూడిన సైన్స్ ల్యాబ్‌లు, కంప్యూటర్ ల్యాబ్‌లు, విశాలమైన గాలి-వెలుతురు వచ్చే క్లాస్ రూమ్‌లను నిర్మించారు.

చదువుతో పాటు క్రీడలకు సమాన ప్రాధాన్యతనిస్తూ క్రికెట్, ఫుట్‌బాల్, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, టెన్నిస్, క్యారమ్స్ వంటి ఆటల కోసం ప్రత్యేక కోర్టులను, అంతర్గత జిమ్ వసతిని ఏర్పాటు చేశారు. వీరికి శిక్షణ ఇచ్చేందుకు ప్రత్యేక క్రీడా శిక్షకులను నియమించారు.ఈ పాఠశాలల నిరంతర నిర్వహణ బాధ్యతను జిల్లాల్లో అదనపు కలెక్టర్లకు అప్పగించారు. ప్రతి స్కూల్ వద్ద వ్యవసాయ, రెవెన్యూ, పోలీస్ విభాగాల నుంచి ఒక్కో అధికారి నిరంతరం అందుబాటులో ఉంటూ విద్యార్థుల రక్షణను, అవసరాలను పర్యవేక్షిస్తారు.

ప్రభుత్వ విద్యను ప్రపంచ స్థాయికి తీసుకెళ్లాలన్న సీఎం రేవంత్ రెడ్డి సంకల్పానికి ఆరుట్లలో ప్రారంభమవుతున్న ఈ తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఒక సజీవ సాక్ష్యంగా నిలవడమే కాకుండా, రాబోయే రోజుల్లో రాష్ట్ర విద్యా రంగంలో ఒక సరికొత్త మైలురాయిగా నిలిచిపోనుంది.

# ట్రాఫిక్ కష్టాలకు చెక్.. HMDA సరికొత్త కారిడార్ ప్లాన్

**హైదరాబాద్, జూన్ 18 పెన్ పవర్:** హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ సమస్యలను అధిగమించేందుకు హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ కీలకమైన ప్రణాళికలను సిద్ధం చేసింది. నగరంలో వ్యక్తిగత వాహనాల సంఖ్య 80 లక్షలు దాటడంతో, ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు యూనిఫైడ్ మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ ద్వారా కూకట్‌పల్లి వై జంక్షన్ నుంచి గండిమైసమ్మ, ఎల్బీనగర్ నుంచి నాగోల్ వంటి ముఖ్యమైన ప్రాంతాలలో రహదారులను అభివృద్ధి చేయాలని ప్రతిపాదించారు.ఈ ప్రణాళికలో భాగంగా రహదారుల విస్తరణతో పాటు ఆక్రమణల తొలగింపు, డ్రైనేజీ వ్యవస్థను బలోపేతం చేయడం , విద్యుత్, గ్యాస్ పైపులైన్ల కోసం భూగర్భంలో ప్రత్యేక మార్గాలు చేపట్టనున్నారు. దీనివల్ల రోడ్లను పదేపదే తవ్వాల్సిన అవసరం ఉండదు. అలాగే పాదచారులకు, దివ్యాంగులకు అనుకూలమైన ఫుట్‌పాత్‌లు, ర్యాంపులు, ఆధునిక బస్ షెల్టర్ల నిర్మాణం , సిగ్నల్ రహిత ప్రయాణం కోసం ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లను కూడా నిర్మించనున్నారు. ఈ పనులు పూర్తి చేయడం ద్వారా నగరంలో ట్రాఫిక్ వేగం ప్రస్తుతమున్న గంటకు 15 కిలోమీటర్ల నుండి 30-40 కిలోమీటర్లకు పెరగడమే కాకుండా, ప్రమాదాలు తగ్గడం , భూముల విలువలు పెరగడం వంటి ప్రయోజనాలు కలుగుతాయని అంచనా. అయితే, భూసేకరణ , పనుల సమయంలో ఎదురయ్యే ట్రాఫిక్ ఇబ్బందులను అధిగమించేందుకు సరైన ప్రణాళిక అవసరమని పేర్కొన్నారు

**గ్రేటర్ చుట్టూ లింక్ రోడ్లు**

మహానగరం హైదరాబాద్‌తో పాటు శరవేగంగా విస్తరిస్తున్న శివారు ప్రాంతాల రూపురేఖలను మార్చేలా హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఒక సరికొత్త రవాణా వ్యూహాన్ని సిద్ధం చేసింది. నగరంలో రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని తగ్గించడంతో పాటు, ఐటీ కారిడార్‌ను ఇతర శివారు మండలాలతో సులభంగా అనుసంధానించేలా మరో 50 కొత్త లింక్ రోడ్ల నిర్మాణానికి సంబంధించిన మాస్టర్ ప్లాన్‌ను అధికారులు ఖరారు చేశారు. ప్రధాన జాతీయ రహదారులు, రేడియల్ రోడ్లను కలుపుతూ సాగే ఈ మిస్సింగ్ లింక్ రోడ్ల ప్రాజెక్టు.. గ్రేటర్ పరిధిలోని ప్రయాణ సమయాన్ని గణనీయంగా తగ్గించడమే కాకుండా, నగర విస్తరణకు కొత్త ద్వారాలు తెరవబోతోందిహెచ్ఎండీఏ సిద్ధం చేసిన ఈ తాజా రోడ్ మ్యాప్‌లో తూర్పు మరియు ఉత్తర హైదరాబాద్ పరిసర ప్రాంతాలకు అత్యధిక ప్రాధాన్యత లభించింది. ముఖ్యంగా ఉప్పల్-వరంగల్ హైవేను ఆనుకుని ఉన్న పీర్జాదిగూడ, బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ల పరిధితో పాటు నాగారం, దమ్మాయిగూడ, కీసర రూట్లలో ట్రాఫిక్ ఇబ్బందులను తొలగించేలా ఈ లింక్ రోడ్లను డిజైన్ చేశారు. మరోవైపు, శరవేగంగా పారిశ్రామికంగా, నివాస ప్రాంతాలుగా ఎదుగుతున్న మేడ్చల్, గుండ్లపోచంపల్లి కారిడార్ల నుంచి శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం వైపు తక్కువ సమయంలో చేరుకునేలా అవుటర్ రింగ్ రోడ్ కి సమాంతరంగా, అనుసంధానంగా కొత్త రోడ్డు మార్గాలు ఈ ప్లాన్ ద్వారా అందుబాటులోకి రానున్నాయి.ఈ మెగా కనెక్టివిటీ ప్రకటన వెలువడటమే ఆలస్యం.. ఆయా కారిడార్లలోని రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో ఒక్కసారిగా కదలిక మొదలైంది. కొత్త లింక్ రోడ్లు ప్రయాణించబోయే గ్రామాలు, లేఅవుట్లలో భూముల ధరలకు డిమాండ్ భారీగా పెరిగింది. మౌలిక వసతుల కల్పన వేగవంతం కానుండటంతో.. ఓపెన్ ప్లాట్లు, నివాస స్థలాల ధరలు చదరపు గజానికి కనీసం రూ.3,000 నుండి రూ.5,000 వరకు తక్షణమే పెరిగే అవకాశం ఉందని రియల్ ఎస్టేట్ మార్కెట్ విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు. నిన్నమొన్నటి వరకు రవాణా సౌకర్యం సరిగా లేక వెనుకబడిన శివారు భూములు సైతం.. ఇప్పుడు ఈ లింక్ రోడ్ల మాస్టర్ ప్లాన్ ఎఫెక్ట్‌తో హాట్ కేకుల్లా మారుతున్నాయి.ఈ రోడ్ల నిర్మాణానికి అవసరమైన భూసేకరణ, నిధుల సమీకరణ ప్రక్రియను క్రమబద్ధీకరించేందుకు హెచ్ఎండీఏ ఉన్నతాధికారులు కసరత్తు ముమ్మరం చేశారు. రోడ్డు కనెక్టివిటీ స్పష్టంగా ఉండటంతో హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ ల్యాండ్ డెవలపర్లు, బిల్డర్లు పీర్జాదిగూడ, మేడ్చల్, శంషాబాద్ పరిసర బెల్ట్‌లలో వందలాది ఎకరాలలో కొత్త డీటీసీపీ, హెచ్ఎండీఏ అప్రూవ్డ్ లేఅవుట్లు, గేటెడ్ కమ్యూనిటీలను ప్లాన్ చేస్తున్నారు. నగరానికి దూరంగా ఉన్నా సరే, సులభంగా ఐటీ కారిడార్‌కు చేరుకునే వెసులుబాటు లభించనుండటంతో మధ్యతరగతి కొనుగోలుదారులకు, దీర్ఘకాలిక పెట్టుబడిదారులకు ఈ శివారు ప్రాంతాలు ఇప్పుడు అత్యంత సురక్షితమైన మరియు లాభదాయకమైన గమ్యస్థానాలుగా మారుతున్నాయి.

# నగునూరు గ్రామంలో ఎరువుల గోదామును పరిశీలించిన అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే

**హైదరాబాద్ పెన్ పవర్:** జిల్లాలో ఏయే ఎరువులు ఏ డీలర్లకు పంపిణీ చేశారనే వివరాలను తెలుసుకున్నారు. జిల్లాలోని విత్తన కేంద్రాలు, ఎరువుల విక్రయ కేంద్రాలు మరియు ఇప్పటివరకు జరిగిన అమ్మకాల వివరాలను సమగ్రంగా పరిశీలించారు.అలాగే వరి, మొక్కజొన్న మరియు పత్తి విత్తన నిల్వలను గోదాములలో పరిశీలించారు. అనంతరం నగునూరు గ్రామంలోని అగ్రో రైతు సేవా కేంద్రంలో ప్రభుత్వం ప్రాధాన్యతనిచ్చిన వరి విత్తనాలైన బీపీటీ-5204, ఆర్ఎన్ఆర్-1508 మరియు కేఎన్ఎం-1638 వంటి వంగడాలను పరిశీలించారు.వాటి విత్తన నిల్వ వివరాలను, టీఎస్ సీడ్స్ కార్పొరేషన్ ద్వారా సరఫరా చేసిన పెసర మరియు ఇతర విత్తనాల వివరాలను, అలాగే జీలుగజనుము విత్తనాల నాణ్యతను కూడా పరిశీలించారు.తదుపరి అక్కడ ఉన్న రైతులకు పాయింట్ ఆఫ్ సేల్ పిఓ ఎస్ యంత్రం ద్వారా జరిగే అమ్మకాల విధానాన్ని వివరించారు. రైతుల ఆధార్ నమోదు చేసి ఈ-పాస్ యంత్రం ద్వారా అవసరమైన కాంప్లెక్స్ ఎరువులను విక్రయించే ప్రక్రియను వారి సమక్షంలో పరిశీలించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సంచాలకులు కె. రణధీర్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి సత్యం మరియు ఇతర వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

03

ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# కారు దిగిన కవితక్క.. తండ్రి కేసీఆర్ కే 'రివర్స్' ఆఫర్ ఇచ్చింది..





**హైదరాబాద్, జూన్ 18 పెన్ పవర్:** తెలంగాణ రాజకీయాలు ఎప్పుడు ఏ మలుపు తిరుగుతాయో ఊహించడం బ్రహ్మదేవుడి వల్ల కూడా కాదేమో.. మొన్నటివరకు "కారు, సారు, సర్కారు" అంటూ గులాబీ జెండాను గుండెలకు హత్తుకున్న కల్వకుంట్ల కవిత గారు.. ఇప్పుడు రూటు మార్చారు.. రేంజ్ మార్చారు.. అసలు పార్టీనే మార్చేశారు. 'భారత్ రాష్ట్ర సమితి' కి బైబై చెప్పేసి, తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అంటూ సరికొత్త దుకాణం.. ఐతే రాజకీయ పార్టీ పెట్టేశారు. పాత 'టీఆర్ఎస్' సెంటిమెంట్‌ను ఇలా కొత్తగా వాడుకోవడంలో ఆమె టైమింగ్‌ను మెచ్చుకోవాల్సిందే.. అయితే తాజాగా ఒక జాతీయ మీడియా ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె పేల్చిన బాంబు ఇప్పుడు తెలంగాణ పొలిటికల్ సర్కిల్స్‌లో 'సంచలనం' కాస్తా 'నవ్వుల జల్లు'గా విశ్లేషకులకు 'మైండ్ బ్లాక్' అయ్యేలా చేస్తోంది.

**బాస్ కే రివర్స్ ఆఫర్.. ఇదెక్కడి మాస్ ప్లాన్ అబ్బా**

ఇంటర్వ్యూలో యాంకర్ చాలా అమాయకంగా.. "ఒకవేళ మీ తండ్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ గారు స్వయంగా వచ్చి.. 'అమ్మా, కవితా.. ఇంటికొచ్చేయ్ మళ్లీ మన పార్టీలోనే ఉండు' అని అడిగితే ఏం చేస్తారు?" అని ప్రశ్నించారు. దానికి కవిత గారు ఇచ్చిన సమాధానం విని పొలిటికల్ పండితుల టీ కప్పులు చేతుల్లోంచి జారిపడ్డాయట.. "నా జీవితంలో చాలా అవమానాలు చూశాను. గౌరవం లేని చోట నేను ఒక్క క్షణం కూడా ఉండను. కాబట్టి నేను బీఆర్ఎస్‌లోకి వెళ్లే ప్రసక్తే లేదు. ఒకవేళ కేసీఆరే నా దగ్గరకు వస్తే.. నేను ఆయన పార్టీలోకి వెళ్ళడం కాదు, ఆయన్నే నా 'తెలంగాణ రక్షణ సేన' లోకి రమ్మని ఆహ్వానిస్తా " అని తేల్చిచెప్పారు. అబ్బా.. ఏం కాన్ఫిడెన్స్.. తెలంగాణను దశాబ్ద కాలం పాటు శాసించిన ఉద్యమ సింహం, రాజకీయ చాణక్యుడు కేసీఆర్‌కే.. కొత్తగా పెట్టిన పార్టీలోకి 'మెంబర్‌షిప్' ఆఫర్ చేయడం అంటే మామూలు విషయం కాదు. తండ్రికి తగ్గ తనయ అనిపించుకోవడమే కాకుండా తండ్రికే 'రివర్స్ టాబ్లెట్' వేశారు కవితక్క!

**ఫ్యామిలీ పాలిటిక్స్: 'కారు' వర్సెస్ 'రక్షణ సేన'**

ఈ వ్యాఖ్యలతో కల్వకుంట్ల కుటుంబంలో 'కలహాలు' ఏ రేంజ్‌లో ఉన్నాయో స్పష్టమైపోయిందని విశ్లేషకులు చెవులు కొరుక్కుంటున్నారు. "నన్ను గౌరవం లేకుండా బయటకు పంపించారు" అని కవిత గారు తెగ ఫీలవుతుంటే.. జనాలు మాత్రం "అసలు కేసీఆర్ సొంత కూతుర్నే బయటకు పంపించేంత సీన్ ఉందా? లేక ఇదంతా ఏదైనా కొత్త పొలిటికల్ స్క్రిప్టా?" అని బుర్రలు బద్దలు కొట్టుకుంటున్నారు. బీఆర్ఎస్ నుంచి బయటకు వచ్చి 'రక్షణ సేన' పెట్టుకున్న కవిత గారికి.. ఇప్పుడు తండ్రి కేసీఆరే రక్షణ కోసం తన పార్టీలోకి రావాలని కోరడం ఈ శతాబ్దపు అతిపెద్ద రాజకీయ జోక్ అంటున్నారు నెటిజన్లు.

**తదుపరి అంకం ఏమిటో?**

ప్రస్తుతానికైతే కవిత గారి 'ఓపెన్ ఆఫర్' పై అటు ఫామ్‌హౌస్ నుంచి కానీ, ఇటు బీఆర్ఎస్ భవన్ నుంచి కానీ ఎలాంటి స్పందన లేదు. కేసీఆర్ గారు ఈ కామెంట్‌ను విని నవ్వుకున్నారో.. లేక "కన్నతల్లే కాకరాకరకాయ్ అన్నదట" అని సామెతలు వెతుక్కుంటున్నారో చూడాలి.ఏదేమైనా ఒకప్పుడు కేసీఆర్ వెనుక నడిచిన కవిత.. ఇప్పుడు కేసీఆర్ నే తన వెనుక నడవమంటున్నారు. ఈ 'రివర్స్ గేర్' రాజకీయం తెలంగాణను ఎటు తీసుకెళ్తుందో కానీ ప్రేక్షకులకు మాత్రం ఫుల్ ఎంటర్‌టైన్‌మెంట్ గ్యారెంటీ!

# కండలేరు లో పోలీసుల కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్

**హైదరాబాద్, జూన్ 18 పెన్ పవర్:** బుధవారం రాత్రి కండలేరు పోలీస్ స్టేషన్ పరిధిలోని చెల్లటూరు గ్రామంలోని ఎస్టీ కాలనీలో పోలీసులు విస్తృత స్థాయిలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ ఆపరేషన్కు రాపూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ గారి ఆధ్వర్యంలో కండలేరు ఎస్సై, కలువాయి ఎస్సై, సైదాపురం ఎస్సై మరియు 20 మంది పోలీసు సిబ్బందితో కూడిన ప్రత్యేక బృందం పాల్గొంది. ఆపరేషన్ సందర్భంగా ప్రాంతంలోని సుమారు 120 ఇళ్లను క్షుణ్ణంగా తనిఖీ చేయగా, సరైన ఆధార పత్రాలు లేని 23 ద్విచక్ర వాహనాలు మరియు 2 ఆటోలను గుర్తించి స్వాధీనపరచుకుని తదుపరి పరిశీలన నిమిత్తం పోలీసుల ఆధీనంలో ఉంచారు. సంబంధిత వాహన యజమానులు అవసరమైన పత్రాలను సమర్పించాలని సూచించారు.

తరువాత స్థానిక ప్రజలు, యువత మరియు సంఘ పెద్దలకు రోడ్డు భద్రతా నియమాలు, గంజాయి మరియు ఇతర మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలు, అక్రమ మద్యం నిర్మూలన, మహిళలపై జరిగే నేరాల నివారణ, సైబర్ నేరాల పట్ల అప్రమత్తత, ఆస్తి సంబంధిత నేరాల నియంత్రణ, డయల్-100 మరియు 112 అత్యవసర సేవల వినియోగం వంటి అంశాలపై అవగాహన కల్పించారు.

అలాగే ప్రజలు తమ ప్రాంతాల్లో జరిగే అనుమానాస్పద కార్యకలాపాలు, అసాంఘిక చర్యలు లేదా నేరాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. ప్రజల సహకారంతోనే నేరాల నియంత్రణ మరింత సమర్థవంతంగా సాధ్యమవుతుందని, శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నివారణ కోసం జిల్లాలో ఇటువంటి కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్లు నిరంతరం నిర్వహించబడుతున్నాయని పోలీసులు తెలిపారు.

# గులాబీ ఓవర్ కాన్ఫిడెన్సేనా...



**హైదరాబాద్ జూన్ 18, పెన్ పవర్:** తెలంగాణలో బీఆర్ఎస్ తన ఓట్ల శాతాన్ని కాపాడుకునే ప్రయత్నం మొదలు పెట్టింది. గత ఎన్నికల్లో వచ్చిన ఓట్ల శాతం కంటే పెంచుకునేందుకు అవసరమైన వ్యూహాలను రచిస్తుంది. కాంగ్రెస్ ప్రభుత్వ వ్యతిరేక ఓటుతో పాటు తమకు అనకూల ఓటు పెరుగుతుందని గులాబీ పార్టీ నేతలు భావిస్తున్నారు. ఎవరు అవునన్నా కాదన్నా బీఆర్ఎస్ తెలంగాణలో క్షేత్రస్థాయిలో బలంగా ఉంది. మరొకవైపు బీజేపీ బలపడుతుంది. బీజేపీ తమ ఓటు బ్యాంకును చీల్చకుండా జాగ్రత్తలు తీసుకుంటూనే కాంగ్రెస్ పై వ్యతిరేక ఓటును తాము రాబట్టుకునే ప్రయత్నంలో కారు పార్టీ ఉంది. పార్టీ అగ్రనేత కేసీఆర్ సూచనల మేరకు కీలక నేతలు ఇప్పటికే ఆ పనిలో నిమగ్నమయ్యారు.సహజంగా ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ ఖచ్చితంగా అంతో ఇంతో వ్యతిరేకత ఉంటుంది. పాజిటివిటీ కంటే నెగిటివిటీ ఓటు ఎక్కువగా ఉంటుంది. అందుకు కాంగ్రెస్ కూడా మినహాయింపు కాదు. ఎందుకంటే గతంలో బీఆర్ఎస్ రెండు దఫాల తర్వాత వచ్చిన వ్యతిరేకతతోనే కాంగ్రెస్ మొన్నటి ఎన్నికల్లో విజయం సాధించింది. అయితే ఎప్పుడూ పదేళ్లు ఒకే పార్టీ ఉంటుందని అనుకోవడం కేవలం గణాంకాల కోసమే. ప్రాక్టికల్ గా కుదరదు. మరొకవైపు అధికారంలో ఉన్న కాంగ్రెస్ కు బీజేపీ నుంచి కూడా ప్రమాదం పొంచి ఉంది. బీజేపీ ఎంత బలపడితే అంత కాంగ్రెస్ కే నష్టమన్న అంచనాలు కూడా బలంగా వినిపిస్తున్నాయి.ప్రభుత్వ వ్యతిరేక ఓటు ఎటు వెళుతుందన్నది పక్కన పెడితే మూడు పార్టీలు బలంగా ఓట్లు చీల్చుకుంటే అది తమకే లాభమని బీఆర్ఎస్ నేతలు భావిస్తున్నారు. తమకు ఇప్పటికే క్షేత్రస్థాయిలో వస్తున్న మద్దతు అందుకు ఉదాహరణ అని చెబుతున్నారు. ప్రస్తుతానికి కేటీఆర్, హరీశ్ రావులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ఇటు క్యాడర్ తో పాటు ఓటు బ్యాంకును కూడా రక్షించుకునే ప్రయత్నం చేస్తున్నారు. గతంలో తమ పాలనకు, ప్రస్తుత పాలనకు బేరీజు వేసుకుంటే తామే ఎక్కువ ఓట్లు సాధిస్తామని గులాబీ పార్టీ నేతలు అంచనాలు వేసుకుంటున్నారు. గత ఎన్నికల్లోనూ అనేక నియోజకవర్గాల్లో స్వల్ప మెజారిటీతో ఓటమి పాలయిన విషయాన్ని వారు ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నారు. అందుకే బీఆర్ఎస్ ఈసారి ఎన్నికల్లో తమకు అధికారం గ్యారంటీ అన్న ధీమాతో ఉంది. మరి చివరకు ఓటర్లు ఎలా తీర్పు చెబుతారన్నది చూడాల్సి ఉంది.

# గుంటూరు మిర్చికి చైనా షాక్



**గుంటూరు, జూన్ 18, పెన్ పవర్:** మనదేశంలో మిరప ఎక్కువగా పండించే రాష్ట్రాలలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ముందు వరుసలో ఉంటాయి. ఇక్కడ పండే మిరపకు అంతర్జాతీయంగా డిమాండ్ ఉంటుంది. ముఖ్యంగా టమాటా మిర్చి.. తేజ రకం మిర్చికి ఈ రెండు రాష్ట్రాలు పెట్టింది పేరు. అందువల్లే చైనా వ్యాపారులు మన తెలుగు రాష్ట్రాలలో పండిన మిరపకాయలను ఎక్కువగా కొనుగోలు చేస్తూ ఉంటారు. ఎండు మిరపకాయల నుంచి కారం మాత్రమే కాకుండా.. కృత్రిమ రంగులలో ఉపయోగించే రసాయనాలను తయారు చేస్తూ ఉంటారు. ఈ రసాయనాలకు చైనాలో విపరీతమైన డిమాండ్ ఉంటుంది.సాధారణంగా మిర్చిలో రైతులు ఎక్కువగా క్రిమిసంహారకాలు వాడుతుంటారు. మిరప అనేది అత్యంత సున్నితమైన పంట. ఎక్కువ దిగుబడి సాధించడానికి రైతులు విపరీతంగా క్రిమిసంహారకాలు వాడుతూ ఉంటారు. గతంలో క్రిమిసంహారకాల వాడకం ఒక స్థాయి వరకు ఉండేది. కొంతకాలంగా మిరప మీద తెగుళ్లు విపరీతంగా దాడి చేస్తున్న నేపథ్యంలో దిగుబడి పూర్తిగా తగ్గిపోతుంది. అందువల్ల రైతులు క్రిమిసంహారకాలను ఎక్కువగా వాడాల్సి వస్తోంది. దేశీయంగా పెద్దగా ఇబ్బందులు లేకపోయినప్పటికీ.. ఎగుమతి అయ్యే మిరప విషయంలోనే కష్టాలు ఎదురవుతున్నాయి.మన దగ్గర పండిన మిర్చి ఎక్కువగా చైనా దేశానికి ఎగుమతి అవుతూ ఉంటుంది. అయితే ఇటీవల కాలంలో రెండు కంటైనర్ల మిర్చి మన దేశానికి చైనా తిరిగి పంపింది. దీనికి ప్రధాన కారణం క్రిమిసంహారకాలు అధికంగా ఉండటమే. ఈ స్థాయిలో క్రిమి సంహారకాలు వాడిన మిరపని పంపిస్తే తీసుకునేది లేదని చైనా స్పష్టం చేసింది. దీంతో మిరప వ్యాపారులు ఆందోళన చెపుతున్నారు. మిరపలో క్రిమిసంహారకాల వాడకాన్ని తగ్గించే విధంగా ప్రభుత్వం ఒత్తిడి తీసుకురావాలని.. రైతులు సహజ సిద్ధమైన పద్ధతుల్లో మిరపని పండించే విధంగా చూడాలని వ్యాపారుడు కోరారు. పదేపదే పురుగుమందుల అవశేషాల ఉల్లంఘన జరుగుతున్న నేపథ్యంలో అంతర్జాతీయ స్థాయిలో భారత మార్కెట్ విలువ పడిపోతుందని వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.చైనాకు ఎగుమతి అవుతున్న మిరపలో మెతా మెడోఫాస్.. మోనోక్రోటఫాస్.. ప్రొఫెనోపాస్.. ట్రయాజో పాస్.. ఇతియాన్.. క్లోరోపైరీఫాస్.. పిఫ్రోనిల్ వంటి ఆందోళన కలిగించే క్రిమిసంహారకాలు ఉన్నాయని ఆంధ్ర ప్రదేశ్ మిరప వ్యాపారుల సంఘం అధ్యక్షుడు వెలగపూడి సాంబశివరావు.. ప్రధాన కార్యదర్శి తోట రామకృష్ణ ఆందోళన వ్యక్తం చేశారు. చైనా ప్రధానంగా ఈ క్రిమిసంహారకాలను చూపించి ఎగుమతులను తీసుకోవడం లేదని వారు పేర్కొన్నారు.. అంతేకాదు ప్రభుత్వం ఈ విషయంలో కఠిన చర్యలు తీసుకోవాలని.. రైతులకు మేలైన విత్తనాలు.. పంట దిగుబడిలో తీసుకోవాల్సిన సూచనలు.. తెగుళ్ల బారిన పడకుండా మేలైన దిగుబడి అందించే వంగడాలను రూపొందించాల్సిన అవసరం ఉందని వారు చెబుతున్నారు.రైతులకు పురుగుమందులు అమ్మే డీలర్ల మీద కఠినమైన పర్యవేక్షణ కొనసాగించాలని ప్రభుత్వానికి సూచించారు.. గుంటూరు.. పల్నాడు.. ప్రకాశం.. కర్నూలు.. నంద్యాల.. తెలంగాణ.. కర్ణాటక వంటి రాష్ట్రాలలో మిరప పండించే రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాల మీద ఉందని మిరప వ్యాపారులు చెబుతున్నారు. సక్రమంగా ఎగుమతులు చేయని పక్షంలో దేశీయంగా రేటు పడిపోతుందని.. అది రైతులకే నష్టం చేకూరుతుందని వ్యాపారులు చెబుతున్నారు.

# ఏపీలో ఆపరేషన్ ఆకర్ష్...

**విజయవాడ, జూన్ 18, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో సంచలన మార్పులకు తెరలేవబోతోంది. ఎన్నికల్లో ఘనవిజయం సాధించి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, ఒక వ్యూహం ప్రకారం వాయిదా వేస్తూ వచ్చిన రాజకీయ చేరికల ప్రక్రియకు ఇప్పుడు గేట్లు ఎత్తడానికి ముహూర్తం ఖరారైనట్లు స్పష్టమవుతోంది. ముఖ్యంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కి చెందిన కీలక నేతలు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు కూటమి బాట పట్టడానికి సిద్ధంగా ఉన్న తరుణంలో.. ఈ చేరికలను క్రమబద్ధీకరించడానికి కూటమి పార్టీలు ప్రత్యేక వ్యవస్థలను సిద్ధం చేసుకోవడం హాట్ టాపిక్‌గా మారింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే విచ్చలవిడిగా చేరికలను ప్రోత్సహించకుండా ఒక పద్ధతి ప్రకారం ఆలస్యం చేస్తూ వస్తున్నారు. ఎన్నికల ముగిసిన వెంటనే కొంతమందికి మాత్రమే ఎంట్రీ ఇచ్చినప్పటికీ, ఆ తర్వాత చేరికలకు బ్రేకులు వేశారు. దీని వెనుక ప్రభుత్వ స్థిరత్వం, సొంత పార్టీల క్యాడర్‌లో అసంతృప్తి రాకుండా చూసుకోవాలనే చంద్రబాబు, పవన్ కల్యాణ్ ల సుదీర్ఘ వ్యూహం ఉంది. అయితే, ప్రస్తుతం వైసిపిలో యాక్టివ్ గా లేని, ఇప్పటికే ఆ పార్టీకి రాజీనామా చేసి గోడ మీద పిల్లిలా ఉన్న సీనియర్ల సంఖ్య పెరిగిపోవడంతో, వారిని ఎక్కువ కాలం వెయిటింగ్‌లో ఉంచడం కంటే పార్టీల్లోకి ఆహ్వానించడమే శ్రేయస్కరమనే భావనకు కూటమి నేతలు వచ్చారు.చేరికలు ఒకరి పార్టీలోకి మరొకరు దూకడం వల్ల కూటమిలో అంతర్గత కలహాలు రాకుండా ఉండేందుకు ప్రత్యేక ఫిల్టరింగ్ వ్యవస్థలను ఏర్పాటు చేశారు. జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ఇతర పార్టీల నుంచి వచ్చే నేతల స్క్రీనింగ్ కోసం, చేరికల ప్రక్రియను పర్యవేక్షించడానికి ఒక ప్రత్యేక కమిటీని రంగంలోకి దించారు. తెలుగుదేశం పార్టీలో చేరికలను సమీక్షించడానికి, స్థానిక నేతల అభ్యంతరాలను పరిష్కరించడానికి ఎప్పటి నుంచో ఒక ప్రత్యేక విభాగం అంతర్గతంగా పనిచేస్తోంది. టీడీపీ–జనసేన–బీజేపీల మధ్య సీట్ల సర్దుబాటు లేదా క్షేత్రస్థాయి సమన్వయం దెబ్బతినకుండా, ఏ నేత ఏ పార్టీలో చేరితే సామాజికంగా, రాజకీయంగా లబ్ధి చేకూరుతుందో తేల్చేందుకు కూటమి తరఫున ఒక కో–ఆర్డినేషన్ కమిటీ తుది నిర్ణయం తీసుకోనుంది.ఇంతకాలం చేరికలపై వెనకడుగు వేయడానికి ప్రధాన కారణం స్థానికంగా ఉన్న లీడర్ల మధ్య టికెట్ల లొల్లి వస్తుందనే భయం. ఒక నియోజకవర్గంలో ఇప్పటికే కూటమి ఎమ్మెల్యే ఉన్నప్పుడు, వైసిపి నుంచి వచ్చే సీనియర్‌కు వచ్చే ఎన్నికల్లో సీటు ఎలా ఇస్తారు? అనే ప్రశ్న తలెత్తింది. అయితే, కేంద్ర ప్రభుత్వం త్వరలోనే డీలిమిటేషన్ ప్రక్రియను చేపట్టడం ఖాయమనే సంకేతాలు స్పష్టంగా రావడం ఇక్కడ గేమ్ ఛేంజర్‌గా మారింది. వచ్చే ఎన్నికల నాటికి ఆంధ్రప్రదేశ్‌లో అసెంబ్లీ స్థానాల సంఖ్య గణనీయంగా పెరుగుతుందనే భరోసా రావడంతో, కొత్తగా వచ్చే నేతలకు కూడా భవిష్యత్తులో సీట్లు సర్దుబాటు చేయవచ్చనే ధీమాతో కూటమి అగ్రనేతలు గేట్లు ఎత్తడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.రాజకీయ వర్గాల సమాచారం ప్రకారం, ఈ విడత చేరికల్లో ఉత్తరాంధ్ర తో పాటు కోస్తా తీరం వెంబడి నెల్లూరు జిల్లా వరకు ఉన్న వైసిపికి చెందిన కనీసం 15 నుండి 20 మంది కీలక నేతలు క్యూ కట్టబోతున్నారు. రాయలసీమలోనూ పట్టున్న కొందరు రెడ్డి సామాజికవర్గ నేతలు కూడా కూటమితో టచ్‌లోకి వెళ్లినట్లు తెలుస్తోంది. వైసిపి అధినాయకత్వం వైఖరిపై నమ్మకం కోల్పోవడం, క్షేత్రస్థాయిలో క్యాడర్ మొత్తం కూటమి వైపు షిఫ్ట్ అయిపోవడంతో, తమ రాజకీయ భవిష్యత్తును కాపాడుకోవడానికి వీరంతా లగేజ్ సర్దుకుంటున్నట్లుగా భావిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో సామాజిక సమీకరణాలు అత్యంత కీలకం. గత ఎన్నికల ఫలితాలు నిరూపించింది ఏంటంటే.. టీడీపీ – జనసేన కలిసి ఉన్నంత కాలం వైసిపి గెలవడం అసాధ్యం. ఇదే విషయాన్ని వైసీపీ నేతలు కూడా చెబుతూ వస్తున్నారు. ఈ కూటమి కనీసం మరో రెండు దశాబ్దాల పాటు బలంగా కొనసాగుతుందనే నమ్మకం రాజకీయ నాయకుల్లో ఏర్పడింది. ఎప్పటికీ అధికారంలోకి రాలేని పార్టీలో ఉండి సమయం, డబ్బు వృధా చేసుకోవడం కంటే, పవర్ సెంటర్‌గా మారిన కూటమిలో భాగమవ్వడమే సరైన మార్గమని వైసిపి నేతలు భావిస్తున్నారు. ఈ చేరికల తుఫాను కేవలం వైసిపిని మరింత బలహీనపరచడానికే కాకుండా.. కూటమిలోని అంతర్గత బలాబలాలను మార్చడానికి కూడా ఉపయోగపడనుంది. పవన్ కల్యాణ్ ఏర్పాటు చేసిన కమిటీ ద్వారా జనసేన గ్రాఫ్ మరింత పెరిగేలా బలమైన సామాజికవర్గ నేతలను ఆకర్షించే అవకాశం ఉంది, తద్వారా రాబోయే రోజుల్లో టీడీపీకి సమానంగా లేదా బలమైన ప్రత్యామ్నాయంగా జనసేన ఎదిగే వ్యూహం ఇందులో కనిపిస్తోంది. మొత్తానికి, ఏపీలో రాబోయే కొన్ని వారాలు సరికొత్త రాజకీయ వలసలకు వేదిక కానున్నాయి.

**జనసేనలో జాయినింగ్ కమిటీ**

జనసేన అధినేత పవన్ కల్యాణ్ వచ్చే ఎన్నికలకు ఇప్పటి నుంచే పార్టీని సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది. తనకు బలమైన నాయకత్వం కావాలని ఆయన భావిస్తున్నారు. జనసేన ఇప్పటి వరకూ కొన్ని నియోజకవర్గాల్లో మాత్రమే బలంగా ఉంది. రాష్ట్రంలో అధిక శాతం జనసేన విస్తరించాలంటే అందుకు సరైన నాయకత్వం అవసరమని భావిస్తున్నారు. అందుకే పవన్ కల్యాణ్ తాజాగా కీలక నిర్ణయం నిర్ణయం తీసుకున్నారు.జనసేనలో చేరికల సమన్వయానికి జాయినింగ్స్ కమిటీని ఏర్పాటు చేశారు. 14 మంది సభ్యులతో 'ఏపీ జనసేన కమిటీ' ఏర్పాటు చేశారు. త్వరలో ఏపీ తరహాలోనే తెలంగాణలో జాయినింగ్స్ కమిటీని ఏర్పాటు చేస్తామని జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కల్యాణ్ ప్రకటించారు. అంటే చేరికలకు పవన్ కల్యాణ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లే కనిపిస్తుంది.అధికారంలోకి వచ్చిన తొలి నాళ్లలో మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు సామినేని ఉదయభాను, కిలారు రోశయ్య వంటి వారిని పార్టీలోకి తీసుకున్నారు వారంతా వైసీపీ నుంచి వచ్చిన వారే. నియోజకవర్గాల్లో బలమైన నేతలు. ఇక వైసీపీ నుంచి వచ్చే వారికి కూడా పవన్ కల్యాణ్ ఒకరకంగా గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు కనపడుతుంది. దీంతో రెండు లక్ష్యాలు నెరవేరుతాయని పవన్ కల్యాణ్ భావిస్తున్నారు. మొదటిది జనసేనకు బలమైన నాయకత్వం ఏర్పాటు కావడం. రెండోది వైసీపీని బలహీనపర్చడం. వైసీపీలో ఉన్న బలమైన నేతలు వస్తామంటే తీసుకునేందుకు పవన్ కల్యాన్ సిద్ధం అని ఈ నిర్ణయం తో స్పష్టం చేసినట్లు తెలిసింది. ఇప్పటి వరకూ జనసేనలో చేరేందుకు కొందరు ప్రయత్నిస్తున్నా పవన్ కల్యాణ్ అనుమతి కోసం ఎదురు చూస్తున్నారు.ఇందుకోసం పధ్నాలుగు మందితో ప్రత్యేకంగా కమిటీని నియమించడం వెనక కూడా పవన్ కల్యాణ్ ఒక వ్యూహం ప్రకారం ముందుకు వెళుతున్నారని అనిపిస్తుంది. ఎందుకంటే వైసీపీ, టీడీపీ, బీజేపీ ఏ పార్టీ నుంచి వచ్చినా చేర్చుకోవాలంటే ముందు ఈ కమిటీ ఒకే అంటేనే తర్వాత పవన్ కల్యాణ్ అనుమతి కోసం వెళ్లాల్సి ఉంటుంది. కమిటీ అన్ని రకాలుగా పరిశీలించి నేతల చేరికపై పవన్ కల్యాణ్ కు నివేదిక ఇచ్చిన తర్వాత మాత్రమే జనసేన పార్టీ కండువా కప్పుతారు. కోస్తాంధ్రతో పాటు రాయలసీమ నుంచి కూడా జనసేనలో పెద్దయెత్తున నేతలను అంటే నియోజకవర్గ స్థాయిలో బలమైన లీడర్లను చేర్చుకుంటే వచ్చే ఎన్నికల్లో ఎక్కువ స్థానాల్లో పోటీ చేసి బలమైన పార్టీగా అవతరించాలన్న వ్యూహంతోనే చేరికలకు పవన్ ఈ స్ట్రాటజీని అమలు చేస్తునట్లు అనిపిస్తుంది. మరి ఏ పార్టీ నుంచి చేరతారన్నది చూడాల్సిందే.

# అమరావతికి ట్రాఫిక్ ఫ్రీ జర్నీ.. నాలుగు లైన్లతో కొత్త ఆర్వోబీ..

**విజయవాడ, జూన్ 18, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి వెళ్లేవారి కష్టాలు తొలగిపోనున్నాయి. మంగళగిరి నుంచి రాజధాని ప్రాంతానికి వెళ్లే మార్గంలో ఇబ్బందిగా మారిన నిడమర్రు రైల్వే లెవెల్ క్రాసింగ్ సమస్యకు పరిష్కారం లభించింది. నిడమర్రు రైల్వే లెవల్ క్రాసింగ్ దగ్గర రైల్వే ఓవర్ బ్రిడ్జికి గ్రీన్‌సిగ్నల్ రాగా.. ఇవాళ కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మంత్రి నారా లోకేష్‌లు శంకుస్థాపన చేశారు. రూ.142 కోట్లతో ఈ ఆర్వోబీని నిర్మించనున్నారు. మంత్రి నారా లోకేష్ చొరవతో ఎన్నో ఏళ్ల సమస్యకు పరిష్కారం లభించింది.గుంటూరు జిల్లా నిడమర్రు రైల్వే లెవల్ క్రాసింగ్ వల్ల మంగళగిరి నుంచి అమరావతి, తాడికొండ వైపు రాకపోకలు కొనసాగించేవారికి ఇబ్బందులు ఎదురయ్యాయి. వాహనాలు నిలిచిపోవడంతో ట్రాఫిక్ సమస్యలు ఎదురయ్యేవి. అక్కడ తరచూ గేటు మూయడంతో వాహనదారులు, స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రద్దీ సమయంలో వాహన రాకపోకలు ఆగిపోవడంతో పాటుగా ప్రయాణ సమయం పెరగడం, అత్యవసర సేవలకు అంతరాయం ఎదురైంది. అలాగే మంగళగిరి దగ్గర ఉన్న క్రికెట్ స్టేడియానికి వెళ్లవారికి ఇబ్బందులు తప్పలేదు. ఈ విషయం మంత్రి లోకేష్‌కు తెలియడంతో ఆయన చొరవ తీసుకుని ఆర్వోబీ కోసం రైల్వే అధికారులకు రిక్వెస్ట్ చేయడంతో మంజూరు చేశారు. ఈ ఆర్వోబీ పూర్తయితే అమరావతి, తాడికొండ, మంగళగిరి, నిడమర్రు ప్రాంతాల ప్రజలకు ఇబ్బందులు తొలగిపోతాయి. మంగళగిరి నుంచి నిడమర్రు, బేతపూడి, నీరుకొండ, కురగల్లు గ్రామాల ప్రజలకు ప్రమాయణ సమయం తగ్గుతుందని చెబుతున్నారు.నిడమర్రు ఆర్వోబీ 10 మీటర్ల ఎత్తు, 767.50 మీటర్లు పొడవు, 28 మీటర్ల వెడల్పుతో నాలుగు లైన్లుగా నిర్మించనున్నారు. రైల్వే లైన్ నుంచి మంగళగిరి వైపు 405.50 మీటర్లు, అమరాతి వైపు 362 మీటర్లు నిర్మాణం చేపట్టనున్నారు. ఆర్వోబీ నాలుగులైన్లుగా.. ప్రతి లైను 3.75 మీటర్లు.. గ్యారేజ్ వెడల్పు 15 మీటర్లు

ఉంటుంది. 0.45 మీటర్లు చొప్పున రెండు వైపులా క్రాస్ బ్యారియర్లు, 0.45 మీటర్లు మధ్య డివైడర్ నిర్మించనున్నారు. సర్వీసు రోడ్డు డ్రైన్లతో కలిపి రెండు వైపులా 11 మీటర్లు(5.5ఐ2) 5.5 మీటర్ల వెడల్పు ఉంటుంది. రోడ్లతో కలిపి మొత్తం వంతెన వెడల్పు 28 మీటర్లు ఉంటుంది. నిడమర్రు ఆర్వోబీకి శంకుస్థాపన చేయడంతో త్వరలోనే నిర్మాణ పనులు ప్రారంభించనున్నారు.

# కేడర్‌ను పట్టించుకోని నేతలు.. లోకేష్ సీరియస్ వార్నింగ్!

**గుంటూరు జూన్ 18, పెన్ పవర్:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఐదేళ్ల పాలనలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, సోషల్ మీడియా యాక్టివిస్టులు పడిన ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. కేవలం ప్రభుత్వ విధానాలను ప్రశ్నిస్తూ ఫేస్‌బుక్, ఎక్స్‌లలో పోస్టులు పెట్టినందుకే అర్ధరాత్రి వేళల్లో సీఐడీ, స్థానిక పోలీసులు ఇళ్లపై పడి అరెస్టులు చేసిన సంఘటనలు వందలాదిగా ఉన్నాయి. మరీ దారుణంగా, కేవలం రాజకీయంగా అణచివేయాలనే ఏకైక లక్ష్యంతో సోషల్ మీడియా ఐటీ చట్టాల కింద కాకుండా, జీవితాలను నాశనం చేసేలా గంజాయి రవాణా, రేప్ కేసులు, హత్యాయత్నం వంటి తీవ్రమైన నాన్–బెయిలబుల్ అక్రమ కేసులను టీడీపీ కేడర్‌పై అక్రమంగా బనాయించారు. దీంతో ఎంతోమంది యువకులు, పార్టీ సానుభూతిపరులు కోర్టుల చుట్టూ తిరుగుతూ తీవ్ర మానసిక, ఆర్థిక నష్టాన్ని చవిచూశారు.టీడీపీ–జనసేన–బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తమపై ఉన్న అక్రమ కేసులు తక్షణమే రద్దవుతాయని వేలాది మంది కార్యకర్తలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ప్రభుత్వం కూడా ప్రాథమికంగా బాధితుల వివరాలతో కూడిన లిస్టులను సేకరించింది. అయితే, చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ప్రభుత్వం పగ్గాలు చేపట్టి రెండేళ్లు గడుస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో ఇప్పటికీ అందరిపై కేసులు ఎత్తివేసే ప్రక్రియ పూర్తిస్థాయిలో కొలిక్కి రాలేదు. తాజాగా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేష్ నియోజకవర్గాల ఇన్‌ఛార్జ్‌లు, ఎమ్మెల్యేలతో జరిపిన అంతర్గత సమీక్షా సమావేశాలలో మాట్లాడిన మాటలను బట్టి క్షేత్రస్థాయిలో కేడర్ ఇప్పటికీ ఈ అక్రమ కేసుల వల్ల ఇబ్బందులు పడుతోందనే చేదు నిజం స్పష్టమయింది.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నియోజకవర్గాల్లో కొంతమంది ఎమ్మెల్యేలు, కీలక నేతలు తమ సొంత పనుల్లో, అధికారిక హోదాల్లో బిజీ అయిపోయి.. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తమ కోసం లాఠీ దెబ్బలు తిని, జైలుపాలైన నిఖార్సైన కార్యకర్తలను విస్మరించారనే అసంతృప్తి పార్టీలో వ్యక్తమవుతోంది. ఈ క్షేత్రస్థాయి ఫీడ్‌బ్యాక్‌పై నారా లోకేష్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. కష్టకాలంలో పార్టీ జెండా మోసిన కార్యకర్తలను కాపాడుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని, వెంటనే వారందరికీ న్యాయ సహాయం అందించి కేసుల నుంచి విముక్తి కల్పించే బాధ్యతను స్థానిక నేతలే తీసుకోవాలని ఆయన గట్టిగా హెచ్చరించినట్లు పార్టీ వర్గాల్లో చర్చ నడుస్తోంది.ఇప్పటికైనా ప్రభుత్వం , టీడీపీ అధిష్టానం కేవలం సాధారణ ఆదేశాలకే పరిమితం కాకుండా, ఒక స్పెషల్ లీగల్ సెల్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. రాష్ట్రవ్యాప్తంగా పోలీస్ స్టేషన్లు, కోర్టుల పరిధిలో పెండింగ్‌లో ఉన్న ప్రతి ఒక్క కార్యకర్త కేసుకు సంబంధించిన డేటాను క్రోడీకరించి, చట్టపరమైన లూప్‌హోల్స్‌ను తొలగిస్తూ హోంశాఖ ద్వారా జీవోలు జారీ చేసి కేసులను మాఫీ చేయించాలి. ఐదేళ్లపాటు సర్వస్వం కోల్పోయి పోరాడిన కేడర్‌తో నిరంతరం టచ్‌లో ఉంటూ, వారిపై ఉన్న అక్రమ కేసుల మరకలను త్వరితగతిన తుడిచివేసినప్పుడే.. భవిష్యత్తులో పార్టీ కోసం పని చేసే కార్యకర్తల్లో నమ్మకం, ధైర్యం నిలుస్తాయి.

# ఉత్తరాంధ్ర టూ ప్రకాశం.. విచిత్రమైన సైలెన్స్!

**ఒంగోలు, జూన్ 18, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మాజీ ఎమ్మెల్యేలు, ఓడిపోయిన సీనియర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌ల విచిత్రమైన మౌన వ్రతం ఇప్పుడు అటు పార్టీ కేడర్‌లోనూ, ఇటు రాజకీయ వర్గాల్లోనూ పెద్ద చర్చకు దారితీసింది. సాధారణంగా ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత ప్రజా సమస్యలపై పోరాడుతూ లైమ్‌లైట్‌లో ఉండేందుకు నేతలు ప్రయత్నిస్తుంటారు. కానీ, వైసీపీకి చెందిన అత్యధిక శాతం మంది మాజీ ప్రజాప్రతినిధులు ప్రస్తుతం ఇటు అసెంబ్లీ వ్యవహారాలకు, అటు మీడియా ప్రెస్ మీట్లకు పూర్తిగా దూరంగా ఉంటున్నారు. కనీసం సొంత నియోజకవర్గాల్లో కేసులు, వేధింపులు ఎదుర్కొంటున్న కిందిస్థాయి కార్యకర్తలకు కూడా అందుబాటులో లేకుండా ఫోన్లు స్విచ్చాఫ్ చేసుకోవడం లేదా బెంగళూరు, హైదరాబాద్ వంటి నగరాలకు షిఫ్ట్ అయిపోయారు. రెండేళ్లవుతున్నా మెరుపు తీగల్లా వచ్చి పోతున్నారు.ముఖ్యంగా ఉత్తరాంధ్ర , ప్రకాశం జిల్లాల పరిధిలోని కొందరు బడా మాజీ ఎమ్మెల్యేల ప్రవర్తన ఈ అనుమానాలకు మరింత బలాన్ని చేకూరుస్తోంది. గత ప్రభుత్వంలో మంత్రులుగా, జిల్లాలు ఏలిన కీలక నేతలుగా వెలిగిన వారు సైతం ఇప్పుడు నియోజకవర్గాల్లో గడప దాటడం లేదు. ప్రకాశం జిల్లాకు చెందిన ఒక సీనియర్ మాజీ కాకతాళీయంగా తన వ్యాపారాలన్నీ బెంగళూరుకు మార్చేసుకుని అక్కడే సెటిల్ అవ్వగా.. ఉత్తరాంధ్రకు చెందిన మరో ఇద్దరు కీలక నేతలు కనీసం స్థానిక పార్టీ ఆఫీసు వైపు కూడా చూడటం లేదు. ఐదేళ్ల పాటు హడావుడి చేసిన ఈ లీడర్లు హఠాత్తుగా ఇంతలా సైలెంట్ అయిపోవడం వెనుక కేవలం భయం మాత్రమే లేదు.. అంతకుమించిన పొలిటికల్ ప్లాన్ ఉందనే చర్చ నడుస్తోంది.పొలిటికల్ సర్కిల్స్ లో వినిపిస్తున్న అంతర్గత సమాచారం ప్రకారం.. ఈ మౌనం వెనుక అసలు కారణం కూటమి పార్టీల్లోకి జంప్ అయ్యేందుకు నడుస్తున్న గ్రౌండ్ వర్క్. గత హయాంలో తాము చేసిన కొన్ని వివాదాస్పద నిర్ణయాలు, ఆర్థిక లావాదేవీలపై ప్రస్తుత ప్రభుత్వం విచారణలు జరుపుతుండటంతో.. లీగల్ చిక్కుల నుండి ఎలాగైనా బయటపడాలని వీరు భావిస్తున్నారు. అందుకే, జగన్ రెడ్డి ఇచ్చే పిలుపులకు గానీ, తాడేపల్లి నుంచి వచ్చే ఆదేశాలకు గానీ స్పందించకుండా.. తాము వైకాపాకు దూరంగా ఉంటున్నామనే సంకేతాలను కూటమి పెద్దలకు పంపిస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల కంటే ముందే లేదా సరైన రాజకీయ ముహూర్తం చూసుకుని అధికార పక్షంలో చేరిపోయేందుకు లోపాయికారీగా రాయబారాలు నడుపుతున్నట్లు తెలుస్తోందినాయకులు ఇలా బెంగళూరు రిసార్టులకో, విదేశీ పర్యటనలకో పరిమితమై 'సేఫ్ గేమ్' ఆడుతుండటంతో.. గ్రామాల్లోని వైకాపా సాధారణ కార్యకర్తలు, ద్వితీయ శ్రేణి లీడర్లు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. స్థానిక లొల్లీలు ఎదురైనప్పుడు కనీసం ఫోన్ చేసి ధైర్యం చెప్పే నాథుడే కరువవ్వడంతో.. కేడర్ అంతా ఒక్కొక్కరుగా కూటమి పార్టీల వైపు వెళ్లడమో లేదా రాజకీయాలకు దూరంగా ఉండటమో చేస్తున్నారు. లీడర్లేమో అటు అధినేత జగన్‌కు సమాధానం చెప్పలేక, ఇటు కేసులు భరించలేక కూటమి కండువా కప్పుకోవడానికి రూట్ క్లియర్ చేసుకుంటుంటే.. తమను నమ్ముకున్నందుకు పొలిటికల్ స్క్రీన్ పై తాము ఒంటరి వాళ్లమయ్యామని కిందిస్థాయి కార్యకర్తలు లోలోపల మధనపడుతున్నారు.

# వివాదాల సర్...

**విజయవాడ, జూన్ 18, పెన్ పవర్:** తెలుగు రాష్ట్రాల్లో కేంద్ర ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర ప్రక్షాళన చేస్తోంది. ఈనెల 15 నుంచి ఇంటింటా సర్వే ప్రారంభం అయింది. అయితే తెలుగు రాష్ట్రాల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీతో పాటు భారత రాష్ట్ర సమితిలో ఒక రకమైన ఆందోళన కనిపిస్తోంది . ఓట్ల తొలగింపు కోసం అధికారపక్షాలు అక్రమాలకు పాల్పడుతున్నాయంటూ ఆరోపణలు చేయడం మొదలుపెట్టారు. అయితే గతంలో ఆ రెండు పార్టీలు అధికారంలో ఉండేవి. అందుకే అంతలా కంగారు పడుతున్నాయి అనేది బహిరంగ రహస్యం. ఎందుకంటే ప్రతి గ్రామంలోనూ తమకు అనుకూలమైన ఓట్లు జాబితాలో ఉంచి.. తమకు ప్రతికూలమైన ఓట్లను తొలగించారు. అటువంటి ఓట్లు ఇప్పుడు తొలగిస్తారు అన్న భయం ఆ రెండు పార్టీలకు వెంటాడుతోంది. ఆ కారణంగానే ఆ రెండు పార్టీలు ఇప్పుడు గగ్గోలు పెడుతున్నాయి.ఈనెల 15 నుంచి ఇంటింటికి వెళ్తున్న బూత్ లెవెల్ అధికారులు సమగ్ర సర్వే చేపడుతున్నారు. అత్యంత పారదర్శకంగా, డిజిటల్ టెక్నాలజీ ఆధారంగా సాగుతోంది ఈ ప్రక్రియ. అర్హత ఉన్న ఈ ఓటరును కూడా తొలగించరు. కేవలం చనిపోయిన వారు, ఒకే వ్యక్తికి రెండు మూడు చోట్ల ఓటు ఉంటే అటువంటి వారిని తొలగిస్తున్నారు. డబుల్ ఎంట్రీలు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారి ఓట్లను మాత్రమే నిబంధనల ప్రకారం క్షేత్రస్థాయి పరిశీలన తర్వాత తొలగిస్తారు. ఇది సాధారణ, చట్టబద్ధమైన ప్రక్రియ కూడా. అయితే గతంలో బెంగాల్లో మమతా బెనర్జీ నానా హడావిడి చేశారు. ఈశాన్య రాష్ట్రాల్లో బంగ్లాదేశ్ చొరబాటుదారులు, అక్రమ ఓటరు గుర్తింపు పొందిన వారు లేనిపోని హడావిడి చేశారు. అయితే తెలుగు రాష్ట్రాల్లో మాత్రం ఆ పరిస్థితి లేదు. అటువంటి చొరబాటుదారులకు ఛాన్స్ లేదు. అయితే గతంలో చాలా రకాల విన్యాసాలు చేశాయి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీతో పాటు భారత రాష్ట్ర సమితి. అందుకే ఇప్పుడు కంగారు పడిపోతున్నాయి.రెండు తెలుగు రాష్ట్రాల్లో అధికారం చేపట్టాయి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ, భారత రాష్ట్ర సమితి. అధికారంలో ఉన్నప్పుడు వ్యవస్థలను అడ్డం పెట్టుకుని వేలాదిగా దొంగ ఓట్లు చేర్పించారన్న విమర్శలు ఉన్నాయి. అటువంటి ఓట్లు ఇప్పుడు గల్లంతు కాక తప్పవు. ఈ డిజిటల్ స్క్రూటినీలో అడ్డంగా బుక్ కావడం ఖాయం. సర్వే ప్రక్రియపై పౌరులు, పార్టీలు అప్రమత్తంగా ఉండి తమ ఓట్లను వెరిఫై చేసుకోవడంలో ఎలాంటి తప్పులేదు. కానీ అసలు ఓట్లు పూర్తిగా తొలగించేస్తున్నారంటూ గగ్గోలు పెట్టడం వెనుక మాత్రం వారి భయం వారికి ఉంది. కేవలం ఎన్నికల సంఘం మార్గదర్శకాలను మాత్రమే బూత్ లెవెల్ అధికారులు అమలు చేస్తారు. దీనిని ఎప్పటికప్పుడు పరిశీలించి తప్పులు జరిగితే అడ్డుకోవచ్చు. కానీ రెండు తెలుగు పార్టీలు మాత్రం ఇప్పటినుంచే ఓటమికి కారణాలు వెతుకుతున్నట్టు స్పష్టమవుతోంది.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

# జగన్ ఎమోషనల్ స్పీచ్.. ప్రతి ఇంట్లో నా ఫోటో ఉండాలని తపన, తాపత్రయం



మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహనరెడ్డి ఎమోషనల్ అయ్యారు. చనిపోయిన తర్వాత కూడా ప్రతి ఇంట్లో నా ఫోటో ఉండాలని తపన, తాపత్రయం ఉందని వ్యాఖ్యానించారు. గురువారం తాడేపల్లిలో రంపచోడవరం నియోజకవర్గ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాట్లాడిన మాజీ సీఎం జగన్ రెడ్డి గతానికి భిన్నంగా భావోద్వేగంతో మాట్లాడారు. ఇదే సమయంలో రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు, చంద్రబాబు నాయుడు పాలనలోని వైఫల్యాలే ఇందుకు ప్రధాన కారణమని ఆయన ఆరోపించారు.

రాష్ట్రంలో పాలన దారుణంగా ఉందని జగన్ అభిప్రాయపడ్డారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పక్కనపెట్టి, ప్రభుత్వం తన బాధ్యతలను విస్మరిస్తోందని ఆయన విమర్శించారు. చంద్రబాబు తన సుదీర్ఘ రాజకీయ అనుభవంతో రాష్ట్రంలో మెరుగైన పాలన అందిస్తారని ఆశించిన ప్రజలకు, ప్రస్తుతం లభిస్తున్న ఫలితాలు నిరాశాజనకంగా ఉన్నాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలు నిలిచిపోవడం, ధరల పెరుగుదల, మరియు ప్రజా సంక్షేమ పథకాల అమలులో జాప్యం వంటి అంశాలు ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని ఆయన వాదించారు. ముఖ్యంగా సామాన్యుడిపై భారం పడుతోందని, పాలనా పరమైన లోపాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని ఆయన ఆరోపణలు చేశారు.

**ప్రజాక్షేత్రంలోనే తేల్చుకుందాం**

ప్రభుత్వం చేస్తున్న పొరపాట్లను ఎండగట్టడంలో వైఎస్సార్సీపీ ముందుంటుందని జగన్ స్పష్టం చేశారు. బాబు పాలనలో వ్యవస్థలు బలహీనపడ్డాయని, దీనివల్ల ప్రజలకు అందాల్సిన ఫలాలు అందడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యబద్ధంగా ప్రభుత్వంపై పోరాటం చేస్తామని, తప్పులను సరిదిద్దే దిశగా తమ గళాన్ని వినిపిస్తామని ఆయన ప్రకటించారు.

ప్రస్తుత ఏపీ రాజకీయాల్లో జగన్ చేస్తున్న ఈ వ్యాఖ్యలు, అధికార పార్టీపై తీవ్ర ఒత్తిడిని పెంచే అవకాశం ఉంది. రాబోయే రోజుల్లో ప్రతిపక్షంగా వైఎస్సార్సీపీ ఏ తరహా వ్యూహాలను అనుసరిస్తుందో చూడాల్సి ఉంది. మరోవైపు, అధికార పక్షం ఈ విమర్శలను ఏ విధంగా తిప్పికొడుతుందనేది రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది.

# తిట్లు.. శాపనార్థాలు.. కోవూరులో పొలిటికల్ రచ్చ! ప్రసన్నకుమార్ రెడ్డి ఎం ప్రశాంతిరెడ్డి





నెల్లూరు జిల్లా కోవూరు రాజకీయాలు హీటెక్కాయి. అధికార టీడీపీ ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, వైసీపీకి చెందిన మాజీ ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి మధ్య మాటల తూటాలు పేలుతున్నాయి. నియోజకవర్గంలో గత ప్రభుత్వంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి విమర్శించడంపై మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్ రెడ్డి అభ్యంతరం వ్యక్తంచేస్తున్నారు. ఎమ్మెల్యే విమర్శలను తిప్పికొట్టే సమయంలో ఆమెపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. దీంతో ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి కూడా ఘాటుగా స్పందించారు. మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్ రెడ్డిని పిచ్చోడు అంటూ వ్యాఖ్యానించి మరింత కాక రాజేశారు. ఈ ఇద్దరి మధ్య మాటల యుద్ధానికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.కోవూరు రాజకీయం సెగలు పుట్టిస్తోంది. ప్రధానంగా ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే మధ్య రాజకీయ పోరు వాడివేడిగా సాగుతోంది. గతంలో ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిపై వ్యక్తిగత దూషణలు చేశారని మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్ రెడ్డిపై కేసులు నమోదైన విషయం తెలిసిందే. అంతేకాకుండా ఆయన ఇంటిపై దుండగులు దాడి చేసి ఫర్నీచర్, విలువైన వస్తువులు, గృహోపకరణాలు ధ్వంసం చేశారు. ఈ సంఘటనతో కోవూరులో పాలిటిక్స్ హైవోల్టేజ్ ను తాకాయి. అక్కడి నుంచి ఇద్దరు నేతలు ఢీ అంటే ఢీ అంటున్నారు. తాజాగా ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ఇంటి పేరును మార్చేస్తూ మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్ రెడ్డి విమర్శలు చేయడంతో మళ్లీ మాటల యుద్ధం మొదలైంది.కోవూరు నియోజకవర్గంలో గత ప్రభుత్వంలో తట్ట మట్టి కూడా వేయలేదని ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి విమర్శలపై రియాక్ట్ అయిన మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్ రెడ్డి తమ కోసం కాదని, ఎమ్మెల్యేగా గెలిచిన రెండేళ్లలో ఏం అభివృద్ధి చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఇక ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని "సోమిరెడ్డి ప్రశాంతిరెడ్డి" అంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. అంతేకాకుండా తట్ట మట్టి కూడా వేయలేదన్న విమర్శలను ఖండిస్తూ రేణిగుంట మెస్ లో తట్టల వ్యాపారం చేశావా? అంటూ ఎమ్మెల్యేపై ప్రసన్నకుమార్ రెడ్డి విమర్శలు గుప్పించారు.దీనిపై సీరియస్ గా రియాక్ట్ అయిన ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి.. తాను సోమిరెడ్డి ప్రశాంతిరెడ్డినా లేక వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డినా అన్న విషయం మాజీ ఎమ్మెల్యేకు అనవసరం అంటూ తేల్చిచెప్పారు. ఈ విషయమై ఎన్నికలకు ముందే తాను ప్రజలకు వివరణ ఇచ్చానని స్పష్టం చేశారు. మాజీ ఎమ్మెల్యే మతిభ్రమించి మాట్లాడుతున్నారని, ఆయనో పిచ్చోడంటూ తీవ్రవ్యాఖ్యలు చేశారు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి. ఇకపై తన విషయంలో తప్పుగా మాట్లాడితే సహించేది లేదని సీరియస్ వార్నింగ్ ఇచ్చారు. దీంతో నియోజకవర్గంలో రాజకీయం ఒక్కసారిగా వేడెక్కిందని చెబుతున్నారు.

# గ్లోబల్ బ్రాండ్.. లోకల్ బ్లండర్!




ఆధునిక మార్కెటింగ్ ప్రపంచంలో వినియోగదారుల దృష్టిని ఆకర్షించడానికి బ్రాండ్లు సరికొత్త మార్గాలను ఎంచుకుంటున్నాయి. ఈ క్రమంలో కొన్ని సంస్థలు సామాజిక బాధ్యతను, నైతిక విలువలను పూర్తిగా విస్మరిస్తున్నాయి. తాజాగా ఓ ప్రముఖ లైంగిక ఆరోగ్య ఉత్పత్తుల సంస్థ పాకిస్తాన్ విభాగం విడుదల చేసిన ఒక ప్రకటన సోషల్ మీడియాలో తీవ్ర దుమారాన్ని రేపింది. లైంగిక వేధింపులు ..సమ్మతి లేని ప్రవర్తనను తేలికగా చూపేలా ఉన్న ప్రకటనపై నెటిజన్లు తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు.సదరు ప్రకటనలో చూపించిన కంటెంట్ ఆందోళనకరంగా ఉందని నెటిజన్లు ఆరోపిస్తున్నారు. ఒకరిపై మితిమీరిన వ్యామోహం పెంచుకోవడం.. వారి అనుమతి లేకుండా ప్రవర్తించడం వంటి అంశాలను ఈ ప్రకటనలో పరోక్షంగా ప్రోత్సహించినట్లు ఉందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సమాజంలో సమ్మతి అనే భావనపై విస్తృతంగా అవగాహన కల్పించాల్సిన ఒక బ్రాండ్.. దానికి భిన్నంగా లైంగిక వేధింపులను సాధారణీకరించేలా మార్కెటింగ్ వ్యూహాన్ని రచించడం పట్ల తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి.ఈ ప్రకటన సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లలో వైరల్ కావడంతో ప్రజలు సదరు సంస్థపై విమర్శల వర్షం కురిపిస్తున్నారు. మహిళలపై జరుగుతున్న అకృత్యాలు, లైంగిక దాడుల వంటి సున్నితమైన అంశాలను కేవలం వ్యాపార లాభాల కోసం, ప్రచారం కోసం వాడుకోవడం అత్యంత హేయమైన చర్య అని నెటిజన్లు మండిప డుతున్నారు. ఇలాంటి కంటెంట్ సమాజానికి తప్పుడు సంకేతాలను పంపుతుందని నేరపూరిత ప్రవర్తనను సమర్థించినట్లు అవుతుందని పలువురు సామాజిక విశ్లేషకులు సైతం అభిప్రాయపడుతున్నారు.సాధారణంగా అంతర్జాతీయ బ్రాండ్లు ఇలాంటి సున్నితమైన ఉత్పత్తులను ప్రమోట్ చేసేటప్పుడు ఎంతో బాధ్యతా యుతంగా వ్యవహరించాల్సి ఉంటుంది. లైంగిక ఆరోగ్యం - హక్కుల గురించి మాట్లాడేటప్పుడు పరస్పర అంగీకారం అనేది ప్రాథమిక సూత్రం. కానీ ప్రాంతీయ మార్కెట్లలో వ్యూహాల పేరుతో స్థానిక బృందాలు తీసుకునే ఇలాంటి అనాలోచిత ఆలోచనలు, సదరు బ్రాండ్ అంతర్జాతీయ ప్రతిష్టను సైతం మసకబారుస్తాయి. క్రియేటివిటీ పేరుతో సరిహద్దులు దాటడం సరైన పద్ధతి కాదని నెటిజన్లు మండిపడుతున్నారు.ఈ వివాదం కార్పొరేట్ సంస్థలలోని అంతర్గత సమీక్షా లోపాలను ఎత్తిచూపుతోంది. ఒక ప్రకటనను ప్రజల్లోకి విడుదల చేయడానికి ముందు అది సమాజంపై ఎలాంటి ప్రభావం చూపుతుందనే విషయాన్ని అంచనా వేయడంలో కంటెంట్ రైటర్లు, క్రియేటివ్ డైరెక్టర్లు , మేనేజ్‌మెంట్ పూర్తిగా విఫలమయ్యారని ఈ ఘటన నిరూపిస్తోంది. సామాజిక సమస్యలను హేళన చేసే విధంగా రూపొందించే ప్రకటనలను తక్షణమే నిలిపివేయాలని.. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్లు వ్యక్తమవుతున్నాయి.

వాణిజ్య ప్రకటనలు కేవలం ఉత్పత్తులను అమ్ముకోవడానికి మాత్రమే కాదు. అవి సమాజంలోని సంస్కృతిని, ఆలోచనా విధానాన్ని కూడా ప్రభావితం చేస్తాయి. కాబట్టి బ్రాండ్లు కేవలం వైరల్ అవ్వాలనే తాపత్రయంతో కాకుండా నైతిక విలువలకు కట్టుబడి ఉండటం అవసరం. సమ్మతి .. వ్యక్తిగత స్వేచ్ఛను గౌరవించడం అనేది ప్రతి రంగంలోనూ తప్పనిసరి అని ఈ వివాదం మరోసారి గుర్తుచేస్తోంది.

# అమెరికాలో ఘోరం.. ఒక్క సెల్ఫీ తెచ్చిన ముప్పు.. గుర్రపు బగ్గీ ప్రమాదంలో భారతీయ యువకుడి దుర్మరణం

"అమెరికా అంటే అన్నీ పక్కా.. అక్కడ రూల్స్ అంటే రూల్సే!" అని చాలామంది చెప్పుకుంటుంటారు. కానీ అప్పుడప్పుడూ అక్కడ కూడా "అజాగ్రత్త" అనే వైరస్ ఎంత ప్రమాదకరమో నిరూపించే ఘటనలు జరుగుతూనే ఉంటాయి. తాజాగా న్యూయార్క్‌లో జరిగిన ఒక ఘోర ప్రమాదం ఈ విషయాన్ని మరోసారి నిరూపించింది. ఒక్కరి నిర్లక్ష్యం కారణంగా విహారయాత్ర కోసం అమెరికా వెళ్లిన ఒక భారతీయ కుటుంబంలో తీరని విషాదం నెలకొంది.

**సెంట్రల్ పార్క్‌లో చేదు జ్ఞాపకం**

భారత్ నుంచి మొదటిసారిగా అమెరికా విహారయాత్రకు వెళ్లిన మహాజన్ కుటుంబానికి.. న్యూయార్క్‌లోని ప్రసిద్ధ సెంట్రల్ పార్క్ సందర్శన జీవితాంతం మరిచిపోలేని చేదు జ్ఞాపకంగా మారింది. అక్కడ సరదాగా గుర్రపు బగ్గీలో షికారు చేస్తుండగా జరిగిన ప్రమాదంలో 18 ఏళ్ల రోమంచ్ మహాజన్ అనే భారతీయ యువకుడు దుర్మరణం పాలయ్యాడు.

**ఒక్క ఫొటో.. ప్రాణం తీసిన నిర్లక్ష్యం**

లభించిన సమాచారం ప్రకారం.. బగ్గీలో ప్రయాణిస్తున్న మహాజన్ కుటుంబ సభ్యులను ఒక ఫొటో తీయాలని ఆ వాహన డ్రైవర్ భావించాడు. అయితే ఇందుకోసం అతడు కనీస భద్రతా నిబంధనలను పక్కనబెట్టి గుర్రపు తాళ్లను వదిలేసి వాహనం కిందికి దిగాడు. "ఒక్క ఫొటో కోసం సేఫ్టీని సెలవుపై పంపించేశాడా?" అనిపించేలా డ్రైవర్ కిందకు దిగగానే ఆ గుర్రం ఒక్కసారిగా బెదిరిపోయి అదుపుతప్పింది. నియంత్రించే డ్రైవర్ లేకపోవడంతో ఆ బగ్గీ గుర్రం అత్యంత వేగంగా రోడ్డుపై దూసుకెళ్లింది. ఊహించని ఈ పరిణామంతో బగ్గీలో ఉన్న కుటుంబ సభ్యులు భయంతో కేకలు వేశారు. ఈ గందరగోళంలో రోమంచ్ తల్లి బగ్గీ పైనుంచి కిందపడిపోయింది.

**తల్లిని కాపాడబోయి.. అనంత లోకాలకు..**

ప్రమాదంలో చిక్కుకున్న తన తల్లిని కాపాడేందుకు 18 ఏళ్ల రోమంచ్ సాహసించాడు. ఆమెను రక్షించే క్రమంలో అతడు కూడా వేగంగా వెళ్తున్న బగ్గీ నుంచి బయటకు దూకాడు. కానీ విధి వేరేలా తీర్పు చెప్పింది. కిందపడటంతో రోమంచ్‌కు



తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతడిని అత్యవసర చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. చికిత్స పొందుతూ అతడు ప్రాణాలు కోల్పోయాడు. మిగతా కుటుంబ సభ్యులు స్వల్ప గాయాలతో బయటపడినప్పటికీ కళ్ల ముందే కొడుకు మరణించడంతో ఆ తల్లిదండ్రులు తట్టుకోలేకపోతున్నారు.

**టూరిజమా? నిర్లక్ష్యమా? మోగుతున్న నిరసనలు**

ఈ దారుణ ప్రమాదం తర్వాత న్యూయార్క్ నగరంలో గుర్రపు బగ్గీల భద్రతపై మరోసారి తీవ్ర చర్చ మొదలైంది. ప్రపంచంలోనే అత్యంత రద్దీగా ఉండే న్యూయార్క్ వీధుల్లో ఇప్పటికీ ఇలాంటి గుర్రపు బగ్గీలను అనుమతించడం ఎంతవరకు సమంజసం అన్న ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. ఒక ఫొటో కోసం డ్రైవర్ బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడం.. చివరకు ఒక యువకుడి ప్రాణం బలికావడం పట్ల తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ మొత్తం ఘటనలో "టూరిజం" కంటే "నిర్లక్ష్యం" పెద్ద పాత్ర పోషించిందని స్థానికులు మండిపడుతున్నారు.

**'రైడర్స్ లా' కు డిమాండ్**

ఈ విచారకరమైన ఘటనపై న్యూయార్క్ స్టేట్ సెనేటర్ ఎరిక్ బాట్చర్ స్పందించారు. బాధిత భారతీయ కుటుంబానికి తన సానుభూతిని తెలిపిన ఆయన, నగరంలో గుర్రపు బగ్గీలను పూర్తిగా నిషేధించేలా 'రైడర్స్ లా' ను వెంటనే ఆమోదించాలని డిమాండ్ చేశారు. ఒక్క ఫొటో... ఒక్క నిర్లక్ష్యం... ఒక్క క్షణం. కానీ ఒక కుటుంబానికి మాత్రం జీవితాంతం తీరని గుండెకోత మిగిల్చింది. "సేఫ్టీ ఫస్ట్" అని ప్రపంచానికి పాఠాలు చెప్పే అభివృద్ధి చెందిన దేశాల్లో కూడా ఆ నియమాలను సరిగ్గా అమలు చేయకపోతే ఎలాంటి భయంకరమైన ఫలితాలు ఉంటాయో ఈ ఘటన ప్రపంచానికి మరోసారి హెచ్చరించింది.

# మళ్లీ 'తమిళతంబీ' అనిపించుకున్న సీఎం విజయ్.. అసెంబ్లీలో వందేమాతరంకు మంగళం!



తమిళనాడు రాజకీయాల్లో సంచలనాలకు కొదవ లేదు. ముఖ్యంగా సినీ పరిశ్రమ నుంచి రాజకీయాల్లోకి వచ్చి ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించిన టీవీకే అధినేత విజయ్ తీసుకునే ప్రతి నిర్ణయం ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారుతోంది. తాజాగా తమిళనాడు శాసనసభ సమావేశాల ప్రారంభం సందర్భంగా ఆయన ప్రభుత్వం తీసుకున్న ఒక నిర్ణయం సరికొత్త రాజకీయ దుమారానికి తెరలేపింది. ఎన్నో ఏళ్లుగా అసెంబ్లీ సమావేశాల ఆరంభంలో వినిపించే 'వందేమాతరం' గీతానికి ఈసారి విజయ్ సర్కార్ సెలవు ప్రకటించడం తీవ్ర చర్చకు దారితీసింది.

**రాష్ట్ర గీతానికే పెద్దపీట.. అసలేం జరిగింది?**

సాధారణంగా తమిళనాడు అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యేటప్పుడు వందేమాతరం, రాష్ట్ర గీతమైన 'తమిళ్ తాయి వళ్తు' ఆలపించడం ఒక సంప్రదాయంగా వస్తోంది. అయితే ఈసారి టీవీకే ప్రభుత్వం వందేమాతరం గీతాన్ని పూర్తిగా పక్కనబెట్టేసింది. సమావేశాలను కేవలం 'తమిళ్ తాయి వళ్తు' ఆలాపనతో ప్రారంభించి, ముగింపులో జాతీయ గీతమైన 'జనగణమన'తో ముగించేలా కొత్త విధానాన్ని తీసుకొచ్చింది. "జాతీయత అంటే గౌరవమే... కానీ తమిళనాడు అంటే మాకు ఇంకాస్త ఎక్కువ గౌరవం!" అనే కొత్త రాజకీయ సూత్రాన్ని సీఎం విజయ్ ఈ నిర్ణయం ద్వారా చెప్పకనే చెప్పినట్లయింది.

**సోషల్ మీడియాలో సెటైర్లు.. నెటిజన్ల ప్రశ్నల వర్షం**

ఈ వార్త బయటకు రావడంతోనే సోషల్ మీడియాలో నెటిజన్లు, రాజకీయ విశ్లేషకులు భిన్నంగా స్పందిస్తున్నారు. "వందేమాతరం ఏమైంది విజయ్ అన్నా?" అంటూ కొందరు ప్రశ్నిస్తుంటే.. "జాతీయ గీతం జనగణమనకి ఓకే చెప్పారు... మరి జాతీయ గేయం వందేమాతరంకు నో ఎందుకు?" అని మరికొందరు నిలదీస్తున్నారు. ఇంకొందరైతే "తమిళ్ ఫస్ట్... ఇండియా నెక్స్ట్" అనే ఫార్ములాను విజయ్ గట్టిగా నమ్ముతున్నారంటూ వ్యంగ్యాస్త్రాలు సంధిస్తున్నారు. "తమిళ వాసనలు పోనిచ్చుకోని టీవీకే విజయ్.. ఇవే తగ్గించుకుంటే మంచిది" అంటూ నెట్టింట కామెంట్లు వ్యక్తమవుతున్నాయి.

**తమిళ అస్మిత వర్సెస్ జాతీయత**

విజయ్ రాజకీయాల్లోకి వచ్చినప్పటి నుంచి 'తమిళ అస్మిత', 'తమిళ భాష', 'తమిళ సంస్కృతి' అనే అంశాలనే తన ప్రధాన ఎజెండాగా ముందుకు తీసుకెళ్తున్నారు. ప్రాంతీయ భావోద్వేగాలను గౌరవించడం వేరు.. కానీ జాతీయ చిహ్నాలు, సాంప్రదాయాల విషయంలో మార్పులు చేయడం వేరంటూ ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి. "జాతీయతను పక్కన పెట్టి ప్రాంతీయతకు మాత్రమే పెద్దపీట వేయడం ఎంతవరకు సమంజసం?" అని విపక్షాలు ప్రశ్నిస్తున్నాయి.మరోవైపు విజయ్ అభిమానులు, టీవీకే శ్రేణులు మాత్రం ఈ నిర్ణయాన్ని గట్టిగా సమర్థిస్తున్నారు. సొంత రాష్ట్ర గీతానికి, భాషకు ప్రాధాన్యం ఇవ్వడంలో ఎలాంటి తప్పు లేదని.. జాతీయ గీతాన్ని ఎలాగో గౌరవిస్తున్నాం కదా అని ఎదురుదాడికి దిగుతున్నారు. ఏది ఏమైనా విజయ్ తీసుకున్న ఈ నిర్ణయం తమిళనాడులో మరోసారి "తమిళ్ వర్సెస్ నేషనల్" అనే పాత వివాదానికి కొత్త ఊపునిచ్చింది. రాజకీయంగా తమిళతనాన్ని మరింత బలంగా ప్రొజెక్ట్ చేయాలన్న వ్యూహంతోనే విజయ్ ఈ అడుగు వేశారా? లేక అనవసర వివాదానికి ప్రభుత్వం స్వయంగా తలుపులు తెరిచిందా? అన్నది రానున్న రోజుల్లో తేలనుంది. విజయ్ తీసుకునే ప్రతి నిర్ణయం ఇకపై కేవలం పరిపాలనా అంశంగా కాకుండా తమిళ అస్మిత వర్సెస్ జాతీయత అనే పెద్ద చర్చకు కేంద్రబిందువుగా మారే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

# ఇలాంటి ఆలోచనలు ఎట్లా వస్తాయ్ రా మీకు? మోసాలు చేసేందుకు హ్యాకర్ హైరింగ్.. కోట్లలో సంపాదన!




హ్యాకింగ్ చేయడానికి కూడా మనుషుల్ని హైరింగ్ చేసుకోవడం ఏంట్రా బాబు.. ఇదేం దందా. ఒకప్పుడు బిజినెస్ డేటా సేఫ్టీ, కంపెనీలు నడపడానికో ఐటీ నిపుణులను ఉద్యోగాల్లోకి తీసుకునేవారు. రోజులు మారాయి.. ఇప్పుడు ఆన్‌లైన్ పోకర్ సైట్లను హ్యాక్ చేసి, కోట్లు దోచుకోవడానికి ఏకంగా ఒక ఇంటర్నేషనల్ హ్యాకర్‌నే జీతానికి పెట్టుకున్నాడు ఒక బిజినెస్‌మెన్. వినడానికి సినిమా కథలా ఉన్నా.. బెంగళూరులో వెలుగుచూసిన ఈ రియల్ స్టోరీ ఇప్పుడు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. ప్రముఖ గ్యాంబ్లింగ్ వ్యాపారి సునీష్ హెగ్డే బెయిల్ పిటిషన్‌ను ఈడీ కోర్టులో తీవ్రంగా వ్యతిరేకించిన వేళ ఈ ఘరానా మోసాల చిట్టా మొత్తం బయటకు వచ్చింది. కర్ణాటకలో పలు గేమింగ్, పోకర్ క్లబ్‌లు నడిపే సునీష్ హెగ్డే.. దేశంలోనే మోస్ట్ వాంటెడ్ హ్యాకర్ అయిన శ్రీకృష్ణ అలియాస్ శ్రీకిని తన అక్రమ సంపాదన కోసం వాడుకున్నాడు. ప్రముఖ ఆన్‌లైన్ పోకర్ ప్లాట్‌ఫారమ్‌లైన 'పోకర్‌సెయింట్', 'పోకర్‌బాజీ' వంటి సైట్లను హ్యాక్ చేయాల్సిందిగా శ్రీకిని హెగ్డే బెదిరించి మరీ ఒప్పించాడు. ప్లాన్ ప్రకారం శ్రీకి ఆ సైట్లను హ్యాక్ చేసి సర్వర్లను స్తంభింపజేశాడు. ఆ తర్వాత సునీష్ హెగ్డే ఒక మధ్యవర్తిలా ఆయా సంస్థల నిర్వాహకులను కలిసి.. మీ సైట్లలో లోపాలున్నాయి, వాటిని సరిచేయాలంటే రూ.2 కోట్లు ఇచ్చుకోవాలి అంటూ బ్లాక్‌మెయిల్ చేసి 'ఎక్స్‌టార్షన్ గేమ్' ఆడాడు. ఈ విధంగా వసూలు చేసిన రూ.2 కోట్లలో కొంత భాగాన్ని డెల్టా కార్ప్ క్యాసినో చిప్స్ రూపంలో.. మరికొంత భాగాన్ని క్యాష్, క్రిప్టోకరెన్సీ రూపంలో తన అకౌంటెంట్ రాబిన్ ఖండేల్వాల్ ద్వారా హెగ్డే రీరూట్ చేశాడు. ఈ కేసు కేవలం ఒక హ్యాకింగ్ స్కామ్ మాత్రమే కాదు.. దీని వెనుక పెద్ద రాజకీయ, పోలీస్ నెట్‌వర్క్ కూడా ఉందని ఈడీ దర్యాప్తులో తేలింది. 2017 నుంచి 2020 మధ్య కాలంలో హ్యాకర్ శ్రీకి చుట్టూ బెంగళూరుకు చెందిన ప్రముఖ కాంగ్రెస్ ఎమ్మెల్యే ఎన్.ఎ. హారిస్ కుమారుడు మహ్మద్ నలపాడ్ వంటి రాజకీయ నేతలు తిరిగేవారు. 2017లో యునోకాయిన్ అనే క్రిప్టోకరెన్సీ ఎక్స్ఛేంజ్ నుంచి శ్రీకి కొట్టేసిన రూ.కోటి 14లక్షలు విలువైన బిట్‌కాయిన్ల ద్వారా మహ్మద్ నలపాడ్ లబ్ధి పొందాడని కర్ణాటక పోలీసులు ఏర్పాటు చేసిన సిట్ చార్జ్‌షీట్ దాఖలు చేసింది. ఈ స్టోరీలో ఊహించని ట్విస్ట్ ఏంటంటే.. నాడు దర్యాప్తు చేసిన పోలీసులే లంచాలకు కక్కుర్తి పడి కేసును పక్కదారి పట్టించటం. నవంబర్ 2020లో శ్రీకి మొదటిసారి అరెస్ట్ అయినప్పుడు.. అతని వద్ద రూ.850 కోట్ల విలువైన దాదాపు 4వేల బిట్‌కాయిన్లు ఉండేవని సాక్షులు చెప్తున్నారు. ఆ సమయంలో దర్యాప్తు చేసిన సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్ కి చెందిన నలుగురు పోలీస్ అధికారులు, ఒక సైబర్ నిపుణుడు ఈ హ్యాకర్ నుంచి భారీగా లంచాలు తీసుకున్నట్లు ఎస్ఐటీ గుర్తించింది. ప్రస్తుతం సునీష్ హెగ్డే, హ్యాకర్ శ్రీకి, అకౌంటెంట్ రాబిన్ ఖండేల్వాల్ జైల్లో ఊచలు లెక్కపెడుతుండగా.. వీరి మనీ లాండరింగ్ దందా ఇటు పోలీస్ శాఖను, అటు రాజకీయ వర్గాలను వణికిస్తోంది.

# ఆ బ్యాంక్ లైసెన్స్ క్యాన్సిల్ చేసిన RBI.. మరి కస్టమర్ల డబ్బు సంగతి ఏంటి..?




సంపాదించిన డబ్బులు జాగ్రత్తగా ఉంటాయని బ్యాంకులో దాచుకుంటే.. అసలు ఆ బ్యాంకే క్లోజ్ అయిపోయింది. ఆర్థిక పరిస్థితి దారుణంగా దిగజారడంతో.. కర్ణాటకకు చెందిన 'శ్రీ మహాలక్ష్మి అర్బన్ కో-ఆపరేటివ్ క్రెడిట్ బ్యాంక్' లైసెన్స్‌ను RBI రద్దు చేస్తూ సంచలన నిర్ణయం తీసుకుంది. దీంతో గురువారం నుండి ఈ బ్యాంకులో ఎలాంటి డిపాజిట్లు తీసుకోవడం గానీ, పాత డబ్బులు తిరిగి చెల్లించడం గానీ పూర్తిగా బంద్ అయిపోయాయి. దీంతో ఈ బ్యాంకులో డబ్బులు దాచుకున్న వేల మంది అయోమయంలో పడ్డారు. అసలు ఆర్‌బీఐ ఇంత పెద్ద నిర్ణయం ఎందుకు తీసుకుందంటే.. ఈ శ్రీ మహాలక్ష్మి బ్యాంకు దగ్గర కస్టమర్లకు తిరిగి చెల్లించడానికి సరిపడా డబ్బు లేదు. భవిష్యత్తులో లాభాలు వచ్చే అవకాశాలు అస్సలు కనిపించడం లేదట. పైగా బ్యాంకింగ్ నియంత్రణ చట్టం-1949 లోని రూల్స్ పాటించకుండా ఈ బ్యాంకు తుంగలో తొక్కిందని ఆర్‌బీఐ తేల్చేసింది. ఇలాంటి బ్యాంకును ఇంకా నడవనిస్తే.. ఉన్న డబ్బులు కాస్తా ఆవిరైపోయి డిపాజిటర్లు రోడ్డున పడతారని భావించిన రిజర్వు బ్యాంక్ వెంటనే కర్ణాటక సహకార సంఘాల రిజిస్ట్రార్‌ను కలిసి.. బ్యాంకును పూర్తిగా మూసివేసి, లిక్విడేటర్‌ను నియమించాలని ఆదేశించింది. అయితే ఈ వార్త వినగానే సదరు బ్యాంకులో అకౌంట్లు ఉన్న కస్టమర్ల గుండెల్లో రైళ్లు పరిగెత్తాయి. కానీ వారికి ఆర్‌బీఐ ఒక బిగ్ రిలీఫ్ ఇచ్చింది. ఈ బ్యాంకు మునిగిపోయినా.. దాదాపు 97.9 శాతం మంది డిపాజిటర్లకు తమ సొమ్ము మొత్తం నయా పైసాతో సహా తిరిగి వచ్చేస్తుంది. ఎందుకంటే.. 'డిపాజిట్ ఇన్సూరెన్స్ అండ్ క్రెడిట్ గ్యారెంటీ కార్పొరేషన్' ఇన్సూరెన్స్ రూల్స్ ప్రకారం వీరికి పూర్తి క్లెయిమ్ లభిస్తుంది. కాబట్టి 97 శాతం మంది ఖాతాదారులకు ఎలాంటి టెన్షన్ అక్కర్లేదు.

కర్ణాటకలోని గోకాక్‌లో ఉన్న ఈ బ్యాంకు స్టోరీ ప్రస్తుతానికి ముగిసింది. ఎంత కో-ఆపరేటివ్ బ్యాంకైనా సరే.. ఆర్‌బీఐ రూల్స్ బ్రేక్ చేస్తే తాట తీస్తాం అని సెంట్రల్ బ్యాంక్ మరోసారి నిరూపించింది. అందుకే బాస్.. బ్యాంకుల్లో డబ్బులు దాచుకునేటప్పుడు ఆ బ్యాంక్ ట్రాక్ రికార్డ్ ఏంటో ఒక్కసారి చెక్ చేసుకోవడం బెటర్.

# ఏటీఎం పిన్ వెనుక ఇంత కథ ఉందా..! ప్రపంచాన్ని మార్చిన ఐడియా.. అస్సలు నమ్మలేరు!




మనం ఏటీఎం నుండి డబ్బులు తీయాలంటే నాలుగు అంకెల పిన్ నంబర్ ఎంత ముఖ్యమో అందరికీ తెలిసిందే. ఆ పిన్ లేకపోతే రూపాయి కూడా బయటకు రాదు. పైగా పదేపదే తప్పు పిన్ కొడితే కార్డు బ్లాక్ అయిపోతుంది. మన బ్యాంకు అకౌంట్‌లో ఉన్న డబ్బుకు ఈ నాలుగు అంకెల పిన్నే పెద్ద రక్షణ.అయితే, అసలు ఈ ఏటీఎం పిన్ వ్యవస్థను కనిపెట్టింది ఎవరో.. దాన్ని కనిపెట్టినందుకు అతనికి దక్కిన బహుమతి ఎంతో తెలిస్తే మీరు ఆశ్చర్యపోతారు... దీని వెనుక ఒక వింతైన, ఆసక్తికరమైన కథ ఏంటంటే...

**కనిపెట్టింది ఒక స్కాటిష్ ఇంజనీర్**

ఈ రోజు ప్రపంచవ్యాప్తంగా బ్యాంకులు వాడుతున్న ఈ పిన్ (గా×చీ) సెక్యూరిటీ సిస్టమ్‌ను జేమ్స్ గుడ్‌ఫెలో అనే స్కాటిష్ ఇంజనీర్ 1966లో కనిపెట్టారు. ఆ సమయంలో ఆయన బ్రిటన్‌లోని ఒక ఇంజనీరింగ్ కంపెనీలో పని చేస్తూ, బ్యాంకుల కోసం క్యాష్ మెషీన్స్ తయారు చేసే ప్రాజెక్ట్‌లో ఉన్నారు.

**కేవలం 10 పౌండ్లు మాత్రమే!**

కార్డును మిషన్‌లో పెట్టి, ఒక సీక్రెట్ పిన్ నంబర్ నొక్కడం ద్వారా.. డబ్బులు తీసే ఆ వ్యక్తి నిజమైన కస్టమరా కాదా అని కనిపెట్టే అద్భుతమైన టెక్నాలజీని జేమ్స్ గుడ్‌ఫెలో సృష్టించారు.

ప్రపంచ బ్యాంకింగ్ రంగాన్నే మార్చేయబోయే ఇంత పెద్ద విప్లవాత్మక ఆవిష్కరణ చేసినందుకు ఆయన కంపెనీ మెచ్చుకుంది. కానీ, దానికి ప్రతిఫలంగా అతనికి ఇచ్చిన బోనస్ ఎంతో తెలుసా ? కేవలం 10 పౌండ్లు మాత్రమే అంటే మన రూపాయల్లో చూస్తే 1000 పైగా ఉంటుంది. నేడు లక్షల కోట్ల బిజినెస్‌ను కాపాడుతున్న ఐడియాకు అప్పట్లో అతనికి దక్కిన పారితోషికం అంతే.

**ఏటీఎం ప్రయాణం సాగిందిలా..**

జేమ్స్ గుడ్‌ఫెలో ఈ పిన్ టెక్నాలజీని కనిపెట్టిన ఏడాదికే.. అంటే 1967లో బ్రిటన్ రాజధాని లండన్‌లో ప్రపంచంలోనే మొట్టమొదటి ఏటీఎం మిషన్‌ను ఏర్పాటు చేశారు. ఆ తర్వాత ఈ టెక్నాలజీ ప్రపంచమంతటా వేగంగా విస్తరించింది. 1973 జూన్ 4న అమెరికాలో ఈ ఏటీఎం వ్యవస్థకు సంబంధించిన అధికారిక పేటెంట్ లభించింది. అలా మొదలైన ఈ 4 అంకెల పిన్ ప్రయాణం.. ఈ రోజు మన జేబులోని ఏటీఎం కార్డు వరకు వచ్చి చేరింది.

# మోడీ సర్కార్ దెబ్బకు 65 శాతం తగ్గిన గోల్డ్ దిగుమతులు.. ఆందోళనలో చిన్న వ్యాపారులు



దేశంలో పసిడి ప్రేమికులకు, బులియన్ మార్కెట్‌కు గట్టి షాక్ తగిలింది. భారతదేశంలోకి వచ్చే బంగారానికి కేంద్ర ప్రభుత్వం గట్టిగా బ్రేకులు వేసింది. గతంలో నెలకు ఏకంగా 75 నుంచి 100 మెట్రిక్ టన్నుల వరకు ఉన్న గోల్డ్ ఇంపోర్ట్స్.. ఇప్పుడు ఏకంగా 25 నుంచి 30 మెట్రిక్ టన్నులకు పడిపోయాయి. అంటే దిగుమతులు దాదాపు మూడో వంతు తగ్గిపోయాయన్నమాట. బంగారంపై ఇంపోర్ట్ డ్యూటీని 15 శాతానికి పెంచడమే దీనికి ప్రధాన కారణమని ప్రభుత్వ సీనియర్ వర్గాలు చెబుతున్నాయి.

**బ్యాంకులకు నోటిఫికేషన్ కట్..**

ఇంతటితో ఆగకుండా.. కేంద్ర కస్టమ్స్ శాఖ ఇంకో కీలక నిర్ణయం తీసుకుంది. ఏప్రిల్ 1, 2026 నుంచి బంగారం దిగుమతి చేసుకునే అధికారిక సంస్థల జాబితాలో బ్యాంకులను చేర్చుతూ ఎలాంటి కొత్త నోటిఫికేషన్ జారీ చేయలేదు. దీనివల్ల దేశంలోకి విదేశీ బంగారం తెచ్చే పవర్ఫుల్ రైట్స్ ప్రస్తుతం కేవలం వీమీజతో పాటు మరో రెండు ప్రభుత్వ ఏజెన్సీలకు మాత్రమే పరిమితం అయ్యింది. బ్యాంకులు రంగం నుంచి తాత్కాలికంగా అవుట్ అవ్వడంతో అఫీషియల్ ఛానల్స్ ద్వారా బంగారం రాక బాగా తగ్గిపోయింది.

**పాత బంగారం రీసైక్లింగ్‌కు పెరిగిన డిమాండ్**

విదేశాల నుంచి కొత్త బంగారం రావడం తగ్గడంతో, డొమెస్టిక్ మార్కెట్లో సరికొత్త ట్రెండ్ మొదలైంది.

మార్కెట్లో రేట్లు భారీగా పెరగడం, కొత్త స్టాక్ లేకపోవడంతో జనాలు తమ ఇళ్లల్లో ఉన్న పాత నగలను మార్చుకోవడం పెంచేశారు. ప్రభుత్వ పాలసీ తాము అనుకున్నట్టే పనిచేస్తోందని.. విదేశీ కరెన్సీ వృథా కాకుండా ఇంపోర్ట్స్ తగ్గాయి.. అదే సమయంలో పాత బంగారం రీసైక్లింగ్ మార్కెట్ ఊపందుకుందని ఓ ప్రభుత్వ ఉన్నతాధికారి స్పష్టం చేశారు. కామర్స్ మినిస్ట్రీ డేటా ప్రకారం ఏప్రిల్‌లో 5.63 బిలియన్ డాలర్లుగా ఉన్న గోల్డ్ ఇంపోర్ట్స్.. మే నాటికి 3.42 బిలియన్ డాలర్లకు పడిపోయాయి.

**బులియన్ వ్యాపారుల గుండెల్లో గుబులు..**

కేంద్ర ప్రభుత్వ కఠిన నిర్ణయంతో బంగారం దిగుమతులు పడిపోవటంపై బులియన్ వ్యాపారులు, జ్యువెలరీ అసోసియేషన్ ప్రతినిధులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంపోర్ట్ డ్యూటీ 15 శాతానికి పెరగడం, బ్యాంకులకు అనుమతులు నిలిచిపోవడంతో మార్కెట్లో స్టాక్ లభ్యత దారుణంగా పడిపోయిందని అంటున్నారు. పెళ్లిళ్ల సీజన్ ఉన్నప్పటికీ కస్టమర్లు భారీగా కొనుగోళ్లు చేయడానికి వెనుకాడుతున్నారు. లీగల్ ఛానల్స్ ద్వారా బంగారం రావడం కష్టమైతే.. స్మగ్లింగ్ పెరిగే ప్రమాదం ఉంది. ప్రభుత్వం వెంటనే బ్యాంకులకు దిగుమతి అనుమతులు ఇచ్చి.. డ్యూటీ తగ్గించకపోతే జ్యువెలరీ ఇండస్ట్రీ తీవ్ర సంక్షోభంలో పడుతుందని చిన్న వ్యాపారులు వాపోతున్నారు.

# ఫోన్‌పే యూజర్లకు షాక్: వాలెట్ వాడట్లేదా? అయితే రూ.100 ఫైన్ కట్టాల్సిందే!




డిజిటల్ పేమెంట్స్ అనగానే మన దేశంలో మెజారిటీ జనాలకు గుర్తొచ్చే పేరు 'ఫోన్‌పే'. టీ కొట్టు దగ్గర నుంచి పెద్ద పెద్ద షాపింగ్ మాల్స్ వరకు అంతా స్కాన్ చేసి పేమెంట్స్ చేస్తూనే ఉంటాం. అయితే ఇప్పుడు ఫోన్‌పే తన యూజర్లకు ఒక షాకింగ్ న్యూస్ చెప్పింది. మీ ఫోన్‌పే అకౌంట్‌లో వాలెట్ ఫీచర్ ఉండి, దాన్ని మీరు పట్టించుకోకుండా వదిలేస్తే.. మీ అకౌంట్ నుంచి పైసలు కట్ అవ్వడం ఖాయం. అవును ఇనాక్టివ్ వాలెట్లపై మెయింటెనెన్స్ ఛార్జీలు విధిస్తున్నట్లు కంపెనీ అలర్ట్ మెసేజ్ పంపడంతో సోషల్ మీడియాలో నెటిజన్లు ఒక్కసారిగా అగ్గిమీద గుగ్గిలమవుతున్నారు.

అసలు మ్యాటర్ ఏంటంటే.. ఫోన్ పే యూజర్ వరుసగా 365 రోజుల పాటు వాలెట్‌ను ఒక్కసారి కూడా వాడకపోతే.. దాన్ని 'ఇనాక్టివ్ వాలెట్' కేటగిరీ కింద మారుస్తారు. అలా మారిన తర్వాత సదరు వాలెట్ మెయింటెనెన్స్ ఫీజు కింద ప్రతి మూడు నెలలకు రూ.100 చొప్పున వాలెట్ బ్యాలెన్స్ నుండి కట్ చేసుకుంటారు. ఈ బాదుడు కేవలం మీ వాలెట్‌లో డబ్బులు ఉంటేనే జరుగుతుంది. ఒకవేళ వాలెట్ ఖాళీగా ఉంటే మాత్రం ఎలాంటి మైనస్ బ్యాలెన్స్ పడదు. ఈ రూల్ పాతదే అయినప్పటికీ.. కంపెనీ ఇప్పుడు నోటిఫికేషన్లు పంపడంతో జనాలు అలెర్ట్ అయ్యారు.ప్రముఖ టెక్ టిప్‌స్టర్ అభిషేక్ యాదవ్ ఎక్స్ అకౌంట్లో తనకు వచ్చిన స్క్రీన్‌షాట్‌ను షేర్ చేస్తూ.. 'సీరియస్‌గా, ఏంటిది ఫోన్‌పే?' అంటూ ఫైర్ అయ్యారు. చాలా మంది అసలు వాలెట్ వాడరని, అందరూ డైరెక్ట్ బ్యాంక్ అకౌంట్ లింక్ చేసి యూపీఐ ట్రాన్సాక్షన్లు చేస్తారని గుర్తుచేశారు. పైగా ఇప్పుడు ఆ వాలెట్‌ను పర్మనెంట్‌గా క్లోజ్ చేద్దామంటే.. 'ఫుల్ కేవైసీ' పూర్తి చేయాలంటూ కండిషన్లు పెట్టడంపై యూజర్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అయితే ఇక్కడ ఒక గుడ్ న్యూస్ ఏంటంటే.. ఈ పెనాల్టీ కేవలం 'ఫోన్‌పే వాలెట్' బ్యాలెన్స్‌కు మాత్రమే వర్తిస్తుంది. మీ బ్యాంక్ అకౌంట్ నుండి జరిగే రెగ్యులర్ యూపీఐ లావాదేవీలకు దీనికి ఎలాంటి సంబంధం లేదు. కాబట్టి మీ యూపీఐ అకౌంట్లు సేఫ్. దీంతో చాలా మంది ఎక్స్ యూజర్లు వాటెల్ వాడే వ్యక్తులు ఏమైనా అందులో బ్యాలెన్స్ ఉంచితే వెంటనే దానిని ఖాళీ చేసుకోండి అంటూ సలహాలు ఇస్తున్నారు. మొత్తం మీద ఫ్రీ అనుకున్న సర్వీసులకు ఇలా ఛార్జీలు బాదడంపై డిజిటల్ ఇండియా జనాలు గట్టిగానే రియాక్ట్ అవుతున్నారు.

# రూ.304కోట్ల ప్రాపర్టీని రూ.12వందల 60 కోట్లకు అమ్మిన ZEE టీవీ ఓనర్.. ఢిల్లీలో రికార్డ్

రియల్ ఎస్టేట్ అంటే ఏదో ప్లాట్లు కొని, నాలుగేళ్ల తర్వాత డబుల్ రేటుకు అమ్ముకోవడం అనుకుంటే పొరపాటే. అసలైన పవర్ గేమ్ ఎలా ఉంటుందో ఎస్సెల్ గ్రూప్ అదేనండి జీ మీడియా మాతృసంస్థ ఛైర్మన్ సుభాష్ చంద్ర చేసి చూపించారు. దేశ రాజధాని ఢిల్లీలో లగ్జరీకి కేరాఫ్ అడ్రస్ అయిన 'ల్యుటెన్స్ జోన్'లో ఉన్న తన లగ్జరీ బంగళాను ఏకంగా రూ.1,260 కోట్లకు అమ్మేసి, దేశవ్యాప్తంగా రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో షేక్ క్రియేట్ చేశారు. దీంతో ఇది ఇటీవల కాలంలో జరిగిన అత్యంత ఖరీదైన ప్రాపర్టీ డీల్స్‌లో ఇది ఒకటిగా నిలిచింది.

**పదేళ్లలో 4 రెట్లు లాభం..**

ట్విస్ట్ ఏంటంటే.. సుభాష్ చంద్ర ఈ బంగళాను 2015లో కేవలం రూ.304 కోట్లకు కొన్నారు. కానీ సరిగ్గా 10 ఏళ్లు తిరిగేసరికి దాని వాల్యూ 4 రెట్లు పెరిగి రూ.1,260 కోట్లకు చేరింది. అంటే దాదాపు రూ.950 కోట్లు లాభం అన్నమాట. ఇలాంటి రిటర్న్స్ చూస్తే ఎవరికైనా మైండ్ బ్లాక్ అవ్వాల్సిందేగా మరి. కన్నాట్ ప్లేస్, ఇండియా గేట్‌కు అత్యంత సమీపంలో.. భగవాన్ దాస్ రోడ్‌లో దాదాపు 3 ఎకరాల విస్తీర్ణంలో ఈ భారీ బంగళా విస్తరించి ఉంది. అయితే దీన్ని కొనుగోలు చేసిన ఆ లక్కీ ఢిల్లీ బిజినెస్ ఫ్యామిలీ ఎవరనేది మాత్రం ప్రస్తుతానికి సస్పెన్స్. ఈ డీల్ డిసెంబర్ మొదటి వారానికల్లా పూర్తిగా క్లోజ్ కానుందట.

**ల్యుటెన్స్ జోన్ అంటే ఆషామాషీ కాదు..**

ఢిల్లీ గుండెకాయ లాంటి ఈ జోన్‌లో కేవలం 3వేల బంగళాలు మాత్రమే ఉంటాయి. ఇక్కడ ఇల్లు ఉందంటేనే అదొక పవర్, స్టేటస్ సింబల్. సుప్రీంకోర్టు జడ్జీలు, సీనియర్ ప్రభుత్వ అధికారులు, ఇంటర్నేషనల్ డిప్లొమాట్స్, దేశంలోని టాప్ మోస్ట్ ఇండస్ట్రియలిస్టులు మాత్రమే ఇక్కడ నివసిస్తారు. ఇక్కడ కొత్తగా కన్‌స్ట్రక్షన్స్ చేయడానికి కఠినమైన రూల్స్ ఉంటాయి. ల్యాండ్ అస్సలు దొరకదు కాబట్టే.. వీటికి ఈ రేంజ్ డిమాండ్.

కోవిడ్ తర్వాత ఢిల్లీలోని ల్యుటెన్స్ జోన్‌తో పాటు గుర్గావ్‌లోని 'గోల్ఫ్ కోర్స్ రోడ్' లగ్జరీ ప్రాపర్టీస్ సేల్స్‌లో సరికొత్త రికార్డులు సృష్టిస్తున్నాయి. ముఖ్యంగా గుర్గావ్‌లోని ఖాఖీ 'ది కామెలియాస్', 'ది డహ్లియాస్' లాంటి అల్ట్రా-లగ్జరీ ప్రాజెక్టులలో అపార్ట్‌మెంట్లు కూడా ఇప్పుడు కోట్ల రూపాయల ప్రీమియం ధరలకు అమ్ముడవుతూ రియల్ ఎస్టేట్ క్రేజ్‌ను నెక్స్ట్ లెవెల్‌కు తీసుకెళ్తున్నాయి. మొత్తానికి సుభాష్ చంద్ర బంగళా సేల్ మాత్రం 'రియల్' ఎస్టేట్ హిస్టరీలోనే ఒక గోల్డెన్ చాప్టర్ అని చెప్పుకోవచ్చు అంటున్నారు నిపుణులు.

# ఈ ఐదు హ్యాబిట్స్ మీకు ఉంటే..
# మంచి ఆరోగ్యం సొంతం

**నిత్యం వ్యాయామాలు చేయాల్సిందే**

**పోషకాహారం తీసుకోవాలి**

**ప్రతి రోజూ 7-9 గంటల పాటు నాణ్యమైన నిద్ర**

**ఒత్తిడి ఎక్కువ కాకుండా చర్యలు తీసుకోవాలి**



ఆరోగ్యంగా ఉండాలని కోరుకోని వారు ఉండరు. కానీ, మిగతా విషయాల పట్ల ఉన్న శ్రద్ధ ఆరోగ్యం విషయంలో చూపించరు. దీంతో క్రమంగా ఆరోగ్యానికి నష్టం జరుగుతుంటుంది. నడి వయసుకే ఎన్నో ఆరోగ్య సమస్యలు మొదలవుతుంటాయి. సాధారణంగా 60 ఏళ్లు దాటిన వారికి వృద్ధాప్యంలో అనారోగ్య సమస్యలు రావడం సహజం. కానీ 30-40 ఏళ్లకే ఆరోగ్యం విషయంలో సమస్యలు రావడం అంటే కచ్చితంగా శ్రద్ధ తీసుకోవాల్సిందే. 30-40 ఏళ్లకే వృద్ధాప్యపు ఛాయలు రాకూడదని కోరుకుంటే, 50 ఏళ్లు దాటినా నడి వయసు వారి మాదిరే యవ్వనంగా కనిపించాలంటే అదేమీ పెద్ద కష్టమైన విషయం కాదు. కాకపోతే కొన్ని చర్యలను పాటించాల్సి ఉంటుంది.
వృద్ధాప్యంలో కణాలు దెబ్బతినడం, క్షీణించడం మొదలవుతుంది. కణాల మధ్య మెరుగైన కమ్యూనికేషన్ ప్రక్రియ బలహీనపడుతుంది. కొన్ని చర్యల ద్వారా ఈ ప్రక్రియలను నిలువరించామంటే యవ్వనంగా ఉండొచ్చు.
రోజువారీ వ్యాయామాలు జీవన విధానంలో భాగం చేసుకోవాలి. వారంలో కనీసం ఐదు రోజుల పాటు, రోజుకు 30-45 నిమిషాల పాటు చేయాల్సి ఉంటుంది. వాకింగ్, జాగింగ్, రన్నింగ్, స్విమ్మింగ్, ఏరోబిక్ వ్యాయామాలు, జిమ్ లో కసరత్తులు ఏవైనా కావచ్చు. ముఖ్యంగా గుండె బలపడడానికి వ్యాయామాలు ఉంటాయి. వాటిని కూడా చేయాలి.
ఆహారానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలి. ఏదో ఒకటి లేదంటే రుచికరమైనది తినేశామంటే కుదరదు. తీసుకునే ఆహారం ఏదైనా కానీ, అందులో పోషకాలు ఉండాలి. ముడి ధాన్యాలు, తృణ ధాన్యాలు, కూరగాయలు, ఆకుపచ్చని కూరగాయలు తీసుకోవాలి. అదే సమయంలో చక్కెరలు, ప్రాసెస్డ్ ఫుడ్స్, స్నాక్స్ తీసుకోకూడదు.
ఇక నాణ్యమైన నిద్ర చాలా అవసరం. రోజులో 7 నుంచి 9 గంటల వరకు నిద్ర పోవచ్చు. కాకపోతే ఈ నిద్ర కూడా కలత నిద్ర అవ్వకూడదు. అవాంతరాల్లేని నాణ్యమైన, గాఢనిద్ర అవ్వాలి. ఇందు కోసం నిద్రకు గంట ముందు నుంచి ఎలక్ట్రానిక్ ఉపకరణాలను వినియోగించకూడదు. పడకగదిలో వెలుతురు లేకుండా చూసుకోవాలి. నిద్రకు, రాత్రి భోజనానికి మధ్య 2 గంటల విరామం ఉండాలి.
ఒత్తిడి లేకుండా చూసుకోవడం కూడా ఆరోగ్యం పరంగా అత్యంత అవసరం. ఒత్తిడి ఎక్కువైపోతే కణాలకు నష్టం జరుగుతుంది.
మధుమేహం, బీపీ, కేన్సర్, గుండె జబ్బుల వంటి సమస్యలు స్ట్రెస్ వల్ల వస్తాయని ఎన్నో అధ్యయనాల్లో వెల్లడైంది.
ఆదుర్దాగా కాకుండా కాస్త నిదానంగా పనులు చేసుకోవడం, సమయానికి ముందుగానే బయల్దేరడం, మెడిటేషన్, యోగాసనాలు స్ట్రెస్ నుంచి విముక్తి కల్పిస్తాయి.
ఇక సామాజిక సంబంధాలు కూడా మన ఆరోగ్యం విషయంలో ప్రభావం చూపిస్తాయి. మంచి స్నేహితులతో, కుటుంబ సభ్యులతో తగినంత సమయం గడపాలి.


# కిడ్నీల ఆరోగ్యానికి మంచి నీళ్ల సాయం... అంతా ఇంతా కాదు!

**జీవరాశి మనుగడకు కీలకంగా ఉన్న మంచినీరు**

**శరీరంలో నీటి శాతం తగ్గకుండా చూసుకోవాలంటున్న నిపుణులు**

**తగినంత నీరు తాగకపోతే యూరిక్ యాసిడ్ పేరుకుపోయే ప్రమాదం**

**కిడ్నీల్లో రాళ్లు, గౌట్ వంటి సమస్యలకు ప్రధాన కారణం యూరిక్ యాసిడ్**



భూమిపై జీవానికి ప్రాణాధారం నీరు. మనిషి ఆరోగ్యాన్ని పరిరక్షించడంలో కీలకపాత్ర నీటిదే. ముఖ్యంగా కిడ్నీల పనితీరుకు తోడ్పాటు అందిస్తూ మంచి నీరు అత్యంత ప్రముఖ పాత్ర పోషిస్తుంది. అయితే, నీళ్లు కిడ్నీల ఆరోగ్యాన్ని ఎలా కాపాడతాయో చూద్దాం!
మానవ దేహంలోని వ్యర్థాలు మలమూత్రాల రూపంలో విసర్జితమవుతాయని తెలిసిందే. మూత్రం ద్వారా యూరిక్ యాసిడ్ వంటి ఘాటైన పదార్థాలు బయటికి పోతాయి. కొన్నిరకాల పదార్థాలు తిన్నప్పుడు, కూల్ డ్రింక్స్, మద్యం సేవించినప్పుడు శరీరంలో యూరిక్ యాసిడ్ అధిక మొత్తంలో పేరుకుపోతుంది. దీన్ని బయటికి పంపించే పని కిడ్నీలదే.
అయితే నీరు తక్కువగా తాగడం వల్ల శరీరంలో పెరిగిపోయిన యూరిక్ యాసిడ్ నిల్వలను కిడ్నీలు పూర్తిగా విసర్జించలేవు. దాంతో కిడ్నీల్లో రాళ్లు, గౌట్ వంటి కీళ్ల సమస్యలు ఉత్పన్నమవుతాయి. ఇలాంటి సమస్యలతో వైద్యుల వద్దకు వెళితే, వారు వీలైనంత అధికంగా మంచినీళ్లు తాగమనే చెబుతారు. మంచినీళ్లు తాగడం వల్ల రక్తంలోని యూరిక్ యాసిడ్ పల్చబడుతుంది. అప్పుడది కిడ్నీల ద్వారా వడపోతలకు గురై వ్యర్థాలు మూత్రం ద్వారా వెలుపలికి వచ్చేస్తాయి. నీళ్లు సరిగా తాగకపోతే, మూత్రం మరింత గాఢతను సంతరించుకుంటుంది . కిడ్నీలు యూరిక్ యాసిడ్ ను వడపోయడంలో సమర్థవంతంగా పనిచేయలేవు. అలాంటప్పుడు యూరిక్ యాసిడ్ శరీరంలో అధిక మొత్తంలో పోగుపడుతుంది. అది ఘనీభవించి రాళ్లుగా మారుతుంది. ఇతర అనారోగ్య సమస్యలు కూడా మొదలవుతాయి.
శరీరంలో యూరిక్ యాసిడ్ అధికంగా ఉత్పత్తికావడానికి పలు కారణాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. ఒబేసిటీతో బాధపడుతున్న వారిలో యూరిక్ యాసిడ్ స్థాయులు అధికంగా ఉంటాయని తెలిపారు. మంచినీళు ఎక్కువగా తాగకపోవడం వల్ల ఆరోగ్యకరమైన శరీర బరువును కొనసాగించలేరని, ఇలాంటివాళ్లు బరువు పెరగడమో, ఊబకాయులుగా మారడమో జరుగుతుందని,
దాంతో యూరిక్ యాసిడ్ తో కలిగే సమస్యల బారినపడుతుంటారని నిపుణులు వివరించారు. లేకపోతే కిడ్నీలపై విపరీతమైన భారం పడుతుందని, క్రమంగా ఇది కిడ్నీల వైఫల్యానికి దారితీస్తుందని వివరించారు. ఇలాంటి సమస్యల బారినపడకూడదనుకుంటే అందుకు నీళ్లే ఔషధం అని స్పష్టం చేశారు. నీళ్లు కిడ్నీల పనితీరునే కాకుండా, విషపదార్థాల ఏరివేతలో సహాయపడే కాలేయానికి తోడ్పాటునందిస్తాయని తెలిపారు. శరీరంలో హానికర పదార్థాల వడపోతకు సహకరించే ఏ అవయవానికైనా మంచి నీళ్లే మంచి మిత్రుడు అనొచ్చని పేర్కొన్నారు.

## ఈ ఆరు విషయాల్లో నవ్వుతూ సరదాగా జోకేస్తున్నార్లే అని లైట్ తీస్కుంటే మీ ఫ్యామిలీషిప్ నట్టేట మునిగినట్టే !



కుటుంబ సభ్యులు సరదాగా మాట్లాడుకోవడం, జోకులేసుకోవడం సర్వ సాధారణం. ఒక ఫ్యామిలీ అనేది అన్యోన్యంగా ఉండాలంటే ఈ మాత్రం స్నేహపూర్వక వాతావరణం ఉండాలి. అయితే.. కొన్నిసార్లు ఇలా సరదాగా మాట్లాడే మాటల్లో.. బయటకు చెప్పుకోలేని వాళ్ల బాధలు, సమస్యలు కూడా కలిపి చెప్తారని చాలా మంది గ్రహించడం లేదు.
అందువల్ల.. ఫ్యామిలీలో కొందరి బాధలు ఎప్పటికీ తీరని వెతలుగానే మిగిలిపోతున్నాయి. ఇలాంటి విషయాలను పెద్దగా పట్టించుకోరు గానీ రోజులు గడిచే కొద్దీ కుటుంబ సభ్యుల మధ్య ఇలాంటి నిర్లక్ష్యం గొడవలకు దారితీస్తుంది. అందువల్ల.. కుటుంబ సభ్యుల మధ్య బంధాలు, అనుబంధాలు చెడకుండా ఉండాలంటే.. ఈ ఆరు విషయాలను ఎప్పుడూ లైట్ తీసుకోవద్దు. అవేంటో చూద్దాం..
1. కుటుంబ సభ్యులలో ఎవరైనా.. ముఖ్యంగా ఇంటి ఖర్చులను చూసుకునే వారు.. పలుమార్లు "నా దగ్గర రూపాయి మిగలలేదు" లేదా "మనం దివాళా తీసినట్టే" అని సరదాగా అంటే.. ఆ కామెంట్స్?ను తోటి కుటుంబ సభ్యులు జోక్?గా తీసుకోవద్దు. ఆర్థిక సమస్యలను, అప్పులను గురించి కుటుంబ సభ్యులందరితో అందరూ నేరుగా చెప్పుకోలేరు. ఇలా ఫ్యామిలీ మెంబర్స్ అంతా సరదాగా సమయం గడుపుతున్న సమయంలోనే సరదా సంభాషణలో కుటుంబ సభ్యులకు పరోక్షంగా కుటుంబ ఆర్థిక పరిస్థితిని వ్యక్తపరుస్తారు. ఇలాంటి వ్యాఖ్యలను సీరియస్ గా తీసుకోండి. వృథా ఖర్చులను, దుబారాలను, షికార్లను తగ్గించుకుని ఇంటి ఆర్థిక పరిస్థితిని అప్పటి నుంచైనా బడ్జెట్ ప్రకారం ఇబ్బంది లేకుండా ఉండేలా ప్లాన్ చేసుకోండి.
2. "ఈ మధ్య నా ఒంట్లో సత్తువ లేకుండా పోతుంది.. ఓపిక ఉండటం లేదు.. శరీరం సహకరించడం లేదు" లేదా "నా నడుము విరిగింది" లాంటి మాటలను కుటుంబంలో ఎవరైనా అంటే.. వయసు మీద పడుతున్న సమయంలో ఉండే లక్షణాలుగా లేదా రోజంతా అలసిపోవడం వల్ల ఉండే సమస్యలుగా కొట్టిపారేస్తుంటారు. విశ్రాంతి తీసుకుంటే అంతా సెట్ అయిపోతుందని భావిస్తుంటారు. కానీ.. ఫ్యామిలీలో ఎవరైనా ఈ మాటలను పదేపదే చెబుతుంటే.. వాళ్లు అనారోగ్యంతో బాధపడుతున్నట్లు అర్థం. తీవ్రమైన ఒత్తిడికి లోనవుతున్నారని ఇలా చెప్తున్నారని అర్థం చేసుకోవాలి. వారికి తగిన వైద్యం చేయించాలి. 3. "నీకు ఫోన్‌తో గడపడానికే టైం ఉంది.. నాతో కాసేపు కూడా సరదాగా గడిపేందుకు ఆసక్తి చూపించడం లేదు" అని మీ భాగస్వామి.. స్నేహితులు లేదా బంధువుల ముందు నవ్వుతూ అంటే మాత్రం మీ వైఖరి మార్చుకోవాలని సంకేతం ఇచ్చినట్లే. ఇది మామూలు జోక్ కాదు.. భాగస్వామి ఒంటరిగా ఫీల్ అవుతుందని చెప్పడానికి ఇలాంటి వ్యాఖ్యలు నిదర్శనం. ఉమ్మడి కుటుంబాలు అరుదుగా కనిపిస్తున్న ఈరోజుల్లో భార్యకు భర్త, భర్తకు భార్యనే తోడు. పిల్లలు ఇంట్లో ఉన్నా భాగస్వామితో సమయం గడపడం దాంపత్య బంధం బలహీనపడకుండా ఉండేందుకు ఎంతో ముఖ్యం. అందువల్ల.. వైవాహిక బంధంలో దూరం పెరగకుండా ఉండాలంటే ఇలాంటి మాటలను లైట్ తీసుకోవద్దు. భాగస్వామితో సమయం గడిపేందుకు ప్రయత్నించండి. ఒకవేళ బిజీలో ఉండి సమయం వెచ్చించలేని పరిస్థితి ఉంటే.. అర్థమయ్యేలా చెప్పండి. అప్పుడే దాంపత్య బంధం బీటలు వారకుండా ఉంటుంది. 4. ఇంట్లో వాళ్లు గతంలో మనం చేసిన తప్పులపై, పొరపాట్లపై నవ్వుతూనే సెటైర్లు పేల్చుతుంటారు. "వాడు ఆ ఉద్యోగాన్ని వదిలేయొద్దని చెప్తే వినలేదు", "ఆ సంబంధం వద్దనుకుని తప్పు చేశాడు" ఇలా.. ఇంట్లో వాళ్ళు గతంలో చేసిన తప్పులను లేదా పొరపాట్లను గుర్తుచేస్తూ సమయం.. సందర్భం వచ్చినప్పుడు ఎగతాళి చేస్తుంటారు. మొదట అది తమాషాలా అనిపించవచ్చు. కానీ అది విషయాన్ని టైం చూసుకుని పదేపదే గుర్తుచేస్తుంటే మాత్రం.. మనస్పర్థలు ఇంకా తొలగిపోలేదని అర్థం. ఈ అలవాటు.. కుటుంబ సభ్యుల మధ్య మనస్పర్థలను మరింత పెంచుతుంది. ఎందుకు ఉద్యోగాన్ని వదిలేశామో, ఎందుకు ఒక సంబంధం వస్తే నచ్చలేదని చెప్పామో అర్థం చేసుకునే విధంగా నచ్చజెప్పే ప్రయత్నం చేయాలి.
5. పిల్లలు ఈ మధ్య మొబైల్ ఫోన్లకు, టీవీకి బాగా అలవాటుపడ్డారు. కానీ.. కొన్ని సందర్భాల్లో పిల్లలు సరదాగా "నేను పనికిరానివాడిని" లేదా "నన్ను ఎవరూ ఇష్టపడరు" అని అంటుంటారు. ఈ మాటలను పొరపాటున కూడా నిర్లక్ష్యం చేయొద్దు. ఇవి లైట్ తీస్కుంటే.. పిల్లల మానసిక పరిస్థితిపై తీవ్ర ప్రభావం చూపుతుంది. పిల్లలు ఒంటరితనానికి అలవాటుపడతారు. తోటి పిల్లలతో గొడవలు పడే తత్వం పెరుగుతుంది. వాళ్లతో ప్రేమగా మాట్లాడండి. వారి మనసులో ఏముందో అర్థం చేసుకోండి.
6. కుటుంబంలోని వయసైపోయిన పెద్దవాళ్లు.. కొన్ని సార్లు "మా టైం అయిపోయింది" లేదా "ఇంట్లో మేము పనికిరాని వాళ్ళం" అని సరదాగా అంటే.. నవ్వి వదిలేయకండి. వారి గుండెల్లో లోతుగా ఉన్న ఒంటరితనం తాలూకూ మాటలుగా అర్థం చేసుకోండి. వయసు మీద పడిన సందర్భంలో.. ఇక తమకు విలువ ఇవ్వరని.. తమ ఇంపార్టెన్స్ తగ్గిపోయిందని పెద్దవాళ్లు బాధపడుతుంటారు. ఇలాంటి సమయాల్లో.. వారితో సమయం గడపండి. తగిన గౌరవం ఇవ్వండి. వయసైపోయాక కృష్ణా.. రామా అని ఒక మూలన కూర్చోక ప్రతీ విషయంలో ఎందుకు ఇన్వాల్వ్ అవుతున్నావని కసురుకోకండి.

# ఇషాన్ ప్రత్యేకత అదే.. ఇంగ్లాండ్ మాజీ స్పిన్నర్ స్వాన్ ప్రశంసలు

- ఆఫ్ఘన్‌పై రెండో వన్డేలో సెంచరీతో చెలరేగిన ఇషాన్ కిషన్
- 79 బంతుల్లో 125 పరుగులు.. 14 ఫోర్లు, 7 సిక్సర్లతో వీరవిహారం
- శుభ్‌మన్ గిల్‌తో కలిసి 224 పరుగుల భాగస్వామ్యం
- జట్టులో ఏ పాత్ర ఇచ్చినా పోషిస్తాడన్న గ్రేమ్ స్వాన్
- అసలు గ్యాప్ లేనట్లు ఆడాడని ప్రశంస
- బలహీనతను బలంగా మార్చుకున్నాడని వ్యాఖ్య




**హైదరాబాద్ పెన్ పవర్:** ఆఫ్ఘనిస్థాన్‌తో లక్నో వేదికగా జరిగిన రెండో వన్డేలో ఇషాన్ కిషన్ ఆడిన అద్భుత ఇన్నింగ్స్‌పై ఇంగ్లండ్ మాజీ స్పిన్నర్ గ్రేమ్ స్వాన్ ప్రశంసలు కురిపించాడు. జట్టులోకి పునరాగమనం చేసినా.. అసలు ఏమాత్రం గ్యాప్ లేదన్నట్లుగా ఆడిన తీరు తనను ఎంతగానో ఆకట్టుకుందని పేర్కొన్నాడు.
ఈ మ్యాచ్‌లో ఇషాన్ కేవలం 79 బంతుల్లోనే 125 పరుగులు చేసి భారత భారీ విజయానికి పునాది వేశాడు. అతడి ఇన్నింగ్స్‌లో 14 ఫోర్లు, 7 సిక్సర్లు ఉన్నాయి. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (154)తో కలిసి మూడో వికెట్‌కు 224 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి ఆఫ్ఘన్ బౌలర్లను పూర్తిగా ఒత్తిడిలోకి నెట్టాడు. జియోస్టార్‌తో మాట్లాడిన స్వాన్.. ఇషాన్ జట్టుకు అవసరమైన పాత్రను ఎలాంటి అభ్యంతరం లేకుండా పోషిస్తాడని చెప్పాడు. "అతడికి ఏ బాధ్యత అప్పగించినా అంగీకరిస్తాడు. తిరిగి జట్టులోకి వచ్చి ఇంత ప్రభావం చూపడం నిజంగా గొప్ప విషయం" అని వ్యాఖ్యానించాడు. ఇషాన్ ఇన్నింగ్స్ నిర్మించిన తీరు తనను మరింత ఆకట్టుకుందని స్వాన్ తెలిపాడు. తొలి అర్ధశతకాన్ని ఓపిగ్గా ఆడిన అతడు తర్వాత కేవలం 19 బంతుల్లోనే మరో 50 పరుగులు చేసి సెంచరీ పూర్తి చేయడం అసాధారణమని అన్నాడు. అయితే అవి నిర్లక్ష్యంగా కొట్టిన షాట్లు కాదని, బౌలర్లపై ఒత్తిడి పెంచుతూ సరైన బంతులను మాత్రమే బౌండరీలకు తరలించాడని వివరించాడు. తన బలహీనతలపై ఇషాన్ కష్టపడి పనిచేసి వాటినే బలంగా మార్చుకున్నాడని స్వాన్ ప్రశంసించాడు. అదే అతణ్ని ప్రత్యేక ఆటగాడిగా నిలబెడుతోందని పేర్కొన్నాడు.
ఇషాన్-గిల్ జోడీ చెలరేగడంతో భారత్ 402 పరుగుల భారీ స్కోరు సాధించిన విషయం తెలిసిందే. అనంతరం భారత బౌలర్లు ఆఫ్ఘనిస్థాన్‌ను 232 పరుగులకే ఆలౌట్ చేసి 170 పరుగుల తేడాతో విజయం సాధించారు. దీంతో మూడు వన్డేల సిరీస్‌ను భారత్ 2-0తో కైవసం చేసుకుంది.

# క్రిస్టియానో రొనాల్డోపై విమర్శలు... మూడేళ్ల క్రితమే కోహ్లీ ఏం చెప్పాడంటే..!





**హైదరాబాద్ పెన్ పవర్:** ఫిఫా ప్రపంచకప్ 2026లో పోర్చుగల్ ప్రయాణం నిరాశాజనకంగా ప్రారంభమైంది. డెమొక్రాటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగోతో జరిగిన తొలి మ్యాచ్‌ను డ్రాగా ముగించింది. ఈ మ్యాచ్ తర్వాత ఫుట్‌బాల్ చరిత్రలో అత్యుత్తమ ఆటగాళ్లలో ఒకడైన 41 ఏళ్ల క్రిస్టియానో రొనాల్డోపై విమర్శల వర్షం కురుస్తోంది. పోర్చుగల్ జట్టుకు నాయకత్వం వహిస్తున్న రొనాల్డో, తన స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేక నీరసంగా కనిపించాడు. అంతర్జాతీయంగా 143 గోల్స్ చేసి రికార్డు సృష్టించిన ఈ దిగ్గజం ఆటతీరుపై ఒక్క మ్యాచ్‌తోనే పండితులు, అభిమానులు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. అసలు అతడిని జట్టులోకి ఎందుకు ఎంపిక చేశారనే స్థాయికి చర్చ చేరింది. ఈ తీవ్రమైన విమర్శల నేపథ్యంలో భారత క్రికెట్ స్టార్ విరాట్ కోహ్లీ గతంలో రొనాల్డో గురించి చెప్పిన మాటలు ఇప్పుడు మళ్లీ ప్రాధాన్యం సంతరించుకున్నాయి. సరిగ్గా ఇలాంటి విమర్శలనే తన కెరీర్‌లో ఎదుర్కొన్న కోహ్లీ, రొనాల్డో విషయంలో ప్రపంచాన్ని హెచ్చరిస్తూ పలు సందర్భాల్లో తన అభిమానాన్ని, మద్దతును చాటుకున్నాడు. 2022లో ఖతార్ ప్రపంచకప్ నుంచి పోర్చుగల్ నిష్క్రమించినప్పుడు రొనాల్డో కన్నీటి పర్యంతమవ్వగా, కోహ్లీ స్ఫూర్తిదాయక సందేశాన్ని పోస్ట్ చేశాడు. "ఏ ట్రోఫీ లేదా టైటిల్ కూడా ఈ క్రీడకు మీరు చేసిన సేవను, ప్రపంచవ్యాప్తంగా క్రీడాభిమానులపై మీరు చూపిన ప్రభావాన్ని తగ్గించలేదు. ప్రజలు మిమ్మల్ని చూసినప్పుడు పొందే అనుభూతిని ఏ టైటిల్ వివరించలేదు. అది దేవుడిచ్చిన వరం. ప్రతిసారీ తన పూర్తిస్థాయిలో హృదయంతో ఆడే వ్యక్తికి ఇది నిజమైన ఆశీర్వాదం. క్రీడాకారులందరికీ మీరు నిజమైన స్ఫూర్తి. నా దృష్టిలో మీరే ఆల్ టైమ్ గ్రేటెస్ట్ ప్లేయర్" అని కోహ్లీ పేర్కొన్నాడు. అంతేగాక 2023లో రియాద్ ఆల్-స్టార్స్ తరఫున ఆడిన రొనాల్డో.. మెస్సీ, నెయ్‌మార్, ఎంబాపె వంటి స్టార్లు ఉన్న పీఎస్‌జీ జట్టుపై రెండు గోల్స్ చేశాడు. అప్పుడు కూడా కోహ్లీ స్పందిస్తూ.. "ఇప్పటికీ 38 ఏళ్ల వయసులో అత్యున్నత స్థాయిలో ఆడుతున్నాడు. ప్రతి వారం అటెన్షన్ కోసం అతడిని విమర్శించే నిపుణులు ఇప్పుడు మౌనంగా ఉన్నారు. ప్రపంచంలోని టాప్ క్లబ్‌లలో ఒకదానిపై ఇలాంటి ప్రదర్శన చేసిన తర్వాత కూడా మాట్లాడరేం. అతడు ముగిసిపోయాడన్నారు కదా?" అని విమర్శకులకు చురకలు అంటించాడు.
రొనాల్డో మాంచెస్టర్ యునైటెడ్, రియల్ మాడ్రిడ్ లేదా జువెంటస్‌లో ఉన్నప్పటి ఆటగాడు కాదనేది వాస్తవం. కానీ, 2025-26 సీజన్‌లో అల్-నసర్ తరఫున 30 మ్యాచ్‌లలో 28 గోల్స్ చేశాడనే విషయాన్ని విమర్శకులు విస్మరిస్తున్నారు. ప్రస్తుతం అతని సమస్య సామర్థ్యం కాదు, వేగవంతమైన యూరోపియన్ లీగ్‌లలో ఆడే సహచరులతో సరైన సమన్వయం లేకపోవడమే. రొనాల్డో, కోహ్లీ ఇద్దరూ తమ కెరీర్‌లో ఇలాంటి విమర్శలను ఎదుర్కొని, తమ ఆటతోనే సమాధానం చెప్పినవారే. కోహ్లీ ఎలాగైతే విమర్శలను తిప్పికొట్టి తన స్థానాన్ని పదిలం చేసుకున్నాడో, రొనాల్డో కూడా తనపై వచ్చే ప్రతి విమర్శను ఒక సవాలుగా తీసుకుని, రాబోయే మ్యాచ్‌లలో తనదైన శైలిలో చెలరేగి, విమర్శకుల నోళ్లు మూయిస్తాడని అభిమానులు ఆశిస్తున్నారు.

## 2027లో కాస్త ముందుగానే ఐపీఎల్ సీజన్.. మ్యాచ్?లు పెంచే అవకాశం లేనట్లే !



**హైదరాబాద్ పెన్ పవర్:** వచ్చే ఐపీఎల్ సీజన్ కాస్త ముందుగానే ప్రారంభం కానుంది. తొందరగా స్టార్ట్ చేసి తొందరగా ఎండ్ చేసేందుకు బీసీసీఐ ప్లాన్ చేస్తోంది. దీంతో సమ్మర్ లో క్రికెట్ కిక్కు ఫ్యాన్స్ కు ఎర్లీగానే మొదలవనుంది. ఐపీఎల్ 2027 షెడ్యూల్ గురించి బీసీసీఐ సెక్రటరీ దేవాజిత్ సైకియా కీలక విషయాలు వెల్లడించారు. ఫ్యూచర్ ఎడిషన్‌లను మార్చి 10న ప్రారంభించి మే 15వ తేదీ నాటికి ముగించేందుకు బీసీసీఐ పరిశీలిస్తోందని ఆయన తెలిపారు. సమ్మర్ కారణంగా ఈ నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపారు. టోర్నమెంట్ చివరి దశలో తీవ్రమైన ఎండలు ఉండటంతో మ్యాచ్ లను ముందుగానే ప్రారంభించే ప్లాన్ చేస్తున్నారు. మే నెలాఖరులో ఎండలు తీవ్రంగా ఉండటం.. అలాగే ఐపీఎల్ రెండు నెలల గ్యాప్ లో ఇంటరనేషన్ క్రికెట్ క్యాలెండర్‌ను సర్దుబాటు చేయాలంటే సవాళ్లు ఎదురవుతున్న తరుణంలో ఈ ప్రతిపాదన వచ్చినట్లు తెలుస్తోంది. ఈ ఏడాది (2026) ఐపీఎల్ మార్చి 29 (28) తేదీలలో మొదలై, మే 31 నాటికి ముగిసింది. మే 15 తర్వాత టోర్నమెంట్ చివరి దశలో వర్షాలు కురిసే ప్రమాదాన్ని దృష్టిలో ఉంచుకుని చర్చలు జరుపుతున్నాం. అటు తీవ్ర ఎండలు, ఇటు వర్షాల నుంచి తప్పించుకుని.. షెడ్యూల్ ను ముందుగానే ముగించాలని ప్లాన్ లో ఉన్నట్లు చెప్పారు.

**74 నుంచి 94 పెంచడం కష్టమే..**

లీగ్‌ను పెంచాలని సూచనలు వస్తున్నప్పటికీ, ఇంటర్నేషనల్ షెడ్యూలింగ్ పరిమితుల కారణంగా మ్యాచ్ లను పెంచడం కష్టమేనని అన్నారు. ఫ్యూచర్ లో మ్యాచ్‌ల సంఖ్యను 74 నుండి 94కు పెంచే అవకాశం లేదని స్పష్టం చేశారు.



# జక్కన్న టేబుల్ ప్రాఫిట్.. ఈసారి కెరీర్ లోనే టాప్?





దర్శకధీరుడు రాజమౌళి సినిమా అంటే ఆడియన్స్ లో ఎంత క్రేజ్ ఉంటుందో, ట్రేడ్ వర్గాల్లో కూడా అంతే నమ్మకం ఉంటుంది. ఆయన సినిమా విడుదలకు ముందే డీల్స్ ద్వారా భారీ బిజినెస్ జరగడం కొత్త విషయం కాదు. అయితే ప్రస్తుతం సూపర్ స్టార్ మహేష్ బాబుతో తెరకెక్కిస్తున్న వారణాసి విషయంలో ఆ రేంజ్ మరింత పెరిగే అవకాశం ఉందని ఇప్పుడు చర్చ జరుగుతోంది. అయితే సినీ ఇండస్ట్రీలో ఎప్పటికప్పుడు వినిపించే పదం టేబుల్ ప్రాఫిట్. అంటే మూవీ ప్రొడక్షన్ కు అయిన ఖర్చు కంటే, విడుదలకు ముందే థియేట్రికల్, డిజిటల్, శాటిలైట్, మ్యూజిక్ రైట్స్ ద్వారా వచ్చే ఆదాయం ఎక్కువగా ఉంటే నిర్మాతలు ముందుగానే లాభాల్లోకి వెళ్లినట్లే. అలాంటి సిచ్యువేషన్ నే టేబుల్ ప్రాఫిట్ గా ట్రీట్ చేస్తారు. రాజమౌళి కెరీర్ ను పరిశీలిస్తే ఆ ట్రెండ్ చాలా కాలంగా కనిపిస్తోంది.
ఆయన కెరీర్ స్టార్టింగ్ నుంచి బయ్యర్లు, డిస్ట్రిబ్యూటర్లలో మంచి నమ్మకం ఏర్పడింది. వరుస విజయాలతో ఆ నమ్మకం మరింత బలపడింది. దీంతో ప్రతి కొత్త సినిమాకు గత చిత్రం కంటే ఎక్కువ బిజినెస్ జరగడం కామన్ అయిపోయింది. మగధీర, ఈగ వంటి చిత్రాల సమయంలో రాజమౌళి మార్కెట్ బాగా పెరిగింది. ఆ తర్వాత వచ్చిన బాహుబలి సిరీస్ ఇండియన్ సినిమా మార్కెట్ ను పూర్తిగా మార్చేసింది. ముఖ్యంగా బాహుబలి 2 విడుదలకు ముందే రైట్స్ రూపంలో భారీ ఆదాయం సాధించింది. ఆ సినిమా తర్వాత రాజమౌళి బ్రాండ్ వాల్యూ ఇంటర్నేషనల్ లెవెల్ కు చేరుకుంది. ఆర్ఆర్ఆర్ మూవీతో ఆ క్రేజ్ మరోసారి రుజువైంది. తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర లాంగ్వేజెస్, ఓవర్సీస్ మార్కెట్లలో కూడా ఆ చిత్రానికి భారీ డిమాండ్ కనిపించింది. డిజిటల్, శాటిలైట్, థియేట్రికల్ రైట్స్ ద్వారా విడుదలకు ముందే పెద్ద మొత్తంలో బిజినెస్ జరిగింది. ఇప్పుడు అదే అంచనాలు వారణాసిపై కనిపిస్తున్నాయి. మహేష్ బాబు హీరోగా రూపొందుతున్న ఆ సినిమా ఇప్పటికే పాన్ ఇండియా రేంజ్ లో ఫుల్ క్రేజ్ సంపాదించుకుంది. అఫీషియల్ గా కంప్లీట్ బిజినెస్ డిటైల్స్ బయటకు రాకపోయినా, ఓటీటీ రైట్స్ కోసం బడా ప్లాట్ ఫామ్స్ ఆసక్తి చూపుతున్నాయనే ఇప్పుడు సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. మేకర్స్ ఒక్క ఓటీటీ డీల్ ద్వారానే రూ.500 కోట్లు ఆశిస్తున్నట్లు వినికిడి. అయితే వారణాసి బడ్జెట్ రూ.1000 కోట్ల రేంజ్ లో ఉండొచ్చని ఇప్పటికే వార్తలు వచ్చాయి. దీంతో ఓటీటీ డీల్ వాల్యూ రూ.500 కోట్లు అయితే.. మిగతా డీల్స్ తోనూ పెద్ద మొత్తంలో డబ్బులు వస్తాయి. దీంతో రాజమౌళి బ్రాండ్, మహేష్ బాబు స్టార్ డమ్ కలిసి రావడంతో విడుదలకు ముందే రికార్డు లెవెల్ బిజినెస్ జరిగి.. భారీ టేబుల్ ప్రాఫిట్ తీసుకురావచ్చనే అంచనాలు ఉన్నాయి. అదే సమయంలో గతంలో రాజమౌళి సినిమాలు సాధించిన బిజినెస్ రికార్డులు చూస్తే, వారణాసి వాటిని బ్రేక్ చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే ఒక విషయం మాత్రం క్లియర్ గా కనిపిస్తోంది. విడుదలకు ముందే భారీ బిజినెస్ జరగడం రాజమౌళి సినిమాలకు అలవాటైపోయింది. అదే ట్రెండ్ కొనసాగితే వారణాసి ఆయన కెరీర్ లోనే హైయెస్ట్ టేబుల్ ప్రాఫిట్ సాధించిన చిత్రంగా నిలిచే అవకాశాలు ఉన్నాయి.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965